RNI TELTEL/2024/89620

నేటి
# శుభోదయం
ప్రతి క్షణం – ప్రజల కోసం
తెలుగు దినపత్రిక

GK MEDIA

పచురణ : హైదరాబాద్, రంగారెడ్డి, సంపుటి 01, సంచిక 285, సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు, పేజీలు -8 మంగళవారం - 14 - జనవరి - 2025 , వెల రూ.5/-



నెహ్రూ యాదృచ్ఛికంగా ప్రధాని అయ్యారు..

## కేంద్ర మంత్రి సంచలన వ్యాఖ్యలు

బీఆర్ అంబేద్కర్, సర్దార్ వల్లభాయ్ పటేల్ అర్హులన్న మనోహర్ లాల్ ఖట్టర్

మునుపెన్నడూ లేని రీతిలో అంబేద్కర్‌ను బీజేపీ ప్రభుత్వం గౌరవిస్తోందన్న మాజీ ముఖ్యమంత్రి

యాదృచ్ఛికంగా సీఎం అయిన వ్యక్తి ఇలాంటి వ్యాఖ్యలు



2లో

15వ తేదీన ఇందిరాభవన్ ను

## ప్రారంభించనున్న సోనియాగాంధీ

ఢిల్లీ కోట్ల రోడ్ లో కాంగ్రెస్ పార్టీ కొత్త జాతీయ ప్రధాన కార్యాలయం

అక్బర్ రోడ్ నుంచి కోట్ల రోడ్ కు మారనున్న ప్రధాన కార్యాలయం అడ్రస్

ప్రారంభోత్సవ కార్యక్రమానికి 400 మందికి ఆహ్వానాలు



2లో

వైఎస్ ఉన్నా విభజన

## ఆగేది కాదు

- రాష్ట్ర విభజనపై కిరణ్ కుమార్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు
- రాష్ట్ర విభజనకు వ్యతిరేకం కాదనే తీర్మానాన్ని వైఎస్ హయాంలోనే పెట్టామన్న కిరణ్ కుమార్ రెడ్డి
- రాష్ట్ర విభజన చేయాలని ప్రణబ్ ముఖర్జీ చెప్పారని వెల్లడి



## 26 నుంచి రేషన్ కార్డుల జారీ

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ప్రకటన

స్థలం లేని పేదలకూ ఇంటి సదుపాయం

హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్: ఈ నెల 26 నుంచి హైదరాబాద్‌లో కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియా ప్రారంభించనున్నట్లు జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. అదే రోజు నుంచి ఇందిరమ్మ ఇళ్లకు ఎంపికైన లబ్ధిదారుల వివరాలు కూడా వెల్లడిస్తామన్నారు. ఆదివారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాజకీయాలకతీతంగా, ఇతర జిల్లాలకు ఆదర్శంగా రాజధాని నగరంలో రేషన్ కార్డుల పంపిణీ, ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. సొంత స్థలమున్న పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చేందుకు ఎంతో ప్రాధాన్యమిస్తున్నామని చెప్పారు. గతంలో ఉన్న నిబంధనలకనుగుణంగానే కొత్త రేషన్ కార్డులు జారీ చేయనున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల పరిశీలన 50 శాతం పూర్తయిందని, మిగతా..2లో

# రూ.2,700 కోట్లతో జడ్ మోడ్ సొరంగం నిర్మాణం

జమ్మూకశ్మీర్‌లో జడ్ మోడ్ సొరంగాన్ని ప్రారంభించిన ప్రధాని మోదీ

టన్నెల్ లోపలకు వెళ్లి పరిశీలించిన ప్రధాని మోదీ

కార్యక్రమంలో పాల్గొన్న లెఫ్టినెంట్ గవర్నర్ సిన్హా, సీఎం ఒమర్ అబ్దుల్లా, గడ్కరీ

ప్రాణాలను పణంగా పెట్టారు..

Z-Morh టన్నెల్ ప్రారంభోత్సవంలో కార్మికులకు ప్రధాని మోదీ నివాళులు..

ప్రాణాలను పణంగా పెట్టారు..

Z-Morh టన్నెల్ ప్రారంభోత్సవంలో కార్మికులకు ప్రధాని మోదీ నివాళులు..

ఢిల్లీ: కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించిన సోనామార్గ్ టన్నెల్ ప్రజలకు అందుబాటులోకి వచ్చింది.. దాదాపు 2,500 కోట్ల రూపాయల ఖర్చుతో నిర్మించిన Z-Morh టన్నెల్‌ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సోమవారం దేశ ప్రజలకు అంకితం చేశారు. పూర్తిగా సొరంగ మిగతా..2లో



ప్రధాని నరేంద్రమోదీ ఈరోజు జమ్మూకశ్మీర్‌లోని గాందర్‌బల్ జిల్లాలోని జడ్ మోడ్ సొరంగాన్ని ప్రారంభించారు. ఆ తర్వాత టన్నెల్ లోపలికి వెళ్లి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, సీఎం ఒమర్ అబ్దుల్లా, కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ పాల్గొన్నారు. శ్రీనగర్ –లేహ్ జాతీయ రహదారిపై సోన్ మార్గ్ ప్రాంతంలో రూ.2,700 కోట్లతో ఈ జడ్ మోడ్ సొరంగాన్ని నిర్మించారు. కొండచరియలు, మంచు కారణంగా రాకపోకలకు సమస్యగా మారడంతో ఈ టన్నెల్‌ను నిర్మించారు. ఇది సముద్రమట్టానికి 8,650 అడుగుల ఎత్తులో ఉంది. ఈ సొరంగం ఆరున్నర కిలోమీటర్ల పొడవు ఉంటుంది. 2015లో ప్రారంభమైన దీని నిర్మాణ పనులు గత ఏడాది పూర్తయ్యాయి.



## తెలుగు ప్రజలందరికీ సీఎం రేవంత్ రెడ్డి సంక్రాంతి శుభాకాంక్షలు

రాష్ట్రంలోని దాదాపు కోటి మంది రైతులు, నిరుపేదలు, వ్యవసాయ కూలీ కుటుంబాల్లో ఈ పండుగ కొత్త వెలుగులు

2లో

కార్చిచ్చు వేళ అందినకాడికి

## దోచుకుంటున్న దొంగలు..

29 మంది అరెస్ట్

అమెరికా: అమెరికాలో కార్చిచ్చు బీభత్సం సృష్టిస్తోంది. ఈ వైల్డ్‌ఫైర్ కారణంగా అమెరికాలోని సంపన్నుల నగరంగా పేరొందిన లాస్ ఏంజెల్స్ మరభూమిని తలపిస్తోంది. ఖరీదైన ఇళ్లు, కార్లు, విలువైన సామగ్రి మంటల్లో కాలిబూడిదవుతున్నాయి. చాలా మంది ధనవంతులు, సెలబ్రిటీలు తమ



సామాన్లు, కార్లను ఇళ్లలోనే వదిలేసి బతుకుజీవుడా అంటూ సురక్షిత ప్రాంతాలకు తరలి పోతున్నారు. మిగతా..2లో

తిరుమల తొక్కిసలాట ఘటనపై


## సారీ చెబితే సరిపోతుందా..

పవన్ కల్యాణ్‌పై వైఎస్ జగన్ ఆగ్రహం

అమరావతి: వైకుంఠ ద్వార దర్శనం సందర్భంగా తిరుపతిలో జరిగిన తొక్కిసలాటపై మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మరోసారి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రపంచ ప్రఖ్యాతి చెందిన టీటీడీ చరిత్రలో ఎప్పుడూలేని విధంగా తొలిసారిగా తొక్కిసలాట జరిగి, ఆరుగురు మరణించిన ఘటనకు సంబంధించిన బాధ్యులపై చర్యల విషయంలో చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు అత్యంత దుర్మార్గంగా ఉందని విమర్శించారు. చంద్రబాబు నిర్లక్ష్య వైఖరి, తన చుట్టూ 6వ తారీఖు నుంచి 8వ



తేదీ మధ్యాహ్నం వరకూ పోలీసులను, అందరినీ తన కుప్పం కార్యక్రమంలో పెట్టుకోవడం, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడం మొదలు, టీటీడీ కార్యకలాపాలు, వ్యవహారాల మీద పూర్తి నియంత్రణ ఉన్న టీటీడీ బోర్డు ఛైర్మన్, ఈవో, అడిషనల్ ఈవో సహా, స్థానిక కలెక్టర్, ఎస్పీల నిర్లక్ష్యమే తొక్కిసలాటకు కారణంగా తేలిందని అన్నారు. అయినప్పటికీ విచారణ చేసి, జైల్లో పెట్టాల్సిన వీరిని చంద్రబాబు కూటమి ప్రభుత్వం విడిచిపెట్టిందంటే దాని మిగతా..2లో



## ప్రధాని మోదీ యూట్యూబ్ సంపాదన ఎంతో తెల్సా.. ఎన్ని కోట్లంటే.?

అటు రాజకీయాల్లో.. ఇటు ఇంటర్నెట్‌లో.. ప్రధాని నరేంద్ర మోదీ ఫ్యాన్ ఫాలోయింగ్ అంతా ఇంతా కాదు సోషల్ మీడియాలో ఒక్క పోస్ట్ పెట్టారంటే చాలు.. కోట్లలో లైకులు, షేర్లు, కామెంట్స్



2లో


## సొంతూరులో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన చంద్రబాబు

సంక్రాంతి జరుపుకునేందుకు స్వగ్రామానికి విచ్చేసిన చంద్రబాబు

రూ.కోట్ల విలువైన వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన

విద్యుత్ సబ్ స్టేషన్ కు భూమి పూజ


మహిళలకు ఎలక్ట్రిక్ ఆటోల పంపిణీ




# మహా కుంభమేళా.. రూ.2లక్షల కోట్ల వ్యాపారం!

భక్తజనసంద్రంగా త్రివేణి సంగమం

ఇంటర్నెట్ డెస్క్: ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక కార్యక్రమం 'మహా కుంభమేళా' కు లక్షలాది మంది తరలివస్తున్నారు. తొలిరోజు ఉదయానికే దాదాపు 60 లక్షల మంది భక్తులు త్రివేణీ సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించారు. ఇలా 45రోజుల పాటు సాగే ఈ మేళా ద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు రూ.2 లక్షల కోట్ల మేర ఆదాయం సమకూరనుందని వ్యాపార వర్గాలు అంచనా వేస్తున్నాయి. "మహాకుంభమేళా వల్ల వాణిజ్యం, ఆర్థిక కార్యకలాపాలు భారీ స్థాయిలో జరుగుతాయి. ఒక్కో వ్యక్తి సగటున రూ.5వేలు ఖర్చు పెట్టినా.. మొత్తం రూ.2లక్షల కోట్లు అవుతుంది. హోటళ్లు, గెస్ట్‌హౌస్‌లు, తాత్కాలిక నివాస ప్రాంతాలు, ఆహారం, వస్తువులు, ఆ ం ో ‍ ్ ృ సంరక్షణతోపాటు ఇతర సేవలు వంటివి ఈ ఖర్చులో ఉంటాయి" అని కాన్ఫెడరేషన్ ఆఫ్






ఆల్ ఇండియా ట్రేడర్స్‌జనరల్ సెక్రటరీ ప్రవీణ్ ఖాండేవాల్ పేర్కొన్నారు. స్థానిక హోటళ్లు, గెస్ట్ హౌస్‌లు, తాత్కాలిక లాడ్జీల ద్వారానే రూ.40వేల కోట్ల ఆదాయం సమకూరే అవకాశం ఉందని అంచనా. ప్యాకేజీ ఫుడ్, నీరు, బిస్కెట్లు,

## నెహ్రూ యాధృచ్ఛికంగా ప్రధాని అయ్యారు..
# కేంద్ర మంత్రి సంచలన వ్యాఖ్యలు

ఢిల్లీ: జవహర్‌లాల్ నెహ్రూ యాదృచ్ఛికంగా దేశానికి మొట్టమొదటి ప్రధానమంత్రి అయ్యారని కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆ పదవికి సర్దార్ వల్లభాయ్ పటేల్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అర్హులని ఆయన అన్నారు. హర్యానాలోని రోహ్‌తక్‌లో ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. డాక్టర్ అంబేద్కర్ వారసత్వాన్ని గౌరవించడంలో బీజేపీ పాత్ర అనే అంశంపై మాట్లాడుతూ ఖట్టర్ ఈ వ్యాఖ్యలు చేశారు. "రాజ్యాంగం మన పవిత్ర గ్రంథం. దీనిని రూపొందించడంలో డాక్టర్ అంబేద్కర్ చేసిన కృషిని ఎల్లకాలం మనం గుర్తుపెట్టుకోవాలి. అంబేద్కర్ కూడా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆయన చనిపోతే అంత్యక్రియలకు ఢిల్లీలో కనీసం చోటు కూడా ఇవ్వలేదు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మునుపెన్నడూ లేని రీతిలో అంబేద్కర్‌ను గౌరవిస్తోంది. అంబేద్కర్ పేరుతో ఐదు పవిత్ర స్థలాలను ఏర్పాటు చేసింది" అని పేర్కొన్నారు. కాగా, మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ స్మారక నిర్మాణానికి మోదీ ప్రభుత్వం ఢిల్లీలో స్థలం కేటాయించిన నేపథ్యంలో ఖట్టర్ ఈ వ్యాఖ్యలు చేశారు. అయితే, మనోహర్‌లాల్ ఖట్టర్ చేసిన వ్యాఖ్యలకు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, హర్యానా మాజీ సీఎం భూపిందర్ హుడా కౌంటర్ ఇచ్చారు. యాదృచ్ఛికంగా ముఖ్యమంత్రి అయిన వ్యక్తి ఈ తరహా వ్యాఖ్యలు చేయడం సబబు కాదని వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

## 15వ తేదీన ఇందిరాభవన్ ను
# ప్రారంభించనున్న సోనియాగాంధీ

ఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యాలయం అడ్రస్ మారబోతోంది. ఓల్డ్ గ్రాండ్ పార్టీ కాంగ్రెస్ నూతన జాతీయ కార్యాలయాన్ని నిర్మించిన సంగతి తెలిసిందే. ఈ కార్యాలయాన్ని కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియాగాంధీ ఈ నెల 15వ తేదీన ఉదయం 10 గంటలకు ప్రారంభించనున్నారు. ఈ కార్యమానికి రాహుల్ గాంధీ, ప్రియాకాగాంధీ, మల్లికార్జున ఖర్గే కూడా హాజరవుతారు. కాంగ్రెస్ పార్టీ ప్రస్తుత జాతీయ కార్యాలయం అక్బర్ రోడ్ లో ఉంది. కొత్త కార్యాలయాన్ని కోట్ల రోడ్ లో నిర్మించారు. ఈ క్రమంలో పార్టీ అడ్రస్ అక్బర్ రోడ్ నుంచి కోట్ల రోడ్ కు మారనుంది. కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమానికి 400 మందికి ఆహ్వానాలు అందాయి. వీరిలో సీడబ్ల్యూసీ సభ్యులు, శాశ్వత సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు, కాంగ్రెస్ ముఖ్యమంత్రులు, కాంగ్రెస్ మాజీ ముఖ్యమంత్రులు, పీసీసీ అధ్యక్షులు, కాంగ్రెస్ శాసనసభా పక్ష నేతలు, ఏఐసీసీ కార్యదర్శులు, లోక్ సభ, రాజ్యసభ సభ్యులు ఉన్నారు.

# వైఎస్ ఉన్నా విభజన ఆగేది కాదు

హైదరాబాద్: దివంగత ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి బతికుంటే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన జరిగుండేది కాదని... రాష్ట్ర విభజనను ఆయన అడ్డుకుని ఉండేవారని చాలా మంది భావిస్తుంటారు. అయితే, ఈ విషయంపై ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చివరి ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రాజశేఖరరెడ్డి ఉంటే రాష్ట్ర విభజన జరిగి ఉండేది కాదని చాలా మంది అనుకుంటూ ఉంటారని... కానీ, రాష్ట్ర విభజనకు వ్యతిరేకం కాదు అనే తీర్మానాన్ని రాజశేఖరరెడ్డి హయాంలోనే కాంగ్రెస్ అధిష్ఠానం పెట్టించాలని చూసిందని కిరణ్ కుమార్ రెడ్డి సంచలన విషయాన్ని వెల్లడించారు. 2014లో జరిగిన రాష్ట్ర విభజన 2009లోనే జరగాల్సిందని చెప్పారు. తాను చీఫ్ విప్ గా ఉన్నప్పుడు రాజశేఖరరెడ్డి పిలిచి... 'మనం తెలంగాణ రాష్ట్రానికి అనుకూలం' అనే తీర్మానాన్ని అసెంబ్లీలో పెట్టాలని చెప్పారని తెలిపారు. ఎన్నికల ముందు మనం ఈ తీర్మానాన్ని పెడితే మనం ఓడిపోతామని ఆయనతో తాను చెప్పానని... 'నా చేతుల్లో ఏమీ లేదు. రాష్ట్ర విభజన చేయాలని ప్రణబ్ ముఖర్జీ చెప్పారు' అని ఆయన తనతో అన్నారని చెప్పారు. దీంతో తాము ప్రణబ్ ముఖర్జీతో మాట్లాడామని... 'మేము తెలంగాణకు అనుకూలం' అనే తీర్మానాన్ని 'మేము తెలంగాణకు వ్యతిరేకం కాదు' అని మార్చి పెట్టామని వెల్లడించారు. రాష్ట్ర విభజన జరగదనే తాము అనుకున్నామని... దురదృష్టవశాత్తు రాష్ట్రం విడిపోయిందని కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. వైఎస్ ఉన్నా విభజన ఆగేది కాదని చెప్పారు.

## తెలుగు ప్రజలందరికీ
# సీఎం రేవంత్ రెడ్డి సంక్రాంతి శుభాకాంక్షలు

హైదరాబాద్ : తెలుగు ప్రజలందరికీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. భోగ భాగ్యాలను అందించే భోగి.. కొత్త కాంతులు తెచ్చే సంక్రాంతి.. కనుమ పండుగలను అందరూ ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలోని దాదాపు కోటి మంది రైతులు, నిరుపేదలు, వ్యవసాయ కూలీ కుటుంబాల్లో ఈ పండుగ కొత్త వెలుగులు తెస్తుందని అన్నారు. రైతు భరోసాను రూ.12 వేలకు పెంచటంతో పాటు వ్యవసాయ కూలీ కుటుంబాలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా నగదు సాయం, ఆహార భద్రతను అందించే కొత్త రేషన్ కార్డులు, గూడు లేని పేదలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసే నాలుగు సంక్షేమ పథకాల అమలుకు సంక్రాంతి పండుగ నాంది పలుకుతోందని అన్నారు. ప్రతి సంక్షేమ పథకం అర్హులైన వారందరికీ చేరాలనేది తన సంకల్పమని ముఖ్యమంత్రి అన్నారు. వ్యవసాయంతో పాటు ఉపాధి కల్పన, పారిశ్రామిక రంగాలన్నింటా తెలంగాణ రాష్ట్రం తిరుగులేని పురోగమనం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. స్వేచ్ఛా సౌభాగ్యాలతో ప్రజలందరూ సంతోషంగా తెలుగు సంప్రదాయం ఉట్టిపడేలా సంక్రాంతి పండుగ సంబురాలు జరుపుకోవాలని అన్నారు. పతంగులు ఎగరవేసేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

# ప్రధాని మోదీ యూట్యూబ్ సంపాదన
# ఎంతో తెల్సా.. ఎన్ని కోట్లంటే.?

ఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీకి సోషల్ మీడియాలో విపరీతమైన ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. సామాన్యుల దగ్గర నుంచి సెలబ్రిటీల వరకు అందరికీ నచ్చిన.. మెచ్చిన రాజకీయ నేత ప్రధాని మోదీ. అలాగే ప్రధానికి ఓ అధికారిక యూట్యూబ్ ఛానెల్ ఉంది. దానికి ఆదాయం ఎంతంటే.. అటు రాజకీయాల్లో.. ఇటు ఇంటర్నెట్‌లో.. ప్రధాని నరేంద్ర మోదీ ఫ్యాన్ ఫాలోయింగ్ అంతా ఇంతా కాదు. పాలిటిక్స్‌లో ఎప్పుడూ యాక్టివ్‌గా ఉండే ఆయన సోషల్ మీడియాలో ఒక్క పోస్ట్ పెట్టారంటే చాలు.. కోట్లలో లైకులు, షేర్లు, కామెంట్స్ వచ్చిపడతాయి. క్షణాల్లో వైరల్‌గా మారుతుంది. ప్రపంచవ్యాప్తంగా యూట్యూబ్‌లో 20 మిలియన్లకు పైగా సబ్‌స్క్రైబర్లు ఉన్న రాజకీయ నేతగా ప్రధాని మోదీ అగ్రస్థానంలో నిలిచారు. ఆయనకంటూ అధికారిక యూట్యూబ్ ఛానెల్ ఉన్న సంగతి తెలిసిందే. ఇందులో ఆయన చేపట్టే అన్ని ప్రారంభోత్సవాలు, అధికారిక కార్యక్రమాలు, ఇంటర్వ్యూలు ప్రసారమవుతాయి. మరి ఈ ఛానెల్‌కు ఎంతమంది సబ్‌స్క్రైబర్లు ఉన్నారు. ఎంత ఆదాయం వస్తుందో తెలిస్తే షాక్ అవుతారు. ప్రధాని మోదీకి ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాతో సహా వివిధ సోషల్ మీడియాలో ప్లాట్‌ఫామ్స్‌లో అకౌంట్లు ఉన్నాయి. అదేవిధంగా ఆయనకు ఓ అధికారిక యూట్యూబ్ ఛానెల్ కూడా ఉంది. ఈ ఛానల్ 2007 అక్టోబర్ 26వ తేదీన ప్రారంభించారు. ఈ ఛానెల్‌కు 26 మిలియన్లకు పైగా సబ్‌స్క్రైబర్లు ఉండగా.. ఇప్పటివరకు 29,272 వీడియోలు పోస్ట్ అయ్యాయి. ఇక ఆ వీడియోలకు మొత్తం 636 కోట్లకు పైగా వ్యూస్ వచ్చాయి. ఓ నివేదిక ప్రకారం ఈ ఛానెల్ ద్వారా ప్రధాని మోదీకి నెలకు రూ. 1.62 కోట్ల నుంచి రూ. 4.88 కోట్ల ఆదాయం వస్తోందట.

# సొంతూరులో అభివృద్ధి పనులకు
# శ్రీకారం చుట్టిన చంద్రబాబు

అమరావతి: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు సొంతూరు నారావారిపల్లెలో మకాం వేశారు. ఇవాళ ఆయన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. స్వగ్రామంలో విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సబ్ స్టేషన్ ను రూ.3 కోట్ల వ్యయంతో నిర్మించనున్నారు. మహిళా సంఘాలకు చౌకగా, నాణ్యమైన నిత్యావసరాల చేరవేతకు ఈజీ మార్ట్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈజీ మార్ట్ ద్వారా ఆన్ లైన్ లో బుక్ చేసుకున్న మహిళా సంఘాలకు నిత్యావసరాలు డోర్ డెలివరీ చేస్తారు. తన పర్యటనలో భాగంగా సీఎం చంద్రబాబు నారావారిపల్లెలో మహిళలకు ఎలక్ట్రిక్ ఆటోలు పంపిణీ చేశారు. అంగన్ వాడీ కేంద్రాల్లో పిల్లల ఐక్యూ పెరుగుదలకు కేర్ అండ్ గ్రో సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నారు. తొలుత నారావారిపల్లె పరిధిలోని 8 అంగన్ వాడీ కేంద్రాల్లో ఐక్యూ పెరుగుదల విధానాన్ని ప్రయోగాత్మకంగా అమలు చేయనున్నారు. మైక్రో ఇరిగేషన్ పథకాన్ని కూడా చంద్రబాబు ప్రారంభించారు. ఇక, రూ.2 కోట్లతో రంగంపేటలో రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. రూ.1 కోటితో రంగంపేట జడ్పీ హైస్కూల్ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. తన పర్యటన సందర్భంగా చంద్రబాబు పలువురి నుంచి వినతులు కూడా స్వీకరించారు.

# 26 నుంచి
# రేషన్ కార్డుల జారీ

మొదటి పేజీ తరువాయి



వాటిలో దాదాపు 10 వేల మంది అర్హులున్నట్లు తెలిపారు. ప్రభుత్వం పేదలకు అందజేస్తున్న సంక్షేమ పథకాలకు 'ప్రజాపాలన' సందర్భంగా దరఖాస్తులు ఇవ్వలేకపోయిన వారు ఇప్పుడు కూడా సంబంధిత కార్యాలయాల్లో ఇవ్వవచ్చని పొన్నం తెలిపారు. సమావేశంలో ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, మేయర్ విజయలక్ష్మి, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, ప్రకాశ్‌గౌడ్, జాఫర్ హుస్సేన్, మీర్ జుల్ఫికర్ అలీ, మాజిద్ హుస్సేన్, రాజాసింగ్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి, జిల్లా కలెక్టర్ అనుదీప్ తదితరులు పాల్గొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు క్రమంలో దరఖాస్తు చేస్తున్నవారి అర్హత విషయంలో ప్రభుత్వం కొన్ని సాంకేతిక సవరణలు చేయాలని మంత్రికి మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి సూచించారు. ఎల్లో కలర్ ప్లేట్ టాక్సీ డ్రైవర్లను కూడా ఇళ్లకు అర్హులుగా గుర్తించడం ద్వారా పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. వికలాంగుల జాబితాలో తలసేమియా బాధితులను, కీమో థెరపీ చేయించుకునే వారిని, డయాలసిస్ పేషెంట్లకు కూడా చేర్చాలని కోరారు. వీరికి ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు మంజూరు చేయాలన్నారు.

# రూ.2,700 కోట్లతో జడ్ మోడ్ సొరంగం నిర్మాణం

మొదటి పేజీ తరువాయి



పూర్తిగా సొరంగ మార్గంలో నిర్మించిన సోనామార్గ్ టన్నెల్ పొడవు ఆరున్నర కిలోమీటర్లు ఉంటుంది..

కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించిన సోనామార్గ్ టన్నెల్ ప్రజలకు అందుబాటులోకి వచ్చింది.. దాదాపు 2,500 కోట్ల రూపాయల ఖర్చుతో నిర్మించిన Z-Morh టన్నెల్‌ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సోమవారం దేశ ప్రజలకు అంకితం చేశారు. పూర్తిగా సొరంగ మార్గంలో నిర్మించిన సోనామార్గ్ టన్నెల్ పొడవు ఆరున్నర కిలోమీటర్లు ఉంటుంది.. మొత్తం 12 కిలోమీటర్ల ప్రాజెక్టులో -మోడ్ టన్నెల్ పొడవు 6.5 కిలోమీటర్లు.. దీని ద్వారా సోనామార్గ్‌కు ఏడాది పొడవునా కనెక్టివిటీ ఉంటుంది. శీతాకాలంలో తీవ్ర హిమపాతం ఉన్నప్పటికీ రవాణాకు ఆటంకం లేకుండా టన్నెల్ ద్వారా ప్రయాణం చేయవచ్చు. కాగా.. Z-Morh టన్నెల్ ప్రారంభోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ.. కీలక వ్యాఖ్యలు చేశారు.. ప్రాజెక్టును పూర్తి చేస్తున్న క్రమంలో ప్రాణాలు కోల్పోయిన ఏడుగురు కార్మికులకు నివాళులర్పించారు. కార్మికులు తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి పనిచేశారని ప్రశంసించారు. జమ్ముకశ్మీర్ ఆర్థిక వ్యవస్థకు, పర్యాటక రంగానికి ఈ -మోడ్ టన్నెల్ ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు ప్రధాని మోదీ. ఈ సందర్భంగా ప్రధాని మోదీ జమ్మూ కాశ్మీర్‌తో తనకున్న లోతైన సంబంధాన్ని గుర్తుచేసుకున్నారు.. జమ్మూకశ్మీర్‌తో తనకు పాత సంబంధాలే ఉన్నాయని ప్రధాని మోదీ అన్నారు. ఈ రోజు తాను గొప్ప బహుమతితో ఈ ప్రాంత ప్రజల మధ్యకు వచ్చానన్నారు. కొద్ది రోజుల క్రితం జమ్ములో రైల్వే డివిజన్‌కు శంకుస్థాపన చేసే అవకాశం తనకు లభించిందన్నారు. ఈ రోజు సోనామార్గ్ టన్నెల్‌ను దేశానికి, జమ్మూ ప్రజలకు అప్పగించే అవకాశం తనకు లభించిందన్నారు. జమ్మూ-కశ్మీర్, లడఖ్ చిరకాల కోరిక ఈ రోజు నెరవేరిందని పేర్కొన్నారు. మోదీ శంకుస్థాపన చేశారంటే.. ప్రారంభిస్తారని.. అందుబాటులోకి తీసుకువస్తారని... ఇదే అందరూ నమ్మారని ప్రధాని మోదీ అన్నారు. ప్రతి పనికి ఒక సమయం ఉంటుందని.. సరైన సమయంలో సరైన పని జరుగుతుందన్నారు. 2015 లో తమ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మాత్రమే సోనామార్గ్ టన్నెల్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని.. తమ ప్రభుత్వ హయాంలో ఈ సొరంగం పనులు పూర్తి కావడం సంతోషంగా ఉందని మోదీ పేర్కొన్నారు.

ప్రధాని మోదీని ప్రశంసించిన సీఎం ఒమర్ అబ్దుల్లా..

జమ్మూ కాశ్మీర్‌లో ఎన్నికలు సజావుగా జరగడంపై ఒమర్ అబ్దుల్లా ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలిపారు.. "జమ్మూ కాశ్మీర్‌లో ఎన్నికలు జరిగాయి.. ఎక్కడా ఎలాంటి అక్రమాలు జరిగినట్లు ఫిర్యాదులు లేవు.. అధికార దుర్వినియోగానికి ఫిర్యాదు లేదు. ఈ ఘనత మీకు (ప్రధాని మోదీకి), మీ సహచరులకు, భారత ఎన్నికల కమిషన్‌కు చెందుతుంది.. రాష్ట్ర హోదాను పునరుద్ధరిస్తామన్న మీ వాగ్దానాన్ని అతి త్వరలో మీరు (పీఎం మోదీ) నెరవేరుస్తారని నా హృదయం చెబుతోంది".. అంటూ ఒమర్ అబ్దుల్లా పేర్కొన్నారు.

ఈ ఇంజినీరింగ్ మైలురాయిని సాధించడానికి కఠినమైన పరిస్థితులను అధిగమించడంలో కార్మికుల అంకితభావాన్ని ప్రశంసిస్తూ ప్రాజెక్ట్‌లో పాలుపంచుకున్న అధికారులు, కార్మికులతో ప్రధానమంత్రి మోదీ ప్రత్యేకంగా సంభాషించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, జమ్మూ %e% కాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా, లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా పాల్గొన్నారు. ప్రారంభోత్సవం తరువాత, ప్రధాని మోదీ సొరంగాన్ని పరిశీలించారు.. దాని రూట్ మ్యాప్‌ను సమీక్షించారు.. నిర్మాణ ప్రక్రియపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.

అన్నివైపులా టన్నెల్స్..

కశ్మీర్ లోయలో చలికాలం కురిసే మంచు..రవాణా వ్యవస్థను స్తంభింపజేస్తుంది. లోయను దాటి వెళ్లాలన్నా..ఎత్తైన హిమాలయ పర్వత శిఖరాలను దాటి వెళ్లాల్సి ఉంటుంది. పర్వత శ్రేణుల్లో నివసించే గ్రామాలు, పట్టణాలకు బయటి ప్రపంచంతో సంబంధాలు పూర్తిగా తెగిపోతుంటాయి. ఈ పరిస్థితిని నివారించాలంటే పర్వతాలను అడ్డంగా తొలుస్తూ సొరంగాలను నిర్మించాల్సిందే. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం అదే పని చేస్తోంది. శ్రీనగర్‌ను..లేహ్ మార్గంతో నిరంతరం అనుసంధానించేందుకు అన్ని వైపులా టన్నెల్స్‌ను నిర్మిస్తోంది. అందులో భాగంగా సోనామార్గ్ ప్రాంతంలో నిర్మించిన జెడ్ మోడ్ టన్నెల్‌ను ప్రారంభించారు ప్రధాని మోదీ.

సోమవారం ప్రారంభించిన Z-Morh సొరంగం కశ్మీర్ లోయ - లడఖ్ మధ్య దూరాన్ని 49 కి.మీ నుంచి 43 కి.మీలకు తగ్గిస్తుంది.. వాహన వేగాన్ని గంటకు 30 కి.మీ నుండి 70 కి.మీ/గంకు పెంచుతుంది. సముద్ర మట్టానికి 8,650 అడుగుల ఎత్తులో ఉన్న ఈ సొరంగం కొండచరియలు - హిమపాతాలు సంభవించే మార్గాలను దాటవేసి, లేహ్‌కు వెళ్లే మార్గంలో శ్రీనగర్ - సోనామార్గ్ మధ్య అన్ని వాతావరణ కనెక్టివిటీని మెరుగుపరుస్తుంది..

# మహా కుంభమేళా.. రూ.2లక్షల కోట్ల వ్యాపారం!

మొదటి పేజీ తరువాయి



ప్యాకేజ్ ఫుడ్, నీరు, బిస్కెట్లు, జ్యూస్‌లు, భోజనం వంటితో రూ.20వేల కోట్ల వ్యాపారం జరగనుంది. నూనె, దీపాలు, గంగా నీరు, దేవతా విగ్రహాలు, ధూపం వంటి పూజాసామగ్రి, ఆధ్యాత్మిక పుస్తకాలు వంటి వాటితో మరో రూ.20వేల కోట్ల లావాదేవీలు జరగనున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికుల కోసం టాక్సీలు, సరకు రవాణా వంటి సేవలతో రూ.10వేల కోట్లు, టూరిస్ట్ గైడ్‌లు, ట్రావెల్ ప్యాకేజీల వంటి వాటితో మరో రూ. పదివేల కోట్ల వాణిజ్యం జరగనుంది. మెడికల్ క్యాంపులు, ఆయుర్వేద ఉత్పత్తులు, ఇతర ఔషధాలతో రూ.3వేల కోట్లు, ఈ టికెటింగ్, డిజిటల్ పేమెంట్లు, వైఫై, మొబైల్ ఛార్జింగ్ స్టేషన్లతో రూ.వెయ్యి కోట్లు, మీడియాలో ప్రకటనలు, ప్రమోషన్ కార్యక్రమాలతో రూ.10వేల కోట్ల వ్యాపారం జరగనుంది. ఇదిలాఉంటే, 2019లో జరిగిన అర్థ కుంభమేళాకు 24కోట్ల మంది భక్తులు రావడంతో.. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు రూ.1.2లక్షల కోట్లు సమకూరింది. ఈసారి నెలరోజుల పాటు సాగే ఈ మహాకుంభమేళాకు దాదాపు 40 కోట్ల మంది భక్తులు రానున్నట్లు అంచనా వేస్తుండగా.. వీరి ద్వారా యూపీకి భారీ స్థాయిలో ఆదాయం సమకూరే అవకాశం ఉన్నట్లు వ్యాపార వర్గాలు అంచనా వేస్తున్నాయి.

భక్తజనసంద్రంగా త్రివేణి సంగమం

ప్రయాగ్‌రాజ్: ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక వేడుక మహా కుంభమేళా ఘనంగా ఆరంభమైంది. గంగా, యమునా, సరస్వతీ నదుల సంగమ ప్రదేశం ఉత్తర ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ కు భక్తులు పోటెత్తారు. పుష్య పౌర్ణమి అయిన సోమవారం తెల్లవారుజామునుంచే లక్షలాదిమంది భక్తులు త్రివేణి సంగమానికి చేరుకొని పవిత్ర స్నానాలు చేస్తున్నారు. భక్తుల పూజలతో ఈ ప్రాంతం దేదీప్యమానంగా వెలుగుతోంది. ఉదయం 7.30 గంటల వరకే దాదాపు 35 లక్షల మంది ఇక్కడ పవిత్ర స్నానాలు ఆచరించారని ప్రయాగ్‌రాజ్ అధికారులు వెల్లడించారు.

45 రోజులపాటు జరిగే ఈ కార్యక్రమానికి దేశ విదేశాల నుంచి కోట్ల మంది భక్తులు, పర్యాటకులు రానున్నారు. మొత్తం 35 కోట్ల మంది వస్తారని యూపీ ప్రభుత్వం అంచనా వేస్తోంది. దీంతో భక్తులకు మెరుగైన సౌకర్యాలతో పాటు భద్రత కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. నదిలో నిరంతరం పహారా కాసేందుకు ప్రత్యేకంగా తేలియాడే పోలీసుస్టేషన్‌ను ఏర్పాటుచేశారు. అటు చిన్నచిన్న పడవలపై భద్రతా సిబ్బంది పెట్రోలింగ్ చేస్తున్నారు.

ఆధ్యాత్మిక వారసత్వం కుంభమేళా: మోదీ

కుంభమేళా ప్రారంభంపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఎక్స్ వేదికగా స్పందించారు. "భారతీయ విలువలు, సంస్కృతిని గౌరవించే కోట్లాది మందికి ఇది చాలా ప్రత్యేకమైన రోజు. ప్రయాగ్‌రాజ్‌లో మహా కుంభమేళా ప్రారంభమైంది. విశ్వాసం, భక్తి, సంప్రదాయాల సంగమంతో ఎంతోమందిని ఒకచోట చేర్చింది. మన దేశ ఆధ్యాత్మిక వారసత్వాన్ని ఈ వేడుక ప్రతిబింబిస్తుంది. పవిత్ర స్నానాలు ఆచరించి, భగవంతుడి ఆశీస్సులు తీసుకునేందుకు లెక్కలేనంతమంది రావడం ఎంతో సంతోషంగా ఉంది" అని మోదీ రాసుకొచ్చారు. 10,000 ఎకరాల్లో కుంభమేళాకు ఏర్పాట్లు జరిగాయని, ఏ సమయంలోనైనా 50 లక్షల మంది నుంచి కోటి మంది ఉండగలిగేలా సౌకర్యాలను కల్పించామని సీఎం యోగి ఆదిత్యనాథ్ ఇప్పటికే వెల్లడించారు. భద్రత కోసం 55 పోలీస్‌స్టేషన్లను ఏర్పాటుచేసింది. 45,000 మంది పోలీసులను మోహరించింది. సాధువులకు సంబంధించిన 13 అఖాడాలు కుంభమేళాలో భాగం కానున్నాయి.

## తిరుమల తొక్కిసలాట ఘటనపై
# సారీ చెబితే సరిపోతుందా..

మొదటి పేజీ తరువాయి



చంద్రబాబు కూటమి ప్రభుత్వం విడిచిపెట్టిందంటే దాని అర్థం ఏంటని ప్రశ్నించారు. జరిగిన ఘోరమైన ఘటనను సీరియస్‌గా తీసుకోలేదనేకదా అర్థం అని నిలదీశారు. తూతూమంత్రంగా తీసుకున్న చర్యలు వీరిని కాపాడడానికి కదా? శ్రీవారి భక్తుల మరణాలకు అసలు కారకులను రక్షించే ప్రయత్నం ఎందుకు చేస్తున్నట్టు? తూతూమంత్రంగా తీసుకున్న ఆ కొద్దిపాటి చర్యల్లోనూ వివక్ష చూపలేదంటారా? సంబంధంలేని వారిపై సస్పెన్షన్ వేటు వేయడం, అరెస్టుచేసి జైల్లో పెట్టాల్సిన అధికారిని కేవలం బదిలీతో సరిపెట్టడం, మరికొందరిపై అసలు చర్యలే లేకపోవడం, ప్రభావంలేని సెక్షన్లతో కేసులు పెట్టడం, వెంటనే టీటీడీ ఛైర్మన్‌ను, ఈవోను, ఏఈఓను, ఎస్పీను, కలెక్టర్‌ను డిస్మిస్ చేయకపోవడం, ఇవన్నీ దోషులను కాపాడ్డానికే కదా? అని వైఎస్ జగన్ నిలదీశారు. ప్రభుత్వం ఇంత అలసత్వం చూపినా చంద్రబాబు దాన్నికూడా గొప్పగా చెప్పుకుంటున్నారంటే చాలా ఆశ్చర్యం కలుగుతోందని వైఎస్ జగన్ విమర్శించారు. మరోవైపు డిప్యూటీ సీఎం క్షమాపణ చెబితే అదే చాలు అన్నట్టుగా చేస్తున్న డిమాండ్లు హాస్యాస్పదంగా ఉన్నాయని మండిపడ్డారు. ముఖ్యమంత్రి ఏమో తొక్కిసలాట ఘటనపై తూతూ మంత్రంగా చర్యలు తీసుకుని, దాన్నే పెద్ద దండనగా చిత్రీకరిస్తుంటే, మరోవైపు డిప్యూటీ సీఎం ఏమో, లేదు.. క్షమాపణ చెప్పాలంటూ మరో రాజకీయ డ్రామాకు తెరలేపారని అన్నారు. ఇంతకన్నా దిగజారుడు తనం ఏమైనా ఉంటుందా? అని ప్రశ్నించారు. ప్రపంచ ఖ్యాతి చెందిన టీటీడీలో, చరిత్రలో ఎప్పుడూలేని విధంగా తొక్కిసలాట జరిగి, ఆరుగురు ప్రాణాలు కోల్పోతే ఆ ఘటనకు ప్రాయశ్చిత్తంగా క్షమాపణ చెబితే సరిపోతుందంటారా అని వైఎస్ జగన్ ప్రశ్నించారు. ఏమిటీ దారుణం? శ్రీవారి భక్తుల ప్రాణాలకు విలువ ఇదేనా? చట్టం, న్యాయం ఏమీ లేవా? భక్తుల మరణానికి కారకులైన వారికి ఇవేమీ వర్తించవా? అని మండిపడ్డారు. సీఎం, డిప్యూటీ సీఎంలు ఇద్దరూ కూడా రాజకీయ ఎత్తుగడలు ఆపేయాలని హితవుపలికారు. టీటీడీలో తొక్కిసలాట జరిగి, భక్తులు ప్రాణాలు కోల్పోవడం అన్నది సాధారణ విషయం కాదని స్పష్టం చేశారు. చిత్తశుద్ధితో వ్యవహరించి ఈ ఘటనకు ప్రత్యక్షంగా బాధ్యులైన టీటీడీ ఛైర్మన్, ఈవో, అడిషనల్ ఈవో సహా స్థానిక కలెక్టర్, ఎస్పీలపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వీళ్లందరినీ వెంటనే డిస్మిస్ చేసి, వీరిపై కేసులు పెట్టి మీ చిత్తశుద్ధిని, దేవుని పట్ల మీ భక్తిని చాటుకోవాలన్నారు. లేకుంటే ప్రపంచవ్యాప్తంగా ఉన్న వేంకటేశ్వరస్వామి భక్తుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

## కార్చిచ్చు వేళ అందినకాడికి
# దోచుకుంటున్న దొంగలు..

మొదటి పేజీ తరువాయి



ఈ విపత్తును కొందరు అవకాశంగా చేసుకొని దోపిడీలకు పాల్పడుతుండటం ప్రస్తుతం హాట్‌టాపిక్‌గా మారింది. బిలియనీర్లు, హాలీవుడ్ స్టార్స్ వదిలేసి వెళ్లిన ఇళ్లను దోపిడీ దొంగలు దోచుకుంటున్నారు. ఇప్పుడు స్థానిక పోలీసులకు ఇది ఓ సవాల్‌గా మారింది. కార్చిచ్చు కారణంగా జనాలు రక్షించడంతోపాటు ఇటు దొంగతనాలను అరికట్టాల్సి రావడంతో తలలు పట్టుకుంటున్నారు. ఇప్పటి వరకూ దొంగతనాలకు పాల్పడుతున్న 29 మందిని అరెస్ట్ చేశారు. అందులోని ఓ వ్యక్తి పోలీసుల నుంచి తప్పించుకునేందుకు ఏకంగా అగ్నిమాపక సిబ్బంది వేషం ధరించి మరీ దొంగతనాలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. వారందరినీ అరెస్ట్ చేశారు. దొంగతనాలను అరికట్టేందుకు షరీఫ్ డిపార్ట్‌మెంట్ గస్తీలను నిర్వహిస్తోంది.

### 24కు పెరిగిన కార్చిచ్చు మృతులు

వేగంగా వీస్తున్న గాలులతో మంటలు కొత్త ప్రాంతాలకు వ్యాపిస్తున్నాయి. దీంతో వేలాది ఇండ్లు కాలి బూడిదవుతున్నాయి. లక్షల కోట్ల రూపాయల ఆస్తి నష్టం వాటిల్లుతోంది. ప్రాణనష్టం సైతం క్రమంగా పెరుగుతోంది. ఇప్పటి వరకూ అందిన సమాచారం ప్రకారం.. కార్చిచ్చులో మరణించిన వారి సంఖ్య 24కు పెరిగింది. మరణించిన వారిలో అత్యధికంగా ఏటోన్ ఫైర్‌లోనే 16 మంది కాగా, పాలిసేడ్స్‌లో 8 మంది ఉన్నారు. మరణాల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఇక ఈ అగ్ని ప్రమాదాల్లో సుమారు 16 మంది తప్పిపోయినట్లు స్థానిక మీడియా నివేదించింది. మంటల ధాటికి ఇప్పటి వరకూ 12,000 నిర్మాణాలు అగ్నికి ఆహుతయ్యాయి. అంతేకాదు, పాలిసేడ్స్‌లో 23,707, ఏటోన్‌లో 14,117ఎకరాలు, కెన్నెత్‌లో 1,052, ముర్సెట్‌లో 779 ఎకరాలు దగ్ధమైనట్లు పేర్కొంది.

# వాటి ఆధారంగా రైతు భరోసా ఇస్తాం
## మల్లు భట్టి విక్రమార్క కీలక వ్యాఖ్యలు



హైదరాబాద్: రైతు భరోసాపై తెలంగాణ ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కీలక వ్యాఖ్యలు చేశారు. రెవెన్యూ రికార్డుల ఆధారంగా రైతు భరోసా ఇస్తామని వెల్లడించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రూ.22,500 కోట్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు రూ.2,000 కోట్లు, రైతు భరోసాకు రూ.19 వేల కోట్లు ఖర్చు చేయబోతూ ముందుకు వెళుతున్నామన్నారు. ఈ పథకాల అమలులో ఎవరికీ సందేహాలు అవసరం లేదన్నారు. లబ్దిదారుల ఎంపిక, అమలుకు విధివిధానాలు లోతుగా చర్చించాకే కేబినెట్ ప్రకటన చేసినట్లు చెప్పారు. వ్యవసాయ యోగ్యత కలిగిన భూములన్నింటికి ఎకరాకు రూ.12 వేలు చెల్లిస్తామన్నారు. ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాలు పొందిన రైతులకు కూడా ఈ పథకం వర్తిస్తుందన్నారు. రెవెన్యూ రికార్డుల ఆధారంగా వ్యవసాయ శాఖ రైతు భరోసా పథకాన్ని అమలు చేస్తుందన్నారు. ఉపాధి హామీ పథకంలో జాబ్ కార్డు తీసుకున్న కుటుంబం కనీసం 20 రోజులు పని చేసి ఉండి, సెంటు భూమిలేని వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం అందుతుందన్నారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లకు కూడా పూర్తిగా అర్హులనే ఎంపిక చేస్తామన్నారు. గ్రామ సభలను ఏర్పాటు చేసి ప్రభుత్వ పథకాలను అధికారులు వెల్లడించాలన్నారు. గ్రామసభల్లోనే లబ్ధిదారుల ఎంపిక, ఖరారు జరుగుతుందన్నారు. గ్రామ సభల్లోని అర్హులైన వారికి పథకాల అనుమతి పత్రాలు అధికారులు, ప్రజాప్రతినిధులు అందజేస్తారన్నారు. ప్రభుత్వ జీవో ప్రకారం సంక్షేమ పథకాలు అమలవుతున్నాయా? లేదా? అనేది ఇందిరమ్మ కమిటీలు పర్యవేక్షిస్తాయని వెల్లడించారు. సంక్షేమ పథకాల అమలులో ఇందిరమ్మ కమిటీలు కీలకమన్నారు.

## మంద జగన్నాథం మృతి తెలంగాణకు తీరని లోటు

### -మున్సిపాలిటీ కన్వీనర్ డా,,పత్య నాయక్



**(నేటి శుభోదయ):** జనవరి-13 ఆమనగల్లు:ఆమనగల్లు పట్టణంలో శ్రీశైలం జాతీయ రహదారి పై బిఆర్ఎస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షులు డా,,పత్య నాయక్ ఆధ్వర్యంలో నాగర్ కర్నూల్ మాజీ ఎంపీ కీర్తిశేషులు డా,,మంద జగన్నాథం చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.పత్య నాయక్ మాట్లాడుతూ మాజీ ఎంపీ,సీనియర్ నాయకుడు మంద జగన్నాథం మరణం పట్ల సంతాపం ప్రకటించారు.తెలంగాణ ఉద్యమం సమయంలో వారి కృషిని,పార్టీకి వారు అందించిన సేవలను పత్య నాయక్ గుర్తు చేసుకున్నారు.మంద జగన్నాథం మరణంతో తెలంగాణ ఒక సీనియర్ రాజకీయవేత్తను కోల్పోయిందని విచారం వ్యక్తం చేశారు.శోకతప్తులైన వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డ్ మెంబర్ వస్పుల.సాయిలు,మాజీ సర్పంచ్ సోనా శీను నాయక్,యూత్ ప్రెసిడెంట్ వడ్డే వెంకటేష్,ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ లందం యాదయ్య,యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ మద్దూరి ఆనంద్, మాజీ మార్కెట్ డైరెక్టర్ రమేష్ నాయక్,జంతుక యాదయ్య,కాలే విక్రమ్,భయ్య దేవేందర్,ఉమ్లా నాయక్,వరికుప్పల గణేష్,మహేష్ నేత,తదితరులు బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## మెల్విన్ జోన్స్ 145 వ జయంతి సందర్భంగా అన్నదానం కార్యక్రమం



విస్సన్నపేట: నేటిశుభోదయ(ప్రతినిధి కమలాకర్): లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ వి కిరణ్ అధ్యక్షతన అన్నదాన కార్యక్రమం లయన్స్ క్లబ్ ఫౌండర్ మెల్విన్ జోన్స్ 145 వ జయంతి సందర్భంగా లయన్స్ క్లబ్ కార్యాలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో లయన్ జిల్లా అంబాసిడర్ డాక్టర్ యన్.టి వెంకటేశ్వరరావు, విస్సన్న పేట లయన్స్ క్లబ్ అధ్యక్షుడు లయన్ డాక్టర్ వీర్ల కిరణ్ బాబు,లయన్ జగన్మోహన్ రెడ్డి,పల్స్ కేర్ హాస్పిటల్ వైద్యులు లయన్ డాక్టర్ రాజగోపాల్,లయన్ డాక్టర్ శ్వేత,ఫిజియో థెరిపిస్ట్ డాక్టర్ లయన్ శ్రీనివాసరావు,సగ్గుర్తి సునీల్,చందల అనుదీఫ్ తదితరులు పాల్గొన్నారు

## మాజీ ఎంపి డా.మందా జగన్నాథం కు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఘన నివాళి





**(నేటి శుభోదయ):** జనవరి-13: ఆమనగల్లు:నాగర్ కర్నూల్ మాజీ పార్లమెంట్ సభ్యులు డా.మందా జగన్నాథం పార్థీవ దేహాన్ని సోమవారం ఉదయం కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణ రెడ్డి నియోజకవర్గంలోని వివిధ మండలాల ముఖ్య నాయకులతో కలిసి కర్మన్ ఘట్ లోని ఆయన నివాసం లో పార్థీవ దేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఆయన కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే సానుభూతిని తెలియజేశారు.నాగర్ కర్నూల్ లోక్ సభ సభ్యునిగా,సామాజిక,తెలంగాణ ఉద్యమకారుడిగా డా.మందా జగన్నాథం పాత్ర తెలంగాణ రాష్ట్రంలో మరువురానిదన్నారు.ప్రత్యేక తెలంగాణ ఏర్పాటులో క్రియాశీల పాత్ర పోషించారని ఎమ్మెల్యే కసిరెడ్డి కొనియాడారు.జగన్నాథం మరణం తెలంగాణకు తీరని లోటు అన్నారు.ఆయన కుటుంబ సభ్యులకుసానుభూతిని తెలియజేశారు.

## బాబుల్ రెడ్డి నగర్ లో ఘనంగా భోగి వేడుకలు



రాజేంద్రనగర్ ప్రతినిధి.జనవరి13(నేటి శుభోదయ): రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని మైలార్ దేవుపల్లి డివిజన్ పరిధిలోని బాబుల్ రెడ్డి నగర్ లో మాజీ కౌన్సిలర్ ఎస్ వెంకటేష్ కురుమ. టిఆర్ఎస్ సీనియర్ నాయకులు సోమ శ్రీనివాస్ గుప్తా ల సంక్రాంతి పండుగను పురస్కరించుకొని భోగి మంటలు ఎముకల కొరకే చలిలో ప్రజలంతా భోగి మంటల్లో చలి కాల్చుకున్నారు. ఈ సందర్భంగా వెంకటేష్ కురుమ, సోమ శ్రీనివాస్ గుప్తాలు భోగి శుభాకాంక్షలు తెలియజేశారు. భోగి సందర్భంగా ఎస్ వెంకటేష్ మాజీ కౌన్సిలర్ ఆధ్వర్యంలో మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలో నీ పలు బస్తీలలో బిఆర్ఎస్ నాయకులు పెద్ద ఎత్తున భోగి మంటలు వేసి మైలార్ దేవ్ పల్లి డివిజన్ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఈ భోగి పండుగ ప్రజల జీవితంలో బాధలు దహనమై ప్రజలందరి జీవితంలో వెలుగులు నింపాలని కోరుకుంటూ మైలార్ దేవ్ పల్లి డివిజన్ ప్రజలకు భోగి పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ ఈ కార్యక్రమంలో ఆర్, వెంకటయ్య ముదిరాజ్, మహేష్ ముదిరాజ్, రమేష్ ముదిరాజ్, రాయుడు, అంగన్ బాల్కె అశోక్ కుమార్, యాదగిరి, నరేష్ ముదిరాజ్, శ్రీను ముదిరాజ్, పద్మ రాజేశ్వరి బిఆర్ఎస్ మహిళనాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలొ పాల్గొన్నారు.


## మంద జగన్నాథంకు నివాళులర్పించిన ఫుడ్ కమిషన్ చైర్మన్



**(నేటి శుభోదయ):** జనవరి-13: ఆమనగల్లు:అనారోగ్యంతో మరణించిన మాజీ ఎంపీ, సీనియర్ రాజకీయ నాయకుడు మంద జగన్నాథం పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించిన బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ మరియు తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి ఇతర నాయకులు.ఈ సందర్భంగా గోల్డ్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ మందా జగన్నాథం ఉమ్మడి రాష్ట్రంలోనే తెలంగాణ మేలు కోరుకున్న నాయకుడని,మహబూబ్ నగర్ జిల్లా అభివృద్ధి ఎంతో కృషి చేశాడని గోలి శ్రీనివాస్ రెడ్డి కొనియాడారు.అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి,ఓదార్చారు.ఆయన మరణంతో తెలంగాణ సీనియర్ రాజకీయ వేత్తను కోల్పోయిందన్నారు.నాలుగు సార్లు ఎంపీగా చిరస్మరణీయ సేవలందించారని కొనియాడారు.

# ఎత్ బార్ పల్లి హనుమాన్ దేవాలయ సన్నిధిలో ఘనంగా అయ్యప్ప మండల మహా పడిపూజ

### భక్తిశ్రద్ధలతో అయ్యప్ప మాలదారుల ఇరుముడి పూజ మహోత్సవం శబరిమలై యాత్రకు బయలుదేరిన స్వాములకు వీడ్కోలు పలికిన స్వాములు గ్రామస్తులు, తల్లిదండ్రులు



మొయినాబాద్ జనవరి 13(**నేటి శుభోదయ**): అయ్యప్ప స్వామి



ఆశీస్సులతో గ్రామ ప్రజలందరూ సంతోషంగా ఉండాలని ఎత్ బార్ పల్లి గ్రామ హనుమాన్ దేవాలయ అయ్యప్ప స్వామి దేవాలయంలో అయ్యప్ప మండల మహా పడిపూజ కార్యక్రమాన్ని కృష్ణ గురు స్వామి, వీరభద్ర గురు స్వామి, భాస్కర్ రెడ్డి గురు ఆధ్వర్యంలో అన్నదాన ప్రభు సంజీవ రెడ్డి ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎత్ బార్ పల్లి గ్రామ మాజీ ఉప సర్పంచ్ మేకగూడెం బిక్షపతి మాట్లాడుతూ శబరిమలై యాత్రకు వెళు తున్న స్వాములు సురక్షితంగా తిరిగి రావాలని అన్నారు ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని అందరిలో పెరగాలని ఉన్నారు సోమవారం ఎత్ బార్ పల్లి గ్రామంలో హనుమాన్ దేవాలయ అయ్యప్ప స్వామి సన్నిధానం నుంచి అయ్యప్ప దీక్ష పూర్తి చేసుకొని శబరిమలై యాత్రకు వెళ్లిన స్వాములకు గ్రామస్తులు స్వాముల తల్లిదండ్రులు వీడ్కోలు పలికారు. స్వాములు యాత్రను ప్రశాంతంగా స్వామివారిని దర్శించుకుని రావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో , వెంకటేష్ గౌడ్ గురు స్వామి,జి.మహేందర్ గురు స్వామి మేకగుడే శ్రీనివాస్ స్వామి, మేకగూడెం రమేష్ స్వామి, మురల్లి స్వామి,వి.మహేందర్ స్వామి ,బి మహేందర్ స్వామి,నాగ మల్లేష్ స్వామి, మణికంఠ స్వామి, గ్రామ నాయకులు అర్జున్ గౌడ్, అనిల్ ముదిరాజ్, చాకలి అనిల్, వి టీలు, బి ప్రభాకర్,బి శివ కుమార్, సన్నిధానం స్వాములు గ్రామస్తులు తల్లిదండ్రులు బంధువులు తదితరులు పాల్గొన్నారు .

## ద్వితీయ స్థానం కైవసం చేసుకున్న మణికొండ బాల్ బ్యాడ్మింటన్

### అభినందనలు తెలిపిన ముఖ్య సలహాదారుడు అందె లక్ష్మణ్ రావు



గండిపేట ప్రతినిధి.జనవరి13(నేటి శుభోదయ): స్వామి వివేకానంద 162 జయంతి సందర్భముగా ఆదివారం 12 జనవరి 2025 న లైట్ అండ్ లైఫ్ యూత్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో జడ్.పీ.హెచ్. స్కూల్ గట్టుప్పల్, నల్లగొండ జిల్లా ఆవరణలో ఉదయం 9 నుండి మొదలుకొని అవసరం మేరకు ఫ్లడ్ లైట్ల వెలుతురులో రాత్రి వరకు జరిగిన తెలంగాణ రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ క్రీడల టోర్నమెంట్లో 16 జట్లు పాల్గొనగా, న్యాయ నిర్ణేతలుగా తెలంగాణ రాష్ట్ర బాల్ బ్యాడ్మెంటన్ ప్రధాన కార్యదర్శి రమణ, వీరభద్ర రావు, కర్నాటి వెంకటేశ్, డోర్నాల వినయ్ కుమార్, భీమగాని సుభాష్, కొంగరి మల్లికార్జున్, ఇడం విజయ్ కుమార్, నెలాంటి రాజుల నిర్ణయం మేరకు మొదటి స్థానం కరీం నగర్ బాల్ బ్యాడ్మింటన్ కైవసం చేసుకునీ 10116/- ప్రైజ్ మనీ పొందగా, మణికొండ బాల్ బ్యాడ్మింటన్ ద్వితీయ స్థానం కైవసం చేసుకునీ 5116/- ప్రైజ్ మనీ పొందినదని, మూడవ స్థానంలో బీ హెచ్ ఈ ఎల్ బాల్ బ్యాడ్మింటన్ కైవసం చేసుకునీ 3116/- ప్రైజ్ మనీ పొందగా మొత్తం టోర్నమెంట్లో అత్యుత్తమ క్రీడాకారునిగా మణికొండ బాల్ బ్యాడ్మింటన్ నుండి గోపి సాధించడం గర్వకారణంగా ఉన్నదని ముఖ్య సలహాదారుడు అందె లక్ష్మణ్ రావు అభినందనలు తెలియ చేశారు. కలసి కట్టుగా ఘనత సాధించిన కెప్టెన్ గా శ్రీనివాసరావునీ, జట్టు సభ్యులు రమేషు, గోపి, ప్రశాంత్, నవీన్, హసీం, సీతారామరాజు, హరినాద్ రెడ్డి, రామ్ రెడ్డి మరియు శశిధర్ లను ఆటల పోటీలో ప్రస్తుతం సాధించిన విజయానికి అభినందిస్తు ముమ్ముందు ఇంకా ఎన్నో ఘన విజయాలను సాధించాలని ప్రోత్సహించడం జరిగినది.

## తెలుగువారి సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి




### దారపనేని చంద్రశేఖర్

(మాజీ ఏఎంసీ చైర్మన్ కనిగిరి)

**(నేటి శుభోదయ):** పామూరు కనిగిరి నియోజకవర్గ ప్రజలకు తెలుగుదేశం పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. తెలుగువారి సంస్కృతి సాంప్ర దాయాలకు ప్రతీక అయిన సంక్రాంతి పండుగను నియోజకవర్గ ప్రజలందరూ ఆనందోత్సవాలతో జరుపుకోవాలని, సంక్రాంతి సకల శు భాలు అందించాలని, భోగిమంటలతో ప్రతి కుటుంబంలో భోగభాగ్యాలు వెల్లి విరియాలని, సరదాల సంక్రాంతిని సరదాగా జరుపుకోవాలని కమ్మని కనుముతో ప్రతి కుటుంబము సంతోషభరితంగా వర్ధిల్లాలని, పాడిపంటలతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. సంక్రాంతి పర్వదినాన ముంగిళ్ళ ముగ్గులతో, హరిదాసు గానాల తో, వాకిళ్ళ ముందర గంగిరెద్దుల విన్యాసాలతో సంక్రాంతి పండుగను నియోజకవర్గ ప్రజలందరూ సుఖ సంతోషాలతో జరుపుకోవాలని దారపనేని ఆకాంక్షించారు.

## గుర్తు తెలియని మృతదేహం లభ్యం



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా / భద్రాచలం, జనవరి 13, (నేటి శుభోదయ): భద్రాచలం పట్టణంలోని ఏరియా ఆసుపత్రి వద్ద గుర్తు తెలియని మృతదేహం లభ్యమైన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే... ఏరియా ఆసుపత్రి కు వెళ్లే దారిలో అపోలో మెడికల్ షాప్ వద్ద విగతజీవిగా ఒక వ్యక్తి పడి ఉన్నాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రిలోని మార్చురిలో భద్రపరిచారు. ఈ మేరకు పట్టణ ఎస్ఐ రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విచారణలో మృతుడు గత రెండు,మూడు నెలలుగా ఏరియా ఆసుపత్రి వద్ద, సమీప ప్రాంతాల్లో భిక్షాటన చేసి జీవనం గడిపిస్తున్నాడని, అతను టీబీ వ్యాధితో బాధపడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలోనే మందులు తీసుకుంటూ వాడుతుంటాడని వెల్లడయింది. దీంతో ఆసుపత్రిలోని రికార్డులను పరిశీలించగా మృతుడు పేరు టి. శంకర్ (55) గా గుర్తించడం జరిగిందన్నారు. అతని చిరునామా వివరాలు రికార్డుల్లో పొందుపరచడాని కి మృతుడు నిరాకరించేవాడని తెలియజేశారు. కావున కుటుంబ సభ్యులు మృతదేహం కొరకు స్థానిక పోలీస్ స్టేషను సంప్రదించాలని ఎస్ ఐ రామకృష్ణ కోరారు.

## గిరిజనులు, విద్యార్థులకు మకర సంక్రాంతి కనుమ పండుగ శుభాకాంక్షలు

### తెలిపిన ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా / భద్రాచలం, జనవరి 13, (నేటి శుభోదయ): ఏజెన్సీ ఏరియాల లోని మండలాలు, గిరిజన గ్రామాలలో పనిచేయు చున్న ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు, ఏజెన్సీ ఏరియా ఆదివాసి గిరిజన కుటుంబాలకు, విద్యార్థులకు, ఐటీడీఏ కార్యాలయం లోని యూనిట్ అధికారులకు, సిబ్బందికి, భద్రాచలం ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ మకర సంక్రాంతి, కనుమ పండుగ శుభాకాంక్షలు సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. అందరూ సుఖసంతోషాలు, భోగభాగ్యాలతో విలసిల్లాలని, పంటలు సమృద్ధిగా పండి రెట్టించిన ఉత్సాహంతో గిరిజన రైతులు పండుగలు జరుపుకోవడం తో, అద్భుతమైన, సంతోషమైన ప్రగతిని ఆరోగ్యాన్ని ఇవ్వాలని ఆకాంక్షించారు. మకర సంక్రాంతి మరియు కనుమ పండుగ మన సంస్కృతికి, సాంప్రదాయానికి, వారసత్వానికి ప్రతీకలని, సాంప్రదాయమైన సంక్రాంతి ఉత్సవాలు, అన్ని వర్గాల గిరిజన కుటుంబాల మధ్య బంధాన్ని పెంచుతాయని అన్నారు. ఇలాంటి శుభ సందర్భంలో ప్రేమ, వాత్సల్యం, స్నేహం, సహోదరత్వం వంటి ఆలోచనలు కలగాలని ఆకాంక్షిస్తూ, ప్రతి ఇంట భోగభాగ్యాలను నింపాలని ఇంటిల్లిపాది పండుగను ఎంతో ఆనందంగా సంతోషంగా జరుపుకోవాలని కోరుకుంటూ మరి ఒకసారి సంక్రాంతి, కనుమ పండుగ శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు ఆయన అన్నారు.

## పల్లె ప్రజల జీవితాల్లో వెలుగులు నింపే పర్వదినం భోగి పండుగ కొత్వాల



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా , జనవరి 13, (నేటి శుభోదయ): పల్లె ప్రజల జీవితాల్లో వెలుగులు నింపే పర్వదినం భోగి పండుగ అని రాష్ట్ర మార్కెఫెడ్ డైరెక్టర్, డిసిఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. అత్యంత వైభవంగా నిర్వహించుకునే సంక్రాంతి పండుగ ముందు రోజు నిర్వహించే భోగి పండుగ సందర్భంగా సోమవారం తెల్లవారు ఝామున పాత పాల్వంచ బస్ట్ స్టాండ్ వద్ద జరిగిన భోగి మంటల వేడుకల్లో కొత్వాల పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ కష్టాలను దహించేవి భోగి మంటలు అన్నారు. సీతాకాలపు చల్లటి గాలులు చీల్చుతూ వెలిగించే భోగి మంటలు ప్రజల జీవితాల్లో సరికొత కాంతులు తీసుకురావాలని కొత్వాల అన్నారు. ఈ కార్యక్రమంలో వంశి హోటల్ శ్రీనివాస్, గుమ్మడివెల్లి సత్యనారాయణ, మున్సిపల్ పారిశుధ్య కార్మికులు, మహిళలు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్.ఎస్.పి ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రికెట్ లీగ్



**(నేటి శుభోదయ):** జనవరి-13: ఆమనగల్లు:ఆమనగల్లు మండలంలోని మంగళపల్లి గ్రామంలో ఆర్ఎస్పీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ ను నిర్వహించడం జరిగింది. కొప్పు మహేష్ నేతృత్వంలో క్రికెట్ జట్టుకు టీ షర్ట్స్ అందజేసిన అనంతరం క్రికెట్ టోర్నమెంట్ను ప్రారంభించడం జరిగింది ఆర్ఎస్పీ ఫౌండేషన్ ఎల్లవేళలా విద్య,వైద్యం,క్రీడలను ప్రోత్సహించే విధంగా కార్యక్రమాలను చేపడుతుంది.ఈ కార్యక్రమంలో ఆర్ఎస్పీ ఫౌండేషన్ డైరెక్టర్ అశ్విన్ కుమార్ మరియు కో-ఆర్డినేటర్స్ కొప్పు మహేష్,దుబ్బల భాస్కర్,సింగపాకుల కుమార్,రాము,కొప్పు శ్రీశైలం,నరసింహ,బాలరాజు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే కూనంనేని



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, జనవరి 13, (నేటి శుభోదయ): రాష్ట్ర ప్రజలకు అదేవిధంగా నియోజకవర్గ ప్రజలకు కొత్తగూడెం శాసనసభ సభ్యులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరికి ఆరోగ్యం, ఆనందం, ఐశ్వరం నిండిన జీవితం దక్కాలని, పండుగను కుటుంబ సభ్యులు, స్నేహితులు, సమానంతో కలిసి హర్షాతిరేకల జరుపుకుంటూ శాంతిశాన్ని పంచుకోవాలని, రైతు, కార్మిక సంక్షేమం, విద్య, వైద్యం, అభివృద్ధి వంటి అంశాల్లో నియోజకవర్గం ముందడుగు వేయడంలో నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. పండుగ వేల ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ప్రభుత్వ శాఖల అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.

## ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన అలిండియా అంబేద్కర్ యువజన సంఘము రాష్ట్ర ఉపాధ్యక్షులు బేగరి రాజు



మొయినాబాద్ , జనవరి 13, (నేటి శుభోదయ): రాష్ట్ర ప్రజలకు అదేవిధంగా చేవేళ్ల నియోజకవర్గ ప్రజలకు అలిండియా అంబేద్కర్ యువజన సంఘము రాష్ట్ర ఉపాధ్యక్షులు బేగరి రాజు సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరికి ఆరోగ్యం, ఆనందం, ఐశ్వరం నిండిన జీవితం దక్కాలని, పండుగను కుటుంబ సభ్యులు, రైతు, కార్మిక సంక్షేమం, విద్య, వైద్యం, అభివృద్ధి వేల ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ప్రభుత్వ అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు

## తెలుగు ప్రజలందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన బాలానగర్ సీఐ



సాధనాల వీరేంద్ర**(నేటి శుభోదయ):** కూకట్పల్లి జనవరి 13, 2025: తెలుగు వారి పండుగ సంక్రాంతి సందర్భంగా తెలుగు ప్రజలకు బాలానగర్ సీఐ నర్సింహా రాజు సోమవారం కొత్త కాంతులు తెచ్చే సంక్రాంతి.. కనుమ పండుగలను అందరూ ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సంక్రాంతి మీకు సుఖసంతోషాలను, భోగభాగ్యాలను కనుమ కమనీయమైన అనుభూతులను అందించాలని, స్వేచ్ఛా సౌభాగ్యాలతో ప్రజలందరూ సంతోషంగా తెలుగు సంప్రదాయం ఉట్టిపడేలా సంక్రాంతి పండుగ సంబురాలు జరుపుకోవాలని అన్నారు. పతంగులు ఎగరవేసేటప్పుడు పిల్లలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

## శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి బయలు నాటక పుస్తక ఆవిష్కరణ



**(నేటి శుభోదయ):** జనవరి-13:వెల్దండ:మండలం చెర్కూర్ గ్రామంలో యావత్ ప్రపంచానికి జ్ఞాన బోధను కలిగించినటువంటి శ్రీ విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి బయలు నాటకాని సుమారు 6 దశాబ్దాలుగా నిర్వహిస్తున్నారు.అందుకు భక్తులు వీరబ్రహ్మేంద్ర స్వామిని ఎంతో భక్తి శ్రద్ధలతో పూజిస్తూ స్వామివారి ఆశీస్సులు పొందుతున్నారు.భక్తుల కోరికలు తీర్చే కొంగుబంగారంగా ఎంతో వైభవోపేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీగా మారింది.అటువంటి వీరబ్రహ్మేంద్రస్వామి బయలు నాటక పుస్తక ఆవిష్కరణను సోమవారం చెర్కూర్ గ్రామంలో నిర్వహించారు.ఈ సందర్భంగా బుక్స్ ముద్రణ దాత మాజీ ఉపసర్పంచ్ నరసింహ ముదిరాజ్ మాట్లాడుతూ ఈ బయలు నాటకము కుల,మతాలకు అతీతంగా ప్రదర్శించే గొప్ప యజ్ఞం అన్నారు.ఈ కార్యక్రమంలో బ్రహ్మంగారి భక్త బృందం గోలి దశరథ్ రెడ్డి,జాజాల రామచంద్రయ్య,చెన్నారం వెంకటాచారి,కేశమౌని భీమయ్యగౌడ్,వై రామచంద్రయ్య,చెన్నారం సత్యం, వీరబ్రహ్మం, విజయేంద్ర చారి,చెన్నారం బిక్షపతి,చెన్నారం ప్రశాంత్,కేశమౌని రామచంద్రయ్య, అలీలుద్దీన్, లాలయ్య,లవకుశ,రమేష్,కృష్ణ,బాలకృష్ణ,వంశీ తదితరులు పాల్గొన్నారు.

## యువత కేసులలో ఉంటే వారి యొక్క భవిష్యత్తు అంధకారమే

### జూద క్రీడలు కాకుండా సాంప్రదాయ ఆటలు ఆడుకోవాలి.

### బయ్యారం ఎస్ఐ రాజ్ కుమార్.



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా / పినపాక , జనవరి 13, (నేటి మనదేశమ్): సంక్రాంతి పండుగ సందర్భంగా కోడి పందాలు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామని ఏడూళ్ళ బయ్యారం ఎస్సై రాజ్ కుమార్ హెచ్చరించారు. సోమవారం పినపాక మండల పరిధిలోని పోలీస్ స్టేషన్ వద్ద ఆయన మాట్లాడారు. ముందుగా మండల ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కోడిపందాలను ఉద్దేశించి మాట్లాడుతూ మండల పరిసర ప్రాంతాల్లో ఎవరైనా కోడిపందాలు ఆడినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని, పందెపు రాయుళ్లను ప్రత్యేకమైన ఫోర్స్ తో పట్టుకోవడం జరుగుతుందని తెలిపారు. సంక్రాంతి పండుగ రోజులలో సాంప్రదాయ క్రీడలు పేరుతో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. కోడిపందేలు, పేకాట నిర్వహకులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. జూద క్రీడలు కాకుండా సాంప్రదాయ ఆటలు ఆడుకోవాలని సూచించారు. కోడీ పందేలు, పేకాట, గుండాట ఇలా ఏ జూద వ్యసనమైనా ప్రజల జీవితాలను నాశనం చేస్తుందన్నారు. అసాంఘిక కార్యకలాపాలలో పాల్గొనే వారిని ఎట్టి పరిస్థితులలో ఉపేక్షించ బోమన్నారు. కోడి పందేల జూదరులు, పేకాట నిర్వహకులపై ఇప్పటికే నిఘా పెట్టినట్లు చెప్పారు. కోడి పందేలు, జూదాల వల్ల ప్రజలు సులభంగా డబ్బులు సంపాదించాలని ఆశ పడి పందేలు కాసి డబ్బును నష్టపోతున్నారన్నారు. దీనివలన వారి కుటుంబాలలో పండగ పూట కుటుంబం ఇబ్బంది పడే అవకాశం ఉందన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఎవరైనా మండలంలో కోడి పందేలు నిర్వహించినా,పందేలు నిర్వహణకు స్థలాలు, భూములు ఇచ్చినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొందరు యువకులు జూదాలకు బానిసలై కేసుల్లో ఇరుక్కుపోయి తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నట్లు చెప్పారు. యువత ఇటువంటి కేసులలో ఉంటే వారి యొక్క భవిష్యత్తు అంధకారం అవుతుందని, ఇతర దేశాలలో ఉద్యోగాల కొరకు వెళ్లే వారికి, ప్రభుత్వ ఉద్యోగాలు పొందే సమయంలో, పాస్ పోర్టు పొందే సమయాలలో ఈ కేసులు అడ్డంకిగా మారి యువత యొక్క జీవితాలు అధోగతి పాలవుతాయనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. మండలంలో ఎక్కడైనా కోడిపందేలు ఆడినా, జూదం ఆడినా సంబంధిత పోలీస్ స్టేషన్ కు సమాచారం ఇవ్వాలని కోరారు.

## అన్ని దానాలలో రక్తదానం గొప్పది!




**(నేటి శుభోదయ):** 13 పల్నాడు జిల్లా వినుకొండ : మీ ఒక్కొక్క రక్తపు బొట్టు, ప్రాణాపాయంలో ఉన్న వారికి కొత్త జీవనాన్నిస్తుంది లెజెండరీ బ్లడ్ డొనేషన్ డ్రైవ్ తేదీ:జనవరి 18, 2025 స్థలం: వినుకొండ పట్టణంలో, గంగినేని ఫంక్షన్ హాల్ నందు. స్వర్గీయ ఎన్టీఆర్ 29వ వర్ధంతి సందర్భంగా ఆ మహనీయునికి గౌరవనివాళులర్పిద్దాం రక్తదానం చేయడం ద్వారా ఎన్టీఆర్ గారి సేవాస్ఫూర్తిని కొనసాగించండి! చీఫ్ విప్ వారి కార్యాలయం - వినుకొండ

## వినుకొండ, రాష్ట్ర ప్రజలందరికీ భోగి, సంక్రాంతి శుభాకాంక్షలు



**(నేటి శుభోదయ):** 13 జనవరి : వినుకొండ అనుబంధాలు నిండిన మట్టి మనుషుల పండగ సంక్రాంతి సందర్భంగా వినుకొండ నియోజకవర్గం, రాష్ట్ర ప్రజలందరికీ శుభాకాంక్షలు. పంట పొలాల నుంచి ధాన్యం ఇంటికి చేరిన సమయంలో చేసుకునే పండగే సంక్రాంతి, నమ్ముకున్న భూతల్లికి రైతు కృతజ్ఞతలు తెలిపే శుభదినమిది. ఎన్డీఏ ప్రభుత్వం ఉంది కాబట్టి మంచి గిట్టుబాటు ధర వస్తుంది, ప్రతిఒక్కరూ మంచి ఆర్థిక ప్రగతి సాధించాలని భగవంతుడిని వేడుకుంటున్నాను. మీ జీవీ ఆంజనేయులు శాసనసభ్యులు, వినుకొండ

## ఆనందోత్సాహాల నడుమ భోగి వేడుకలు



పులిచెర్ల,జనవరి 14,(నేటి శుభోదయ): మంచు పొరలు,చెలిగాలుల మధ్య హిందువులకు ఎంతో ప్రీతిపాత్రమైన సంక్రాంతికి పండుగలలో భాగంగా మంగళవారం అర్ధరాత్రి నుంచి భోగి పండుగ వేడుకలను మండల ప్రజలందరూ ఆనందోత్సాహల నడుమ జరుపుకున్నారు. రాత్రి నుంచి పులిచెర్ల మండల పరిధిలోని అన్నీ గ్రామాలలో ప్రజలు పోటా పోటీగా భోగి మంటలను వేశారు. వేకువ జామున కుటుంబ సభ్యులంతా ఒకే చోటచేరి చీకట్లను చిలుస్తూ భోగి మంటలు వేశారు. మంటలు చుట్టూచేరి నూతనోత్సాహంతో కేరింతలు కొట్టారు. భోగి మంటలలో కాచిన నీటితో తలంటి స్నానం చేస్తే వ్యాధులు దూరం అవుతాయి అన్న నమ్మకం,దీంతో ప్రతి ఇంటా వేసిన భోగిమంటల్లో నీటిని కాచుకొని ఇంటిల్లపాది స్నానాలు చేసి కొత్త బట్టలు ధరించి,పిండి వంటకాలు చేసుకొని అందరికీ పంచి పెట్టారు ప్రతి ఇంట ముంగిళ్ళలో రంగురంగుల ముగ్గులతో అందంగా అలంకరించి వాటి మధ్యలో గొబ్బెమ్మలను పెట్టి పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.చిన్నారులకు పెద్దలు భోగి పండ్లు వేసి ఆశీర్వదించారు.



## ఘనంగా నిమ్మల రామకృష్ణ గౌడ్ పుట్టినరోజు వేడుకలు



**(నేటి శుభోదయ):** జనవరి 13 శేరి లింగంపల్లి ప్రతినిధి : హాఫీజ్ పెట్ డివిజన్ బి.ఆర్.ఎస్ మాజీ ఇంచార్జ్ నిమ్మల రామకృష్ణ గౌడ్ జన్మదిన వేడుకలను ఘనంగా జరిగాయి. ఆదివారం రోజున ఉదయం వారి తల్లిదండ్రుల ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం వివిధ సామజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కలుసుకుని ఆయన ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం హాఫీజ్ పెట్ లో అభిమానులు , వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సమక్షంలో కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కోమండ్ల శ్రీనివాస్ రెడ్డి, అత్తేపల్లి రాంప్రభు, బి.ఎస్.ఎన్ కిరణ్ యాదవ్, మాజీ కార్పొరేటర్లు రంగారావు, అశోక్ గౌడ్, వీరేశం గౌడ్, లక్ష్మీ నారాయణ గౌడ్, బోయిన మహేష్ యాదవ్ తదితరులు పాల్గొని రామకృష్ణ గౌడ్ జన్మ దిన శుభాకాంక్షలు తెలిపారు.




## మకర సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలు

### నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి

### మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్



మంథని, చేరాలరవీందర్ నేత, జనవరి -13( నేటి శుభోదయ): మకర సంక్రాంతి పర్వదిన సందర్భంగా నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, ప్రశాంతమైన వాతావరణంలో సంక్రాంతి పండుగ జరుపుకోవాలని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నియోజకవర్గ ప్రజలకు సంక్రాంతి పర్వదినం పండుగ సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ, సిరులు కురిపించే సంక్రాంతి పండుగ ప్రతి ఒక్కరూ వైభవంగా జరుపుకోవాలని ఆయన ఆశించారు. భిన్నత్వంలో ఏకత్వం మాదిరిగా భారతదేశంలో జరుపుకునే అతిపెద్ద పండుగలలో ముఖ్యమైన పండుగ మకర సంక్రాంతి పండుగ అని, ఋతువులు మారే క్రమాన్ని తెలిపే అత్యంత ముఖ్యమైన పర్వదినం మకర సంక్రాంతి పండుగ అని ఆయన తెలిపారు. సంక్రాంతి పండుగ ప్రజలకు సుఖసంతోషాలు అందించాలని, రైతులకు సకాలంలో తమ పంట చేతికి రావాలని కోరుకున్నట్లు ఆయన వివరించారు. తెలంగాణలో సంక్రాంతి పండుగ అంటే ఒక ప్రత్యేకమైన సంస్కృతి సాంప్రదాయం కలిగినదని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ తెలిపారు.

## నందమూరి తారక రామారావు విగ్రహ ఆవిష్కరణ





**(నేటి శుభోదయ):** 13 జనవరి పల్నాడు జిల్లా సత్తెనపల్లి : సత్తెనపల్లి మండలం, దీపాల దిన్నె పాలెం గ్రామంలో స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహావిష్కరణ కార్యక్రమంలో టిడిపి పార్లమెంటరీ పార్టీ నేత, గౌరవ నర్సరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు సత్తెనపల్లి శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణ , స్థానిక నాయకులు పాల్గొనడం జరిగింది. యాక్టర్ గా డైరెక్టర్ గా, నిర్మాతగా, ప్రజల పక్షాన నిలబడే రాజకీయ నేతగా ఇలా ఏ రంగమైనా ఎన్టీఆర్ ఒక సంచలనంగా రాణించారు. అన్ని వర్గాల వారిని అత్యంత దగ్గరగా, వారి కష్టాలను లోతుగా తెలుసుకుని.. పదిమందిని కలుపుకొని ముందుకు వెళుతూ, అందరిని ఎదిగేలా చూడాలన్నదే ఎన్టీఆర్ గారి ఆలోచన, ఆశయం. బీసీలను రాజకీయంగా గుర్తింపు తీసుకొచ్చిన వ్యక్తి ఎన్టీఆర్ . మహిళలకు ఆస్తిలో సగభాగం, రూ. 2 కే బియ్యం వంటి ఎన్నో పథకాలను తీసుకొచ్చి సామాన్యుడు చెంత నిలిచే పాలనకు ఆయన నాంది పలికారు. వారి ఆశయాన్ని మనమందరం ముందుకు తీసుకెళ్లాలి.



## టిడిపి పార్టీ నూతన సంవత్సర క్యాలెండర్ ను ఆవిష్కరించిన



**(నేటి శుభోదయ):** 13 జనవరి పలనాడు జిల్లా కారంపూడి: తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని రాష్ట్ర వాణిజ్య విభాగ కార్యదర్శి పుంగులూరి. పుల్లయ్య అన్నారు. టిడిపి పార్టీ నూతన సంవత్సర క్యాలెండర్లను పంగులూరి పుల్లయ్య ఆధ్వర్యంలో కారంపూడి మండలం ఒప్పిచర్ల గ్రామంలోని వెంకటేశ్వర స్వామి కళ్యాణ మండపం ఆవరణలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పంగులూరి.పుల్లయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో మాచర్ల నియోజకవర్గం వెనకబడిన ప్రాంతాన్ని నరసరావుపేట పార్లమెంట్ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, మాచర్ల శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానంద రెడ్డి ఆధ్వర్యంలో అభివృద్ధి జరుగుతుందని ఆయన అన్నారు. మాచర్ల నియోజకవర్గ అభివృద్ధి చేసేందుకు శ్రీకారం చుట్టారు. గత వైసిపియాంలో మాచర్ల నియోజకవర్గం అభివృద్ధి నోచుకోకుండా పోయిందన్నారు. అందుకు నిదర్శనమే రహదారులు అధ్వానంగా పాడైపోయాయి అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మొట్టమొదటిగా రహదారులు మరమ్మత్తు చేయడంలో విజయం సాధించారని అన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు పథకాలు అందిస్తూ.. ప్రజలకు అండగా ఉంటుందంటూ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఒప్పిచర్ల గ్రామ టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## క్రీడలతోనే మానసిక ప్రశాంతత

### మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్ యాదవ్




తలకొండపల్లి **(నేటి శుభోదయ):** క్రీడలతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని తలకొండపల్లి మాజీ ఎంపీపీ, బిఆర్ఎస్ పార్టీ కల్వకుర్తి సీనియర్ నాయకులు సిఎల్ శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సోమవారం రంగారెడ్డి జిల్లా,తలకొండపల్లి మండలంలోని వెల్జాల్ గ్రామపంచాయతీ పరిధిలోని చెన్నంపల్లి ( సిపిఎల్), ఇశ్రాయపల్లి( ఐపిఎల్)లో క్రికెట్ టోర్నమెంట్ ను సిఎల్,శ్రీనివాస్ యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్రీడలు ఆడటం మూలాన మనిషి ఆరోగ్యంతో పాటు శరీర దారుఢ్యానికి ఎంతో ఉపయోగ ఉంటుందని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న క్రీడాకారుల ప్రతిభను ప్రభుత్వం వెలికి తీసి వారికి ప్రోత్సాహం అందించి సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఇరుజట్ల క్రీడాకారులను ఆయన అభినందించి షేక్ హ్యాండ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో గట్టు ఇప్పలపల్లి మాజీ సర్పంచ్ జయమ్మ వెంకటయ్య, వీరన్నపల్లి మాజీ సర్పంచ్ లింగం గౌడ్, సింగల్ విండో డైరెక్టర్ గట్టిప్పలపల్లి కృష్ణయ్య, బిజెపి నాయకులు శేఖర్ రెడ్డి, వెల్జాల్ మాజీ ఉపసర్పంచ్ అజిజ్,నాయకులు మస్క వెంకటయ్య, పురం జంగయ్య, టీ షర్టు దాత వారణాసి వెంకటేష్,శేఖర్,గట్టు రాఘవేందర్, శ్రీకాంత్, విలేఖరి రాజు, విజయ్ యాదవ్, రాఘవేందర్ గౌడ్,విజయ్ కుమార్,కిరణ్, రఘుగౌడ్, శివ మస్కరాజు తదితరు పాల్గొన్నారు.



## చిలుకూరులో ఘనంగా అంగరంగ వైభవంగా గోదా కళ్యాణం

### చిలుకూరు బాలాజీ ప్రధాన అర్చకులు సిఎస్ రంగరాజన్ స్వామి



మొయినాబాద్ జనవరి 13 (నేటి శుభోదయ): చిలుకూరు బాలాజీ దేవాలయంలో ధనుర్మాస ఉత్సవ భాగంలో ఆఖరి రోజు అంటే 29వ రోజు భోగి పండుగ సందర్భంగా గోదాదేవి అనుసంధానం చేసిన చిలుకూరు బాలాజీ ప్రధాన అర్చకులు సి.ఎస్ రంగరాజన్ స్వామి ఆయన మాట్లాడుతూ ధనుర్మాస వ్రతానికి చివరిగా రంగనాథ స్వామియే స్వయంగా బోధ అమ్మవారిని వరించి నట్టుగా గోదా కళ్యాణాన్ని ఒక ప్రాముఖ్యతగా భావించి ప్రతి సంవత్సరం చిలుకూరు బాలాజీ దేవాలయంలో మరి ఇతర వైశ్య దేవాలయాల్లో జరిగేటట్టుగా బోధ కళ్యాణాన్ని అద్దాల మహల్లో వైభవంగా జరిగింది. సోమవారం ఉదయం జరిగినటువంటి ఆరాధన అనంతరం రెండవ ఆరాధన 10 గంటలో సమయంలో ముగించుకుని స్వామివారిని దేవేరులని గోధ అమ్మవారిని శ్రీకృష్ణ పరమాత్మ రూపాన్ని ప్రతిష్టించి వైభవంగా భక్తుల సమక్షంలో నామ సంకేతనంతో గోదా కళ్యాణాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది రంగాచార్యులు స్వామి ఆయన ఆధ్వర్యంలో గోదా కళ్యాణం వైభవంగా జరిగాయి స్వామివారి దివ్యమైన ఆశీర్వాదం భక్తులందరికీ లభించేటట్టుగా స్వామి వారిని ప్రార్థించడం జరిగింది ఈ కళ్యాణ మహోత్సవంలో ప్రధాన అర్చకులు గోపాలకృష్ణ ,రంగాచార్యులు, ప్రియ శిష్యుడు పవన్ కుమార్ భక్తులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు



## భవన నిర్మాణ కార్మికులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన - చిలువేరు స్వామి



( నేటి శుభోదయం) పెద్దపల్లి జిల్లా ప్రతినిధి:-13: భవన నిర్మాణ కార్మిక సమైక్య సంఘం పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు చిలువేరు స్వామి భవన నిర్మాణ కార్మికులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్మికుల జీవితాల్లో ఈ సంక్రాంతి పండుగ సుఖ సంతోషాలను నింపాలని, సిరిసంపదలతో ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. సాంస్కృతి సాంప్రదాయాలు పరిమళించే ఈ సంక్రాంతి ముగ్గులు గొబ్బెమ్మలతో ప్రతి ఇంట పండుగను కుటుంబ సభ్యులతో జరుపుకోవాలని సూచించారు. పండగ పూట పిల్లలు పతంగులు ఎరవేసే సమయంలో పెద్దలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

# వైభవంగా భోగి పండ్ల కార్యక్రమం



( నేటి శుభోదయ) పెద్దపెల్లి జిల్లా ప్రతినిధి:- 13: భోగి మంటలతో మొదలయ్యే సంక్రాంతి ఉత్సవాల్లో భోగిపళ్లది ప్రత్యేక స్థానం. చిన్నపిల్లలకు భోగి పళ్లు పోయడం ఎంతో ముచ్చటగా ఉంటుంది...భోగి పళ్లు ఎందుకు పోయాలో మహాభారతం ద్రోణ పర్వంలో చెప్పారట శివుణ్ని ప్రసన్నం చేసుకోవడానికి నరనారాయణులు బదరికావనంలో తపస్సు చేశారు. ఆ సమయంలో శంకరుడు ప్రత్యక్షమై నీ తపస్సుకు మెచ్చి నన్ను కూడా జయించే శక్తి నీకు ఇస్తున్నా అని వరం ఇస్తాడు. అప్పుడు విష్ణుమూర్తి శక్తిని చూసి దేవతలంతా సంతోషంతో నారాయణుడి తల మీద బదరీ ఫలాలని కురిపించారట. ఆ సమయంలో శ్రీమన్నారాయణుడు చిన్నపిల్లాడిలా మారిపోయాడని అంటారు. దానికి ప్రతీకగా పిల్లలను నారాయణుడిగా భావించి భోగిపండ్లను పోసే సంప్రదాయం మొదలైందట రేగు పండ్లనే ఈ రోజున భోగి పళ్లుగా పిలుస్తారు. వీటినే అర్కఫలం అని కూడా అంటారు.అర్కుడు అంటే సూర్యుడని, సూర్యుడు ఉత్తరాయణం వైపు ప్రయాణించే సమయం కావడం వల్ల, ఆయన కరుణ పిల్లలపై ఉండాలని ఈ పళ్లు పోస్తారు. పిల్లల్లో రోగనిరోధక శక్తి తక్కువగా ఉంటుందిని, సూర్యుడికి ప్రతీకగా, పోషకాల గనిగా పిలిచే ఈ పళ్లను తలపై పోస్తే ఆయురారోగ్యాలతో జీవిస్తారని, వారి మీద ఉన్న దిష్టి మొత్తం పోతుందని పెద్దలు చెబుతారు.



## మంథని డివిజన్ మాజీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుని జన్మదిన వేడుకలు

రామగిరి కాంగ్రెస్ పార్టీ నాయకులు



మంథని, చేరాలరవీందర్, జనవరి -13( నేటి శుభోదయ): మంథని డివిజన్ మాజీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బర్ల శ్రీనివాస్ పుట్టినరోజు సందర్భంగా సోమవారం రామగిరి మండలం సెంటనరికాలనీ లోని రాణి రుద్రమ స్టేడియంలో కేక్ కట్ చేసి బర్ల శ్రీనివాస్ కు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి, ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో ఘనంగా వైభవంగా జరుపుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకొన్నారు.ఈ కార్యక్రమంలో తాజా మాజీ ఎంపీపీ అరెల్లి దేవక్క- కొమురయ్య గౌడ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు తోట చంద్రయ్య, ఆర్ జి -3 ఏరియా ఉపాధ్యక్షులు కోట రవీందర్ రెడ్డి, తీగల సమ్మయ్య,తాజా మాజీ పన్నూరు ఎంపీటీసీ కొప్పుల గణపతి ,మాధసి శ్రీనివాస్, కుంట చక్రవర్తి , అంజి , రఘుపతి , మండల యూత్ కాంగ్రెస్ నాయకుడు మట్ట రాజకుమార్, ప్రదీప్ , మండల యూత్ కాంగ్రెస్ నాయకులు కాంగ్రెస్ పార్టీ అభిమానులు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## వినుకొండ మండలం లో రోడ్డు ప్రమాదం. ఒకరు మృతి



**(నేటి శుభోదయ):** 13 పల్నాడు జిల్లా వినుకొండ: వినుకొండ మండలం. వినుకొండ మండలం లోని అండుగుల కొత్తపాలెం గ్రామ సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం ఈ రోజు జరిగింది. గొర్రెల కాపరి గొర్రెలను మేపుకొని ఇంటికి తోలుకుపోతుండగా వినుకొండ డిపో కు చెందిన ఆర్టీసీ బస్సు యరగొండపాలెం నుండి వినుకొండ కు వస్తున్న బస్సు ఢీ కొట్టటం తో ఓ వ్యక్తి అక్కడి అక్కడే మృతి చెందగా 40..గొర్రెలు కూడా చనిపోయాయి. మృతుడిని వినుకొండ ప్రభుత్వ ఆసుపత్రి కి తరలించినట్లు సమాచారం. ఈ ఘటన పై పూర్తి వివరాలు తెలియాలిసిఉంది.

### స్థానిక పిఎసిఎస్ చైర్మన్ జక్కంశెట్టి రామస్వామి ఆధ్వర్యంలో

## సంక్రాంతి ఉత్సవాలకు మిత్రుల ఆహ్వానం



హైదరాబాద్ 13 జనవరి **(నేటి శుభోదయ):** ప్రతినిధి: సంక్రాంతి పండుగ వస్తుందంటే చాలు రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు హడావుడి అంతా ఇంతా కాదు. హైదరాబాద్ నగరం అయితే సగం పైన ఖాళీ అవుతుంది. స్వగ్రామాలకు కుటుంబాలతో సహా చేరుకుని బంధుమిత్రులతో సాంప్రదాయంగా వస్తున్న ఆటపాటలతో సంక్రాంతి సెలవులు గడిపేస్తారు. ప్రపంచంలో ఏ మూలో ఉన్న తెలుగువానికైనా సంక్రాంతి జ్ఞాపకాలు మరువ లేనివిగా ఉంటాయని అనడం అతిశయోక్తి కాదు. ఇదంతా ఒక ఎత్తైతే స్థానికులతో పాటు అనేకమంది నగరవాసులు ముఖ్యంగా ఉభయ గోదావరి జిల్లాల్లో జరిగే సంక్రాంతి సంబరాలను దగ్గరుండి చూడాలని ఆశిస్తారు. దీనిలో భాగంగా ఆంధ్రప్రదేశ్, మొగల్తూరు మండలం కాళీపట్నం గ్రామానికి చెందిన మిత్రుడు జక్కంశెట్టి ప్రసాద్ ఆహ్వానం మేరకు నగరం నుండి కోరని కిరణ్ కుమార్, కోరని మహిపాల్, నర్వ భాస్కర్, రాజశేఖర్,, నిరుడు సర్వేష్ ముదిరాజ్ మిత్ర బృందం కాశీపట్నం గ్రామానికి చేరుకున్నారు. కాళీపట్నం గ్రామంలో పిఎసిఎస్ చైర్మన్ జక్కంశెట్టి రామస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి ఉత్సవాలలో ఈ మిత్ర బృందం పాల్గొని సందడి చేశారు. సంక్రాంతి పండుగ సందర్భంగా స్థానికంగా నిర్వహించే పోటీలలో నగరానికి చెందిన కోరని కిరణ్ కుమార్ మిత్రబృందం పాల్గొన్నారు.



## భక్తిశ్రద్ధలతో శ్రీ గోదా సమేత రంగనాథ కళ్యాణ మహోత్సవం



**(నేటి శుభోదయ):** 13 జనవరి మల్నాడు జిల్లా కారంపూడి: కారంపూడి మండలం ఒప్పిచర్ల గ్రామం లో వెంచేసి యున్న శ్రీ శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర దేవాలయం నందు ధనుర్మాస మమును పురస్కరించుకొని, ఈ నెల అంతా ప్రాతః కాలములో పూజలు నిర్వహించి భోగి రోజున శ్రీ గోదా సమేత రంగనాథ స్వామి వారి కల్యాణ మహోత్సవమును సోమవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పురోహితులు శ్రీ గోలి కాశీవిశ్వనాధ శాస్త్రి ఆధ్వర్యం లో పంగులూరి.పుల్లయ్య మరియు కమిటీ సభ్యులు, గ్రామస్థుల సహకారం తో కళ్యాణ మహోత్సవం ఏర్పాటు చేశారు. శ్రీ గోదా సమేత రంగనాథ స్వామి వారిని అత్యంత సుందరంగా అలంకరించారు. అనంతరం దేవాలయంలో దంపతులచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇతర గ్రామస్తులు కూడా పాల్గొని కార్యక్రమం ను తిలకించి స్వామి వారి తీర్థ ప్రసాదములను స్వికరించారు. అలాగే కమిటీ వారు అన్నదాన కార్యక్రమం ను నిర్వహించారు.

# వానరాసి వెంకటేష్ క్రీడాకారులకు టి షర్ట్స్ పంపిణీ

క్రీడలతోనే మానసిక ప్రశాంతత

(వి.ఎస్.ఆర్ కన్స్ట్రక్షన్స్), (త్రీ.టి.టీవీ) చైర్మన్

వానరసి వెంకటేష్

తలకొండపల్లి(**నేటి శుభోదయ):** క్రీడలతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని, ఆ గ్రామంలో సంక్రాంతి పండుగకు నిర్వహించే వెల్జల్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ క్రీడాకారులకు



ప్రత్యేకంగా తయారు చేయించిన టీషర్ట్స్ ని పంపిణీ చేసిన వానరాశి వెంకటేష్ వివరాల్లోకి వెళితే రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం వెల్జల్ గ్రామనికి చెందిన వి.ఎస్.ఆర్ కన్స్ట్రక్షన్స్,త్రీ.టి.టీవీ చైర్మన్ వానరాసి వెంకటేష్ గ్రామంలో ప్రతి సంవత్సరం సంక్రాంతికి వెల్జాల్ ప్రీమియర్ లీగ్(క్రికెట్)కు గ్రామ పంచాయతీ పరిధిలోని ఇస్రాయపల్లి (ఐ.పి.ఎల్)క్రీడాకారులకు ప్రత్యేకంగా తయారు చేయించిన టి షర్ట్స్ ని అందించడం జరిగింది.వానరాశి వెంకటేష్ మహబూబ్నగర్ జిల్లా,జడ్చర్లలో నివాసం ఉంటున్నాడు.పుట్టి పెరిగిన గ్రామం పై మమకారంతో ప్రతి సంక్రాంతి పండగకి నిర్వహించే క్రికెట్



టోర్నమెంట్ కు ప్రతి సంవత్సరం 50,000/- 50వేల రూపాయలు ఖర్చు చేసి క్రీడాకారులకు ప్రత్యేకంగా తయారు చేయించిన క్రీడ



దుస్తులను అందించడం జరిగింది. నిరుపేద కుటుంబం లో జన్మించిన,పట్టుదలతో (వి.ఎస్.ఆర్) కన్స్ట్రక్షన్స్,అధినేతగా ఎదిగాడు.ఎన్నో మధ్యతరగతి కుటుంబాల విద్యార్థిని, విద్యార్థులకు, తనవంతుగా సహాయ సహకారాలు అందించాడు.వెంకటేష్ అందించిన సేవలకు పేరుందిన సంస్థలు ఆయనకు ఉత్తమ సేవ పురస్కారాలు, అందించడం జరిగింది.అడిగిన వెంటనే తోచినంత సహాయ సహకారాలు అందించే గొప్ప వ్యక్తిత్వం ఉన్న వ్యక్తి. మంచి మనసున్న వెంకటేష్ వ్యక్తిత్వానికి, గ్రామంలోని ప్రజలు క్రీడాకారులు,వానరాశి వెంకటేష్ మరింత ఉన్నత శిఖరాలకు ఎదగాలని, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని కోరుకుంటున్నారు. వానరసి వెంకటేష్ మాట్లాడుతు క్రీడలు అంటే నాకు చాలా ఇష్టం, ఆటలు ఆడటం వల్ల మానసిక ఉల్లాసం,శారీరకంగా దృఢంగా ఉండడం జరుగుతుంది. క్రీడాకారులందరూ సమయాన్ని వృధా చేసుకోకుండా జీవితంలో మంచి ఉన్నత స్థానాలకు ఎదగాలని, క్రీడాకారులకు నా సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని, నిరుపేద కుటుంబాలలోని విద్యార్థిని, విద్యార్థులకు, నా సహాయ సహకారాలు ఉంటాయి,ఈ సంక్రాంతి పండగ అందరి కుటుంబాల్లో సంతోషాన్ని నింపి సుఖ సంతోషాలతో గడపాలని కోరుకుంటున్నాను అని తెలిపారు.ఈ కార్యక్రమంలో నాయకులు, క్రీడాకారులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

### సీఎం రేవంత్ రెడ్డికి సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేసిన

## కాంగ్రెస్ నాయకులు కోరని



హైదరాబాద్ 13 జనవరి **(నేటి శుభోదయ):** భోగి, సంక్రాంతి పండుగలను పురస్కరించుకొని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రాజేంద్రనగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ జాయింట్ సెక్రటరీ కోరని రాజ్ కుమార్ శుభాకాంక్షలు తెలియజేశారు. అదేవిధంగా ఆచార సంప్రదాయాలకు పెద్ద పీట వేసే తెలుగు వారందరికీ భోగి, సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు రాజ్ కుమార్ తెలిపారు. ఈ సంక్రాంతి ప్రతి ఒక్కరి జీవితంలో సరికొత్త కాంతులు నింపాలని, తెలుగు వారందరూ సుఖ సంతోషాలతో గడపాలని ఆకాంక్షను వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోతెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లోనూ అభివృద్ధి పథంలో రాణించాలని కోరుకుంటున్నట్లు తెలియజేశారు.

## రంగ రంగ వైభవంగా ముగ్గుల పోటీ

## ప్రధాన కార్యదర్శి గిర్మాపురం భాస్కర్ చారి



సికింద్రాబాద్ జిల్లా **(నేటి శుభోదయ):** సికింద్రాబాద్ విశ్వకర్మ సంఘం లో సంక్రాంతి రంగవల్లి పోటీలు నిర్వహించడం జరిగింది విశ్వకర్మ మహిళామణులు 65 మంది ఈ యొక్క పోటీలో పాల్గొనడం



జరిగింది. ఈ యొక్క కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రామ్ గోపాల్పేట్ డివిజన్ సంబంధించిన కార్పొరేటర్ చీర సుచిత్ర శ్రీకాంత్ గారు ముఖ్యఅతిథిగా పాల్గొనడం జరిగింది. మొదటి బహుమతి గట్టు జోష్ణ ఐదువేల రూపాయలు రెండవ బహుమతి పులిగిల్ల లక్ష్మి 3000 రూపాయలు మూడో బహుమతి గట్టు పద్మిని 2000 రూపాయలు ఇంకా మిగతా ముగ్గురికి 500 రూపాయలు చొప్పున ప్రైజ్ మనీ ఇవ్వడం జరిగింది. మిగతా పాల్గొన్న మహిళా మణులకు గిఫ్ట్ ప్యాక్ లు ఇవ్వడం జరిగినది. ఈ యొక్క కార్యక్రమంలో అధ్యక్షుడు గోపాలపురం ప్రకాష్ ప్రధాన కార్యదర్శి గిర్మాపురం భాస్కరాచారి ఉపాధ్యక్షులు కటకం చక్రపాణి కోశాధికారి బోనాల శ్రీనివాస్ సాంఘిక సంక్షేమ చైర్మన్ బోరంపేట వీరాచారి గారు మరి కార్యవర్గం పాల్గొనడం జరిగింది

## రోడ్భద్రలపై ఆటో డ్రైవర్లకి సూచన

- ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ఉపశంకర్




సికింద్రాబాద్ జిల్లా**(నేటి శుభోదయ):** ప్రతినిధి సాయి: మహంకాళి ట్రాఫిక్ పోలీస్ సీఐ ఉపశంకర్ పాట్నీ క్రాస్ రోడ్ వద్ద ఆటో డ్రైవర్ యూనియన్ వారితో ప్యాసింజర్స్ ని ఎక్కించుకోవడం,దించడం,రోడ్ భద్రత ప్రమాణాలు,రోడ్డు ప్రమాదాల వల్ల జరిగే నష్టాలు, నివారణ చర్యలను తెలియచేయడం జరిగింది. నిరంతరం ప్రయాణికులను సురక్షితంగా ఇంటికి చేర్చే ఆటో యూనియన్ డ్రైవర్లకు రోడ్డు ప్రమాదాల ఆవశ్యకత, కుటుంబాలకు మరియు సమాజానికి జరిగే నష్టాలు అలాగే నష్ట నివారణ చర్యలను వివిధ వీడియోస్, ఫోటోలను చూపించి భవిష్యత్ లో ప్రమాద రహిత సమాజ స్థాపనలో భాగస్వాములు కావాలని కోరడం జరిగింది. రాంగ్ సైడ్ డ్రైవింగ్ మరియు డ్రంక్ అండ్ డ్రైవ్ చేయొద్దని ఆటో డ్రైవర్లకి మాంకాళి ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ గారు సూచించారు. ఈ కార్యక్రమాల్లో ఆటో యూనియన్ డ్రైవర్లు మరియు ట్రాఫిక్ సిబ్బంది లు పాల్గొన్నారు.

## తిరుమల లడ్డూ కౌంటర్ల వద్ద అగ్నిప్రమాదం



తిరుపతి,: తిరుమల లడ్డూ కౌంటర్ల వద్ద అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. దీంతో భక్తులు భయభ్రాంతులకు గురై పరుగులు తీశారు. ఆపై సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ప్రమాదంలో ఎలాంటి నష్టం వాటిల్లలేదని సమాచారం. లడ్డూ కౌంటర్లలో 47వ నెంబర్ కౌంటర్ వద్ద ఈ ప్రమాదం చోటు చేసుకుంది. కౌంటర్‌లోని కంప్యూటర్ యూపీఎస్‌లో షార్ట్ సర్క్యూట్ రావడంతోనే ప్రమాదం జరిగినట్లు సిబ్బంది చెబుతున్నారు. మరోవైపు తిరుమల లడ్డూ కౌంటర్‌ల వద్ద నిత్యం భక్తుల రద్దీ ఉండడం సహజమే. అయితే.. ఇటీవల తిరుపతి తొక్కిసలాట ఘటన తర్వాత.. స్వామివారిని దర్శించుకుంటున్న భక్తుల సంఖ్యలో మార్పు కనిపిస్తోంది. ఈ క్రమంలో లడ్డూ కౌంటర్ల వద్ద అగ్నిప్రమాదంతో ఒక్కసారిగా అలజడి చేలరేగగా.. కాసేపు అక్కడున్న భక్తులు అందోళనకు గురయ్యారు.


## కిషన్‌రెడ్డి ఇంట్లో సంక్రాంతి సంబరాలు.. హాజరైన ప్రధాని



న్యూఢిల్లీ:కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి నివాసంలో సోమవారం(జనవరి13) సాయంత్రం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ వేడుకలకు ప్రధాని నరేంద్రమోదీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ వేడుకల్లో భాగంగా ప్రధాని తొలుత తులసి చెట్టుకు పూజ చేశారు. అనంతరం గంగిరెద్దులకు అరటిపళ్ళు తినిపించి,నూతన వస్త్రాలు బహుకరించారు. భోగి రోజు కావడంతో భోగి మంట వేశారు. ఈ సంబరాలకు ప్రధాని మోదీతో పాటు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా,పలువురు కేంద్రమంత్రులు,బీజేపీ ఎంపీలు, బీజేపీ సీనియర్ నేతలు హాజరయ్యారు. అంతకుముందు సినీ నటుడు చిరంజీవి,ప్రముఖ గ్యాస్ట్రోఎంట్రాలజిస్ట్ నాగేశ్వరరావు,బ్యాడ్మింటన్ క్రీడాకారిని పీవీ సింధుతో కలిసి సంక్రాంతి వేడుకలకు ప్రధాని జ్యోతి ప్రజ్వలన చేశారు. ప్రముఖ గాయని సునీత గీతాలాపనతో సాంస్కృతిక కార్యక్రమాలు ప్రారంభించారు.

## దురుసు ప్రవర్తన.. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేపై స్పీకర్‌కు ఫిర్యాదు

హైదరాబాద్: బీఆర్‌ఎస్ హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిపై శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు ఫిర్యాదు వెళ్లింది. ఆయన ప్రవర్తన మీద జగిత్యాల కాంగ్రెస్ ఎమ్మెల్యే సంజయ్ స్పీకర్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. తనతో దురుసుగా ప్రవర్తించారని, కాబట్టి కౌశిక్‌పై చర్యలు తీసుకోవాలని స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను కోరారాయన.




కరీంనగర్ కలెక్టరేట్‌లో అభివృద్ధి కార్యక్రమాల సన్నద్ధతపై ఆదివారం నిర్వహించిన సమావేశం రసాభాసగా మారింది. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్‌కార్డుల జారీ సన్నద్ధతపై నిర్వహించిన కార్యక్రమంలో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ మాట్లాడే సమయంలో.. ఆయన పక్కనే కూర్చున్న బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి లేచి అభ్యంతరం తెలిపారు. 'ఈయనకు మైకు ఇవ్వొద్దు.. నువ్వు ఏ పార్టీవయా..?' అంటూ వేలెత్తి చూపిస్తూ మాటల దాడికి దిగారు. దీంతో డాక్టర్ సంజయ్ 'నీకేం సంబంధం.. నాది కాంగ్రెస్ పార్టీ.. నువ్వు కూర్చో' అన్నారు. దీంతో.. తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. ఒక దశలో సంజయ్ చేతిని కౌశిక్‌రెడ్డి తోసేశారు. అనంతరం కౌశిక్‌రెడ్డి పరుష పదజాలం వాడటంతో గొడవ పెద్దదై పరస్పరం తోసుకునే స్థాయికి చేరింది. ఆ అనూహ్య పరిణామానికి వేదికపై ఉన్న మంత్రులతో పాటు ప్రజాప్రతినిధులు నిర్ఘాంతపోయారు. పక్కనే ఉన్న ప్రజాప్రతినిధులు వారించే యత్నం చేసినా కౌశిక్‌రెడ్డి వినలేదు. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు పోలీసులు ఆయనను బలవంతంగా సమావేశం నుంచి బయటకు తీసుకెళ్లారు. కౌశిక్ వెంట మిగతా బీఆర్‌ఎస్ ప్రతినిధులు వెళ్లిపోయారు. నీటిపారుదల శాఖ మంత్రి, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమక్షంలో ఈ ఘటన జరగడం గమనార్హం. ఏడుసార్లు గెలిచిన తాను రాజకీయంగా ఇలాంటి ప్రవర్తనను ఎన్నడూ చూడలేదంటూ తోటి శాసనసభ్యుడితో కౌశిక్‌రెడ్డి ప్రవర్తించిన తీరును ఉత్తమ్ తప్పుబట్టారు.

## డిసెంబర్‌లో నాలుగు నెలల కనిష్టానికి రిటైల్ ద్రవ్యోల్బణం




న్యూఢిల్లీ : రిటైల్ ద్రవ్యోల్బణం 2024 డిసెంబర్‌లో నాలుగు నెలల కనిష్టం 5.22 శాతానికి పడిపోయింది. ఇది నవంబర్‌లో 5.5 శాతంగా ఉంది. ఆహార ద్రవ్యోల్బణం నవంబర్‌లో 9.04 శాతం నుండి డిసెంబర్‌లో 8.4 శాతానికి స్వల్పంగా తగ్గిందని జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్ఓ) సోమవారం ప్రకటించింది. 2024 డిసెంబర్‌లో అఖిల భారత స్థాయిలో సంవత్సరానికి ద్రవ్యోల్బణాన్ని పెంచుతున్న మొదటి ఐదు వస్తువులు బఠాణీలు (89.12శాతం), బంగాళా దుంపలు (68.23 శాతం), వెల్లుల్లి (58.17శాతం), కొబ్బరి నూనె (45.41 శాతం), కాలీఫ్లవర్ (39.42శాతం) అని ఎన్ఎస్ఓ పేర్కొంది. 2024-25 మూడవ త్రైమాసికంలో భారత వినియోగదారుల ధరల ద్రవ్యోల్బణం సగటున 5.63 శాతంగా ఉంది. గత నెలలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) అంచనా వేసిన 5.7 శాతం కన్నా స్వల్పంగా తగ్గినట్లు ఎన్ఎస్ఓ తెలిపింది. నెలవారీ ప్రాతిపదికన, డిసెంబర్‌లో వినియోగదారుల ధరల సూచీ (సిపిఐ) 0.56 శాతం తగ్గింది. అయితే వినియోగదారుల ఆహార ధరల సూచీ(సిఎఫ్‌పిఐ) నవంబర్ కన్నా 1.5 శాతం తక్కువగా ఉంది. ఆహార ద్రవ్యోల్బణం కూడా నాలుగు నెలల కనిష్టానికి తగ్గింది. అక్టోబర్‌లో 15 నెలల గరిష్టస్థాయి 10.9 శాతం నుండి డిసెంబర్‌లో క్షీణతను సూచిస్తుంది. కొన్ని కీలకమైన ఆహార పదార్థాల ధరలు వేగంగా పెరిగాయని పేర్కొంది.

## తెలుగు రాష్ట్రాల ప్రజలు సుఖసంతోషాలతో విరాజిల్లాలి



అమరావతి : సంక్రాంతి పండుగ వేళ తెలుగు రాష్ట్రాల ప్రజలు సుఖసంతోషాలతో విరాజిల్లాలి అని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆకాంక్షించారు. " సూర్య భగవానుడు మకర రాశిలోకి ప్రవేశించే ఈ పుణ్య సమయాన ధాన్య రాశులను లోగిళ్లకు మోసుకువచ్చే సంక్రాంతి వేళ భారతీయులందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు. రంగవల్లులు.. గొబ్బెమ్మలు.. గంగిరెద్దులు.. హరిదాసులు.. భోగిమంటలు.. పిండివంటల సమ్మేళనమే సరదాల సంక్రాంతి. అలాంటి సరదాల కోసం నగరాలన్నీ పల్లెలవైపు పరుగులు తీశాయి. ఇది ప్రజలకు పండుగపై ఉన్న మక్కువను తెలియజేస్తోంది. ఉపాధి కోసం పల్లె బిడ్డలు నగరాలకు వలసపోవడంతో గ్రామాలు జనాలు లేక కొంతవరకు పలుచబడ్డాయి. ఈ సంక్రాంతి పండుగ వేళ పల్లెలు పిల్లాపాపలతో కళకళలాడుతుంటే సంతోషంగా ఉంది.. పల్లె సౌభాగ్యమే దేశ సౌభాగ్యం. ఆనందాలు, సిరి సంపదలతో పల్లెలు సుభిక్షంగా శోభిల్లాలని, తెలుగు రాష్ట్రాల ప్రజలు సుఖసంతోషాలతో విరాజిల్లాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను " అని పవన్ కల్యాణ్ అన్నారు.

## నారావారిపల్లెలో సంక్రాంతి పోటీలు
## బహుమతులు ప్రదానం చేసిన సీఎం కుటుంబం



తిరుపతి : నారావారిపల్లెలో సంక్రాంతి వేడుకలు ఘనంగా జరిగాయి. సోమవారం ఉదయం నారావారిపల్లి గ్రామం వద్ద భోగి పండుగ సంక్రాంతి సంబరాల సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులకు బెలూన్ బ్లాస్టింగ్, మ్యూజికల్ చైర్స్ తదితర ఆటల పోటీలు, విద్యార్థినులకు బెలూన్ బ్లాస్టింగ్, గన్ని బ్యాగ్ రేస్ లెమన్ అండ్ స్పూన్ మ్యూజికల్ చైర్, పొటాటో గ్యాదరింగ్ తదితర ఆటల పోటీలు నిర్వహించారు. ఈ ఆటల పోటీల కార్యక్రమంలో ముఖ్యమంత్రి మనవడు నారా దేవాన్ష్ పిల్లలతో కలిసి అందరిని ఉత్తేజపరుస్తూ ఉత్సాహంగా పాల్గన్నారు. గ్రామ మహిళలు సంప్రదాయకరమైన పాటలను పాడారు. ఈ పోటీలను ఆహ్లాదకరమైన వాతావరణంలో తిలకించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, వారి కుటుంబ సభ్యులు అనంతరం క్రీడా పోటీలలో గెలుపొందిన విద్యార్థినీ విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. తరువాత పిల్లలతో కలసి ముఖ్యమంత్రి గ్రూప్ ఫోటో దిగారు. ప్రజల నుండి వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమములో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాద రావు, చంద్రగిరి, పలమనేరు, నగరి శాసనసభ్యులు పులివర్తి నాని, అమర్నాథరెడ్డి, గాలి భాను ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాని మోదీపై సీఎం ఒమర్ అబ్దుల్లా ప్రశంసలు



శ్రీనగర్:కశ్మీర్‌లో ఎన్నికలు నిర్వహిస్తామన్న హామీని నెరవేర్చినందుకు ప్రధాని మోదీ పై కశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా ప్రశంసలు కురిపించారు. సోమవారం జెడ్‌మోర్ టన్నెల్‌ను ప్రధాని మోదీ ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో ఒమర్‌అబ్దుల్లా మాట్లాడారు. 'ఇక్కడ ఎన్నికలు నిర్వహిస్తామని మీరిచ్చిన హామీని నెరవేర్చారు.ప్రజలు వారికి కావాల్సిన వారిని ఎన్నుకున్నారు. దీంతో నేను సీఎం హెూదాలో ఇక్కడ మాట్లాడుతున్నాను.దీంతో పాటు కశ్మీర్‌కు రాష్ట్ర హెూదా ఇస్తానన్న హామీని కూడా మీరిచ్చారు. త్వరలో ఈ హామీని కూడా మీరు నెరవేరుస్తారని నేను ఆశిస్తున్నాను'అని ఒమర్ అబ్దుల్లా ఆశాభావం వ్యక్తం చేశారు. జమ్ము కశ్మీర్‌లోని గాందర్‌బల్ జిల్లాలో నిర్మించిన జడ్-మోడ్ సొరంగాన్ని భారత ప్రధాని మోదీ సోమవారం ప్రారంభించారు. శ్రీనగర్- లేహ్ జాతీయ రహదారిపై 2,400 కోట్ల రూపాయలతో ఈ టన్నెల్‌ను నిర్మించారు. ఇది 6.4 కిలో మీటర్ల పొడవుండే ఈ సొరంగంతో ఏడాదిలో ఏ సీజన్‌లోనైనా లద్దాఖ్‌ను రోడ్డు మార్గం ద్వారా ఈజీగా చేరుకోవడానికి అవకాశం ఉంటుంది. ఇక, 2015లో ప్రారంభమైన నిర్మాణ పనులు గతేడాది పూర్తయ్యాయి.

## జడ్-మోడ్ టన్నెల్ ప్రారంభించిన ప్రధాని మోదీ



శ్రీనగర్: ప్రధాని మోదీ జమ్ము కశ్మీర్ పర్యటనలో ఉన్నారు. ఈ పర్యటన సందర్భంగా జడ్-మోడ్ టన్నెల్‌ను ప్రధాని మోదీ ప్రారంభించారు. అనంతరం, టన్నెల్‌ను జాతికి అంకితం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాని మోదీ, కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ, జమ్ము కశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా పాల్గొన్నారు. జమ్ము కశ్మీర్‌లోని గాందర్‌బల్ జిల్లాలో నిర్మించిన జడ్-మోడ్ సొరంగాన్ని భారత ప్రధాని మోదీ నేడు ప్రారంభించారు. శ్రీనగర్- లేహ్ జాతీయ రహదారిపై 2,400 కోట్ల రూపాయలతో ఈ టన్నెల్‌ను నిర్మించారు. ఇది 6.4 కిలో మీటర్ల పొడవుండే ఈ సొరంగంతో ఏడాదిలో ఏ సీజన్‌లోనైనా లద్దాఖ్‌ను రోడ్డు మార్గం ద్వారా ఈజీగా చేరుకోవడానికి అవకాశం ఉంటుంది. ఇక, 2015లో ప్రారంభమైన నిర్మాణ పనులు గతేడాది పూర్తి అయ్యాయి. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా మాట్లాడుతూ.. టన్నెల్ నిర్మాణం ప్రారంభించినందుకు ప్రధాని మోదీకి కృతజ్ఞతలు. కేంద్రం చాలా వేగంగా టన్నెల్ నిర్మాణాన్ని పూర్తి చేసింది. టన్నెల్ నిర్మాణం.. టెర్రరిస్టులపై విజయం వంటిదే. టన్నెల్ నిర్మాణం జమ్ము కశ్మీర్ ఆర్థిక వ్యవస్థకు ఊతమిస్తుందన్నారు. ఇదే సమయంలో జమ్ము కశ్మీర్‌లో ఇటీవల స్వేచ్ఛాయుతంగా ఎన్నికల జరిపినందుకు ధన్యవాదాలు తెలిపారు.

# అబ్బురపరుస్తున్న టెంట్ సిటీ

**2 లక్షల టెంట్లతో నిర్మాణం**

**సాధారణుల నుంచి సంపన్నుల దాకా ఏర్పాట్లు**

**కుంభమేళాకు పోటెత్తే కోట్లాది భక్తులకు బస, ఏర్పాట్లు చేసే సామర్థ్యం ప్రయాగ్‌రాజ్‌లోని హెూటళ్లకు లేదు. ఆ అవసరాలు తీర్చే ఏకైక చిరునామాగా 'టెంట్ నగరి' నిలిచింది. లక్షలాది టెంట్లు ఆతిథ్యానికి సిద్ధమయ్యాయి.**



**సకల సౌకర్యాల శిబిరాలు**

ప్రయాగ్‌రాజ్‌లోని గంగానదీ తీర ఇసుక తిన్నెలు ఇప్పుడు ఆధునాతన టెంట్‌లుగా రూపాంతరం చెంది ఎండా, వాన నుంచి భక్తులకు రక్షణగా నిలిచాయి. పది అడుగుల ఎత్తయిన కర్రలను ఈ టెంట్‌ల నిర్మాణం కోసం వాడారు. మొత్తంగా 68 లక్షల చెక్క కర్రలు, 100 కిలోమీటర్ల పొడవైన వస్త్రం, 250 టన్నుల బరువైన సీజీఐ(ఇనుప) రేకులతో ఈ టెంట్‌లను నిర్మించారు. గత కొన్ని నెలలుగా నిరాటంకంగా ఏకంగా 3,000 మంది కార్మికులు అవిశ్రాంతంగా కష్టపడి ఈ టెంట్ నగరానికి తుదిరూపునిచ్చారు. వర్షం, గాలులను తట్టుకునేలా టెంట్‌లను పటిష్టంగా నిపుణులు నిర్మించారు. ఒకేసారి 20 లక్షల మందికి బస సౌకర్యం కల్పించేలా ఎక్కువ టెంట్లను కట్టారు.

విభిన్న సౌకర్యాల మహాకుంభ గ్రామం

టెంట్ సిటీలో అన్ని ఒకే తరహా టెంట్‌లు ఉండవు. సాధారణ భక్తుడు మొదలు సంపన్న భక్తుడి దాకా ప్రతి ఒక్కరికి వారి వారి తాహతుకు తగ్గట్లు విభిన్న టెంట్లను నెలకొల్పారు. డిమాండ్, భక్తుల రద్దీని బట్టి మరిన్ని టెంట్‌లను నిర్మించేందుకు యోగి ఆదిత్యనాథ్ సర్కార్ ఏర్పాట్లుచేస్తోంది. భారతీయ రైల్వే వారి ఇండియన్ రైల్వేస్ క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్(ఐఆర్‌సీటీసీ) వారు భక్తుల కోసం మహాకుంభ్ గ్రామ్ పేరిట ప్రత్యేక టెంట్‌లను నిర్మించింది. ఇవి త్రివేణి సంగమం నుంచి 3.5 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. వీటిల్లో సూపర్ లగ్జరీ టెంట్లు, విల్లాలు ఉన్నాయి. విడిగా స్నానాల గది, చల్లటి, వేడి నీళ్లు, ఎయిర్ బ్లోయర్, మంచాలున్నాయి. అల్పాహారం, భోజన సదుపాయాలూ కల్పిస్తున్నారు. టెలివిజన్ ఏర్పాట్లూ చేశారు. ఆర్ఐసీటీసీ ద్వారా ఈ టెంట్లను బుక్ చేసుకోవచ్చు. రోజుకు రూ.18,000 నుంచి రూ.20,000 వసూలుచేస్తారు.

ప్రీమియం టెంట్లూ ఉన్నాయ్

ఖరీదైన పరుపులతో సిద్ధంచేసిన మంచాలు, రాత్రిళ్లు బోగిమంటల్లా చలికాచుకోవడానికి ఏర్పాట్లు, ఆధ్యాత్మిక బోధనలు వినేందుకు విడిగా ఏర్పాట్లూ ఈ ప్రీమియం టెంట్‌ల వద్ద ఉన్నాయి. ప్రాచీన మత విశ్వాసాలు, ఆచార సంప్రదాయాలు, ఆధునికత మేళవింపు ఈ సంగమస్థలిలో కనిపిస్తుంది. వీటిలో శాకాహార భోజన ఏర్పాట్లు చేశారు. తెలుగు, తమిళం, కన్నడ, బెంగాలీ, అస్సామీ, మరాఠీ, హిందీ సహా ఇంగ్లిస్ వంటి పది భాషల్లో సమాచారాన్ని పొందొచ్చు

ఉచితంగానూ ఇస్తారు

సర్వోదయ మండలి వంటి సంస్థలు పేద భక్తుల కోసం ఉచిత బస వసతులనూ ఈ టెంట్లలో కల్పిస్తున్నాయి. గరిష్టంగా 30 మంది ఈ భారీ టంట్లను తాత్కాలికంగా కొంతసమయం మాత్రం ఉండేందుకు అనుమతిస్తారు. పోటెత్తే భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని, తర్వాతి పేద భక్తులకూ అవకాశం ఇవ్వాలనే ఉద్దేశ్యంతో తక్కువ సమయం మాత్రమే బస వసతి కల్పిస్తారు.

ఎంతో సౌకర్యవంతం

"40 ఏళ్లుగా ప్రతి పుష్కరాల్లోనూ టెంట్ సిటీకి వచ్చా. అప్పట్లో కేవలం టెంట్ల కింద ఇసుకపైనే నిద్రించేవాళ్లం. ఇప్పుడు చాలా సౌకర్యాలు పెంచారు. టీవీ, వై-ఫై, డ్రోన్లు, నిఘా కెమెరాలు, అసలు మనం ఎక్కడ ఉన్నామని లొకేషన్ తెలిపే క్యూఆర్ కోడ్ స్కాన్ ఫ్లెక్సీ బ్యానర్లు, నిరంతరం పోలీసు గస్తీ.. ఇలా ఎన్నో సదుపాయాలు ఉన్నాయి. భద్రంగా, భక్తితో, చక్కటి భోజనాలతో కుంభమేళా యాత్ర పూర్తిచేయడంలో ఈ టెంట్‌లు కీలకపాత్ర పోషిస్తున్నాయి" అని రాజస్తాన్‌కు చెందిన వృద్ధురాలు కల్పవాసీ అన్నారు.

రూ. 3,000 నుంచి 1లక్ష దాకా!


టెంట్ సౌకర్యంతోపాటు అక్కడి పలు ఘాట్‌ల వరకు తీసుకెళ్లడం, టూర్ గైడ్, పడవ ప్రయాణం, దగ్గరి పుణ్యక్షేత్రాల సందర్శన తదితరాలతో కలిసి పలు రకాల ప్యాకేజీలను కొన్ని సంస్థలు అందిస్తున్నాయి. రూ.3,000 నుంచి మొదలు ఏకంగా రూ.1లక్ష దాకా 'టెంట్ కమ్ టూర్' ప్యాకేజీలను అందిస్తున్నాయి. లాలూజీ అండ్ సన్స్ సంస్థ ఇందులో 104 ఏళ్ల అనుభవం గడించింది. "పుష్కరాల కోసం మా ఏర్పాట్లు 18 నెలల నుంచే మొదలవుతాయి. టెంట్ అంతర్గత సౌకర్యాల కోసం కాటన్, టెరీ కాటన్ వాడతాం. బయటివైపు చిరిగినా వర్షపు నీరు లోపలికి రాకుండా పాలిథీన్‌తో కుట్టేస్తాం. మంచాలు, కుర్చీలు, టీవీ స్టాండ్ ఇతర సౌకర్యాలు సమకూరుస్తాం" అని సంస్థ నిర్వాహకుడు దీపాన్షు అగర్వాల్ చెప్పారు. "పూర్వం రోజుకు రూ.10 వేతనం దక్కేది. ఇప్పుడు రూ.500 పైనే చేతికొస్తున్నాయి. డబ్బుల కంటే భక్తుల కోసం పని చేస్తున్నామన్న తృప్తి మాకెంతో సంతోషాన్ని ఇస్తుంది" అని టెంట్ల నిర్మాణంలో పనిచేసే రోజువారీ కార్మికుడు 68 ఏళ్ల రఘునాథ్‌ను చెప్పుకొచ్చారు.

## మాస్కోపై అమెరికా తాజా ఆంక్షలు
# భారతీయ కంపెనీలే లక్ష్యంగా



వాషింగ్టన్: రష్యా ఇంధన రంగానికి వ్యతిరేకంగా ప్రకటించిన తాజా చర్యలో భాగంగా అమెరికా, బ్రిటన్‌లు రెండు భారతీయ కంపెనీలను నిషేధించాయి. తాజా ఆంక్షలతో మరింత ఆజ్యం పోసినట్టయిందని ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు. అమెరికా ట్రెజరీ డిపార్ట్‌మెంట్, బ్రిటీష్ ప్రభుత్వం చేపట్టిన ఈ భారీ చర్యలు రెండు ప్రధాన రష్యన్ పెట్రోలియం ఉత్పత్తిదారులైన గాజ్‌ప్రోమ్ నెఫ్ట్, సుర్గుట్‌నెఫ్టెగాజ్, వాటి అనుబంధ సంస్థలను లక్ష్యంగా చేసుకున్నాయి. రష్యన్ ముడి చమురును రవాణా చేసే 183 నౌకలపై ఆంక్షలు కూడా ఉన్నాయి. జాబితాలో ఉన్న రెండు భారతీయ సంస్థలు స్కైహార్ట్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్ ప్రయివేట్ లిమిటెడ్, అవిషన్ షిప్పింగ్ సర్వీసెస్ ప్రయివేట్ లిమిటెడ్. యూఎస్ స్టేట్ డిపార్ట్‌మెంట్ ప్రకటన ప్రకారం.. ఈ కంపెనీలు రష్యా ఆర్కిటిక్ ఎల్ఎన్‌జీ 2 ప్రాజెక్టుకు మద్దతునిచ్చాయి. ఇది దేశంలోని అతిపెద్ద ధ్రువీకత సహజ వాయువు ఉత్పత్తిదారు నోవాటెక్ యాజమాన్య అభివద్ధిలో పాక్షికంగా ఉన్నది. ఈ ప్రాజెక్ట్ 2023 నుంచి అమెరికా ఆంక్షల కింద ఉంది. ఆర్కిటిక్ ఎల్ఎన్‌జీ 2 ప్రాజెక్ట్ కు భౌతికంగా సహాయం చేయడం లేదా మద్దతు అందించడం కోసం రెండు కంపెనీలను ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ 14024 కింద నియమించారు. అదనంగా, అవిజన్, ప్రవాసి.. ఒనిక్స్ నిర్వహించే రెండు నౌకలను కంపెనీకి సంబంధించిన ఆస్తిగా గుర్తించారు. ప్రాజెక్ట్ నుంచి సరుకును లోడ్ చేసే ధ్రువీకృత సహజ వాయువు వాహకాలను భారత కంపెనీలు నిర్వహించాయి. ఆర్కిటిక్ ఎల్ఎన్‌జీ 2 ప్రాజెక్ట్‌ను "పునరుజ్జీవింపజేసే ప్రయత్నంలో" "థర్డ్ కంట్రీ షిప్ మేనేజ్‌మెంట్ సంస్థల ద్వారా ఎల్ఎన్‌జీ వాహకాల యాజమాన్యాన్ని అస్పష్టం చేసే ప్రయత్నాలలో రష్యా నిమగ్నమైందని" అమెరికా అధికారులు పేర్కొన్నారు. గతేడాది సెప్టెంబర్‌లో, ముంబయిలో నమోదు చేయబడిన రెండు భారతీయ ఆధారిత కంపెనీలు గోటిక్, ఫ్లియో ఎనర్జీపై వాషింగ్టన్ ఆంక్షలను విధించింది. ఇవి ప్రాజెక్ట్ తో అనుసంధానించబడి ఉన్నాయని పేర్కొన్నది. నోవాటెక్ ప్రాజెక్ట్ నుంచి ఎల్ఎన్‌జీని "ఎగుమతి చేసే ప్రయత్నాలకు" సంబంధం ఉందని ఆరోపిస్తూ ఈ కంపెనీల యాజమాన్యంలోని రెండు నౌకల పైన కూడా ఆంక్షలను విధించింది. గతేడాది అమెరికా ఒక ప్రత్యేక చర్యలో, రష్యన్ సంస్థలకు ఎలక్ట్రానిక్స్, విమానయాన భాగాలను సరఫరా చేసినందుకు 19 భారతీయ కంపెనీలు, ఇద్దరు జాతీయులపై ఆంక్షలు విధించింది. దీనికి ప్రతిస్పందనగా, ఆ కంపెనీలు దేశీయ చట్టాలను ఉల్లంఘించలేదనీ, భారతదేశ చట్టాల పరిధిలోనే పనిచేస్తున్నాయని భారత్ పేర్కొన్నది. సమస్యలను "స్పష్టం" చేయడానికి భారత్.. అమెరికాతో సంప్రదింపులు జరుపుతోందని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ పేర్కొన్నది.గత రెండు సంవత్సరాలలో రష్యా భారత్‌కు కీలక ఇంధన భాగస్వామిగా అవతరించింది. ముడి చమురు సరఫరాలో అగ్రగామిగా అవతరించింది. గతేడాది సెప్టెంబరులో రష్యా నుంచి భారత్ చేసుకున్న ముడి చమురు దిగుమతులు ఆగస్టు నుంచి 11.7 శాతం పెరిగి, దాదాపు 1.9 మిలియన్ బ్యారెళ్లకు చేరుకున్నాయి. ఇది ఆ నెలలో భారత మొత్తం ముడి చమురు దిగుమతుల్లో దాదాపు 40 శాతం కావటం విశేషం. దేశ ఇంధన భద్రతను నిర్ధారించడంలో మాస్కో కీలక పాత్ర పోషిస్తున్నదని భారత్ తెలిపింది.

# పొగడ్తలతోనే సరి!



నిన్న ప్రధాన మంత్రి అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం పూడిమడకలో ఎన్‌టిపిసి ఇంటిగ్రేటెడ్ గ్రీన్ హైడ్రోజన్ హబ్ శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టులో భాగంగా ప్రభుత్వరంగ సంస్థ మూడు దశల్లో రూ. 65,370 కోట్లు పెట్టుబడి పెట్టనుంది. మొదటి దశలో 2,500 ఎకరాల భూమిలో రూ. 1,518 కోట్ల ప్రాజెక్టు అయిన కృష్ణపట్నం ఇండస్ట్రియల్ హబ్‌ను ప్రధానమంత్రి వర్చువల్‌గా ప్రారంభిచారు. ఇది 50,000 మందికి ఉపాధి అవకాశాలను సృష్టిస్తుందని భావిస్తున్నారు. నక్కపల్లిలో రూ.1,877 కోట్లతో బల్క్‌డ్రగ్స్ పార్కును కూడా మోడీ శంకుస్థాపన చేయనున్నారు. రూ. 11,542 కోట్ల పెట్టుబడితో 2,002 ఎకరాల్లో బల్క్ డ్రగ్స్ పార్క్ 54,000 మందికి ఉపాధిని కల్పిస్తుందని అంచనా. దేశప్రధాని రాష్ట్ర ఆర్థిక రాజధాని విశాఖ వచ్చి వెళ్లారు. భారీ బహిరంగ సభలో మాట్లాడారు. ఆయన ప్రసంగంలో రాష్ట్రాన్ని వేధిస్తున్న సమస్యలపై స్పందించకపోవడం తీవ్ర నిరాశకు గురిచేసింది. ఈ ప్రాంతం, ఆంధ్ర రాష్ట్ర ప్రజలు గత నాలుగేళ్లుగా పోరాడుతున్న విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ మాట మాత్రం కనీసంగా కూడా ఎత్తలేదు. పక్కనే ఉన్న సిఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కనీసంగా కూడా అడగలేదు సరికదా, ఆయనను ప్రసన్నం చేసుకోవడానికే ఇద్దరూ పోటీపడ్డారు. ముచ్చటగా ముగ్గురూ కలిపి ఈ సభా వేదికగా ఆంధ్ర రాష్ట్రానికి మోసం చేశారు. సభఅంతా ఒకరినొకరు పొగుడుకోవడంతోనే సరిపోయింది. ప్రధాని సభలో పదేపదే ప్రస్తావించిన గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టు నిర్మాణం, ఆయన విధానపరంగానే ద్వేషించే, ఒక ప్రభుత్వ రంగ పరిశ్రమ అయిన ఎన్‌టిపిసి ద్వారా జరగడం ప్రభుత్వరంగ ప్రాధాన్యత తెలుస్తోంది. మరోవైపు కడపలోని ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ ప్రధాన కార్యాలయాన్ని అమరావతికి తరలించుకుపోవాలని ప్రభుత్వ పెద్దలు కృత నిశ్చయంతో ఉన్నారు. సంప్రదాయాన్ని, మార్గదర్శకాల్ని పక్కకుతోసి తమ పంతం నెగ్గించుకోవాలని చూస్తున్నారు. పాలకులు, పాలక పార్టీలు ఏవైనాసరే దశాబ్దాల తరబడి రాయలసీమ నిర్లక్ష్యానికి గురవుతుందనడానికి తిరుగులేని సత్యమిది. మళ్ళీమళ్ళీ పునరావృతం అవుతున్న విషాదమిది. ఇప్పటికే కొప్పర్తి ఇండస్ట్రియల్ హబ్‌లో భాగమైన ఎంఎస్ఎంఇ టెక్నాలజీ సెంటర్ అమరావతికి తీసుకుపోయారు. తాజాగా, రాయలసీమ నుంచి లోకాయుక్త, మానవ హక్కుల కమిషన్, ఎపిఇఆర్‌సి, వక్ఫ్ ట్రిబ్యునల్, సిబిఐకోర్టు అమరావతికి తరలిస్తున్నారన్న వార్తలు బలంగా వినిపిస్తున్నాయి. ఎపిజిబి ప్రధాన కార్యాలయాన్ని అమరావతికి తరలించడం అంటే రాయలసీమ ప్రజలంటే పాలకులకు లెక్కలేనితనమే కారణం. గ్రామీణ బ్యాంకింగ్ కార్యకలాపాలు నిర్ణయించబడే ప్రధాన కార్యాలయం వెనకబడిన జిల్లాలకే అవసరం ఎక్కువ. అంతేకాక ప్రధాన కార్యాలయం ప్రత్యక్ష పరోక్ష ఉపాధి అవకాశాలకు కూడా వీలు కల్పిస్తుంది. పేద, మధ్యతరగతి, చిన్న, సన్నకారు రైతులకు, చిన్నచిన్న వ్యాపారులకు, డ్వాక్రా సంఘాలు, చేతివృత్తులు, చిన్నపరిశ్రమలు, స్వయం ఉపాధి సంఘాలకు, ఎదిగొచ్చే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు -ఇలా అనేక రకాల వారికి రుణాలను ఇచ్చే బ్యాంకు ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్. రాయలసీమకు జరిగిన అనేక అన్యాయాల కొనసాగింపుగానే అన్ని సంస్థల తరలింపు జరుగుతున్నది. ఆంధ్రప్రదేశ్‌లో ప్రాంతీయ వృద్ధి నమూనాలు వేతనాలలో సర్దుబాట్లు లేదా మూలధనానికి రాబడికి సంబంధించిన అంచనాలకు అనుగుణంగా లేవు. ఇది చివరికి ప్రాంతీయ ఆర్థిక కలయికకు దారితీస్తుంది. ఆంధ్రప్రదేశ్‌లో ప్రాంతీయ అసమతుల్యతలను తగ్గించడంలో ఏరకమైన జోక్యం సహాయపడుతుందనేది ప్రశ్నగా మిగిలిపోయింది. కడప ఉక్కు ఫ్యాక్టరీ, దుగ్గరాజపట్నం పోర్టు సాధ్యం కాదని కేంద్ర ప్రభుత్వం చేతులెత్తేసింది. రాష్ట్ర విభజన చట్టం ప్రకారం ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాలకు రావలసిన ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీలను కేంద్ర ప్రభుత్వం ఒక ప్రహసనంలా మార్చేసింది. వీటిపై కూడా కూటమి నేతలు నోరు మెదపడం లేదు. డబుల్ ఇంజన్ సర్కార్ వస్తే రాష్ట్రానికి ఏదో న్యాయం జరుగుతుందని కొంతమందికైనా వున్న భ్రమలు ఇప్పుడు క్రమేణా కరిగిపోతున్నాయి. విద్యుత్ చార్జీలు, ఇతర బాదుళ్లతో సామాన్యుల నడ్డి విరుస్తున్నాయి. స్టీల్‌ప్లాంట్‌ను కాపాడు కోవాలన్నా, విభజన చట్టం అమలు కావాలన్నా, ఎడాపెడా వేస్తున్న భారాలను తిప్పికొట్టాలన్నా, చట్టపర హక్కులను నిలబెట్టుకోవాలన్నా ప్రజా పోరాటమే శరణ్యం.

## నామినేషన్ పత్రాలను సమర్పించిన అతిషి




న్యూఢిల్లీ : రానున్న అసెంబ్లీ ఎన్నికల కోసం ఢిల్లీ ముఖ్యమంత్రి అతిషి సోమవారం నామినేషన్ పత్రాలను సమర్పించారు. కల్కాజీ నియోజకవర్గం నుండి ఆమె పోటీకి దిగుతున్న సంగతి తెలిసిందే. నామినేషన్ పత్రాల దాఖలుకు ముందు కల్కాజీ నియోజకవర్గంలో భారీ ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీలో అతిషితో పాటు ఆప్ నేత మనీష్ సిసోడియా కూడా పాల్గొన్నారు. ర్యాలీ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నియోజకవర్గం అభివృద్ధి కోసం గత ఐదేళ్లుగా అవిశ్రాంతంగా కృషి చేశానని అన్నారు. కల్కాజీ ప్రజలు తన కుటుంబమని, వారు తనను సోదరిగా, కుమార్తెగా భావిస్తారని అన్నారు. తాను కేవలం ఈ నియోజకవర్గ ప్రతినిధిని మాత్రమే కాదని, వారి జీవితంలో ఓ భాగంగా భావిస్తారని అన్నారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి ఆప్ కట్టుబడి ఉందని అన్నారు. బిజెపి పేదలకు వ్యతిరేకి అని, మురికివాడలకు వ్యతిరేకి అని దుయ్యబట్టారు. అతిషీకి పోటీగా బిజెపి నుండి రమేష్ బిదూరి, కాంగ్రెస్ నుండి మహిళా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షురాలు అల్కా లంబాలు బరిలోకి దిగుతున్నారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు ఫిబ్రవరి 5న జరగనుండగా, ఫిబ్రవరి 8న ఫలితాలు వెలువడనున్నాయి.

## దేశవ్యాప్తంగా చలిగాలుల తీవ్రత

### ఉత్తర భారతంలో పాఠశాలలకు సెలవులు



న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా చలిగాలులు తీవ్రత భారీగా పెరిగింది. ప్రధానంగా ఉత్తరప్రదేశ్‌లో చలిగాలుల తీవ్రత మరింత ఎక్కువైంది. దీంతో ఢిల్లీకి ఆనుకుని ఉన్న ఘజియాబాద్ జిల్లాలో 8వ తరగతి వరకు ఉన్న అన్ని పాఠశాలలకు జనవరి 18 వరకు సెలవులు ప్రకటించారు. చలి బారి నుంచి విద్యార్థులకు ఉపశమనం కలిగించేందుకు ఈ మేరకు జిల్లా మేజిస్ట్రేట్ ఇంద్ర విక్రమ్ సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే పాఠశాల సిబ్బంది మాత్రం పాఠశాలలోనే ఉంటారు. ఉద్యోగులందరూ వారి కార్యాలయాలు, విభాగాలకు సంబంధించిన వారి బాధ్యతలను నిర్వర్తిస్తారని ఆదేశాలలో స్పష్టం చేశారు. ఘజియాబాద్ జిల్లాలో చలికాలం కారణంగా 1 నుంచి 8వ తరగతి వరకు ఉన్న అన్ని బోర్డు అనుబంధ పాఠశాలలను జనవరి 18 వరకు మూసివేయాలని జిల్లా ప్రాథమిక విద్యాశాఖ అధికారి ఆదేశించారు. అన్ని పాఠశాలలు ఈ ఆదేశాలను ఖచ్చితంగా పాటించాలని సూచించారు. ఆదేశాలు పాటించకుంటే పాఠశాలలపై చర్యలు తీసుకుంటామన్నారు. 8వ తరగతి వరకు ఉన్న అన్ని పాఠశాలలను జనవరి 11వ తేదీ వరకు మూసివేయాలని జిల్లా ప్రాథమిక విద్యాశాఖాధికారి గతంలోనే ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పుడు ఆ ఉత్తర్వులను పొడిగించారు.

### రానున్న 2, 3 రోజులు ఇదే పరిస్థితి

ఢిల్లీ, దేశరాజధాని ప్రాంతం (ఎన్‌సిఆర్) పరిధిలోని వాయువ్య భారతదేశంలో రాబోయే 2-3 రోజుల్లో చాలా దట్టమైన పొగమంచు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిక జారీ చేసింది. దీంతో పాటు ఒక మోస్తరు పొగమంచు ఉంటుందని ఎల్లో అలర్ట్ కూడా జారీ చేశారు. చలి పెరుగుతుందని డిపార్ట్‌మెంట్ ప్రకటించిన నేపథ్యంలో అధికారులు పాఠశాలలను మూసివేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ ఆర్డర్ అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు వర్తిస్తుంది. అలాగే, నోయిడాలో కూడా 8వ తరగతి వరకు ఉన్న పాఠశాలలు తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు మూసివేయబడతాయని అధికారులు ఆదివారం ప్రకటించారు. లక్నో పాఠశాలలు కూడా జనవరి 14, 2025 వరకు మూసివేయబడతాయి. 9 నుంచి 12వ తరగతి విద్యార్థులకు ఆన్‌లైన్‌లో సెషన్లు నిర్వహించనున్నారు. ఆగ్రా, మథురలలో 1 నుండి 8 తరగతుల పాఠశాలలు జనవరి 14, 2025 వరకు మూసివేయబడతాయని అనౌన్స్ చేశారు. మరోవైపు ఢిల్లీ ప్రభుత్వం అన్ని ప్రభుత్వ పాఠశాలలకు జనవరి 1 నుంచి జనవరి 15, 2025 వరకు శీతాకాల సెలవులను ప్రకటించింది. ఈ ఆర్డర్ ప్రకారం తరగతులు మళ్లీ జనవరి 16, 2025న పున్ణప్రారంభించబడతాయి.

## బంగ్లాదేశ్ డిప్యూటీ హైకమిషనర్‌కి భారత్ నోటీసులు




న్యూఢిల్లీ : సరిహద్దు ఉద్రిక్తతలపై బంగ్లాదేశ్ డిప్యూటీ హైకమిషనర్ నురల్ ఇస్లామ్‌కు భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ సోమవారం నోటీసులచ్చింది. భారత్ -బంగ్లాదేశ్‌ల మధ్య ఐదు ప్రాంతాల్లో కంచెలు వేయనున్నట్లు హెూం వ్యవహారాల సలహాదారు జహంగీర్ ఆలం చౌదరి ఆదివారం మీడియాకు వెల్లడించిన వెంటనే బంగ్లాదేశ్ విదేశాంగ శాఖ భారత హైకమిషనర్ ప్రణరు వర్మకు జనవరి 12న నోటీసులు జారీ చేసింది. బంగ్లాదేశ్ సరిహద్దుల్లో నిర్మాణాలు ప్రారంభించే ముందు తమను సంప్రదించలేదని, ఇది ద్వైపాక్షిక ఒప్పందాన్ని ఉల్లంఘించడమేనని బంగ్లాదేశ్ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ పరిస్థితిపై చర్చలు జరిపేందుకు భారత రాయబారిని పిలిపించినట్లు ప్రకటించింది. ప్రణరు వర్మ ఆదివారం విదేశాంగ శాఖ కార్యాలయానికి చేరుకని వివరణ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంపై భారత్ కూడా తగు చర్యలు తీసుకుంది. బంగ్లాదేశ్ డిప్యూటీ హైకమిషనర్ నురల్ ఇస్లామ్‌కు విదేశాంగ శాఖ నోటీసులు ఇచ్చింది. గతేడాది ఆగస్ట్ 5న షేక్ హసీనా ప్రభుత్వం కుప్పకూలిన అనంతరం హసీనా పార్టీ అవామీ లీగ్ సభ్యులు, బంగ్లాదేశ్ ప్రజలు సరిహద్దుల్లో నుండి భారత్ భూభాగంలోకి చొరబడుతున్నారు. దీంతో భారత ప్రభుత్వం సరిహద్దు భద్రతపై దృష్టి సారించింది. 2024 ఆగస్ట్ చివరలో మేఘాలయలో భారత్-బంగ్లాదేశ్ సరిహద్దులో అవామీ లీగ్ నేత ఇష్ఫాక్ అలీ ఖాన్ పన్నా మృతదేహాన్ని గుర్తించిన సంగతి తెలిసిందే. రాజకీయ ప్రత్యర్థులు ఆయనను వెంబడించి హత్య చేసి ఉంటారని పలువురు అనుమానం వ్యక్తం చేశారు.

## టర్క్‌స్ట్రీమ్ గ్యాస్‌పైప్‌లైన్‌పై దాడికి యత్నించిన ఉక్రెయిన్



మాస్కో : దక్షిణ రష్యాలోని టర్క్‌స్ట్రీమ్ గ్యాస్ పైప్‌లైన్ మౌలిక సదుపాయంపై ఉక్రెయిన్ దాడికి యత్నించినట్లు రష్యా ప్రకటించింది. పైప్‌లైన్‌లో కొంతభాగాన్ని ధ్వంసం చేసేందుకు యత్నించిన తొమ్మిది ఉక్రెయిన్ డ్రోన్లను కూల్చివేసినట్లు తెలిపింది. ఈ పైప్‌లైన్ నుండి టర్కీ, యూరప్‌కు రష్యా గ్యాస్‌ను సరఫరా చేస్తుంది. దక్షిణ రష్యాలోని క్రాస్నోడార్ ప్రాంతంలోని కంప్రెషర్ స్టేషన్‌ను లక్ష్యంగా చేసుకుందని రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ పేర్కొంది. అయితే పైప్‌లైన్ యథావిధిగా పనిచేస్తోందని, ఎటువంటి ప్రాణనష్టం జరగలేదని తెలిపింది. ఒక డ్రోన్ శకలాలు పడిపోవడంతో భవనం, కంప్రెషర్ వద్ద ఉన్న గ్యాస్ మీటరింగ్ స్టేషన్ సామగ్రికి స్వల్ప నష్టం వాటిల్లిందని, అయితే అత్యవసర బృందాలు వెంటనే మరమ్మత్తులు చేశాయని రష్యా ఓ ప్రకటనలో పేర్కొంది. గ్యాస్ పైప్‌లైన్ అనపా నగరం వెలుపల ఉన్న రస్కయా కంప్రెషర్ స్టేషన్ నుండి గ్యాస్ పైప్‌లైన్ ప్రారంభమై, టర్కీలోని కికోయ్ వరకు, అక్కడి నుండి యూరప్‌కు వెళుతుంది.

# కుంభమేళా చరిత్ర ఇప్పటిది కాదు



కుంభమేళాది అతి ప్రాచీన నేపథ్యం. ఇది చరిత్రకందని కాలం నుంచీ జరుగుతూ వస్తోందని చెబుతారు. క్రీస్తుశకం ఆరో శతాబ్దంలోనే హర్షవర్ధనుడు ప్రయాగలో కుంభమేళాకు ఘనంగా ఏర్పాట్లు చేసినట్టు చరిత్రలో నమోదైంది. కుంభమేళాను ఆదిశంకరులు వ్యవస్థీకృతపరిచి ప్రస్తుత రూపు కల్పించారంటారు. కుంభ మేళా అనే పేరు అమృతకలశం నుంచి వచ్చింది. సాగరమథనం వల్ల పుట్టుకొచ్చిన అమృత భాండం నుంచి నాలుగు చుక్కలు భూమిపై ప్రయాగ్‌రాజ్, హరిద్వార్, ఉజ్జయిని, నాసిక్‌ల్లో పడ్డాయని ఐతిహ్యం. తల్లికి బానిసత్వం తప్పించేందుకు గరుత్మంతుడు స్వర్గం నుంచి అమృతభాండం తెస్తుండగా చుక్కలు జారిపడ్డాయని మరో కథనం. అమృతంతో అత్యంత పవిత్రతను సంతరించుకున్న ఆ నాలుగు చోట్ల కుంభమేళా జరగడం ఆనవాయితీగా వస్తోంది.

### నాలుగు రకాలు

కుంభమేళా నాలుగు రకాలు. ఏటా మాఘ మాసంలో జరిగేది మాఘ మేళా. ఇది కేవలం ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతుంది. ఆరేళ్లకు ఓసారి జరిగేది అర్ధ కుంభమేళా. ఇది హరిద్వార్, ప్రయోగరాజ్‌ల్లో జరుగుతుంది. 12 ఏళ్లకోసారి జరిగేది పూర్ణ కుంభమేళా. ఇది ప్రయాగ్‌రాజ్‌తో పాటు హరిద్వార్, ఉజ్జయిని, నాసిక్‌ల్లో కూడా జరుగుతుంది. 12 పూర్ణ కుంభమేళాల తర్వాత, అంటే 144 ఏళ్లకు ఓసారి వచ్చేది మహా కుంభమేళా. అంత అరుదైనది కనుకనే దీనికి ఎనలేని ప్రాధాన్యం. దీన్ని ప్రయోగరాజ్‌లో మాత్రమే నిర్వహిస్తారు. ప్రస్తుతం జరుగుతున్నది మహా కుంభమేళా.

### ఏం చేస్తారు?

కుంభమేళాలో పాల్గొనే భక్తులు ముఖ్యంగా ఆచరించేది త్రివేణి సంగమ ప్రాంతంలో పవిత్ర స్నానం. తద్వారా పాపాలు తొలగి దేహత్యాగానంతరం మోక్షప్రాప్తి కలుగుతుందన్నది విశ్వాసం. 45 రోజుల పాటు జరిగే ఈ వేడుకలో ఆరు ముఖ్యమైన తిథులను మరింత పవిత్రమైనవిగా నమ్ముతారు. ఆ రోజుల్లో సంగమ స్థలికి ఇసుక వేసినా రాలనంతగా జనం పోటెత్తుతారు. పుణ్య స్నానం తర్వాత త్రివేణి తీరాన్నే ఉన్న అక్బర్ కోటలో అక్షయ వటవృక్షాన్ని. ఆ పక్కనే ఉన్న బడే హనుమాన్ ఆలయాన్ని, అక్కడికి సమీపంలో ఉండే మాధవేశ్వరీ శక్తి పీఠాన్ని దర్శిస్తారు. మామూలు రోజుల్లో కంటే మేళా సమయంలో సంగమ స్థలిలో చేసే పుణ్యకార్యాలు అత్యంత ఫలప్రదాలని నమ్ముతారు.

### కల్ప

వాసం కుంభమేళాకు మాత్రమే ప్రత్యేకమైన క్రతువు కల్పవాసం. భక్తులు ప్రయాగ్‌రాజ్‌లో సంగమ ప్రాంతంలో నెల రోజుల పాటు దీన్ని నిష్టగా పాటిస్తారు. మేళా మొదలయ్యే పుష్య పౌర్ణిమ నాడు కల్పవాస సంకల్పం తీసుకుంటారు. అప్పటినుంచి మాఘ పూర్ణిమ దాకా కల్పవాసాన్ని పాటిస్తారు. ఆ నెల పాటు సంగమ స్థలం దాటి వెళ్లరు. రోజూ గంగలో మూడు మునకలు వేయడం, యోగ, ధ్యానం, పూజలు, ప్రవచనాల శ్రవణం వంటివాటితో పూర్తి భక్తి భావనల నడుమ కాలం గడుపుతారు. ఈసారి 15 నుంచి 20 లక్షలకు పైగా భక్తులు కల్పవాసం చేయనున్నట్టు ప్రభుత్వ సీనియర్ అధికారి ఒకరు వివరించారు. వారి కోసం కుంభ్‌నగర్‌లో విస్తృతమైన ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు.

# ఎందుకీ కార్చిచ్చు?!

**మానవ తప్పిదాలతోనే పెను విపత్తులు**
**కొంప ముంచుతున్న పర్యావరణ మార్పులు**
**తీవ్ర వర్షాభావం, ఎండిపోయిన అడవులు**
**లాస్ ఏంజెలెస్‌లో మంటలకు అవే కారణం**



లాస్ ఏంజెలెస్‌కు కార్చిచ్చుకు కారణం ఏమిటన్నది చర్చనీయంగా మారింది. ఇలాంటి విపత్తులకు ప్రకృతి కంటే మానవ తప్పిదాలే ఎక్కువగా కారణమవుతుంటాయి. అడవుల్లో సాధారణంగా పిడుగుపాటు వల్ల కార్చిచ్చులు రగులుతుంటాయి. కరెంటు స్తంభాలు నేలకొరిగినప్పుడు చెలరేగే మంటలూ కార్చిచ్చుగా మారుతుంటాయి. ఇవిగాక మనుషుల నిర్లక్ష్యం కూడా ఈ ఉత్పాతానికి దారితీస్తుంటుంది. కాల్చిపడేసిన సిగరెట్ సైతం పెనువిపత్తుగా మారొచ్చు. తాజాగా లాస్ ఏంజెలెస్‌ను బుగ్గిపాలు చేస్తున్న కార్చిచ్చు సైంటిస్టులనే నిర్ఘాంతపరుస్తోంది. మంటలు ఇంత వేగంగా వ్యాప్తించడం మునుపెప్పుడూ చూడలేదని అగ్నిమాపక అధికారులు అంటున్నారు. వాతావరణ పరిస్థితులూ ఇందుకు దోహదం చేశాయని చెబుతున్నారు. లాస్ ఏంజెలెస్‌లో చాలా రోజులుగా వానలే లేవు. దాంతో చెట్లు చేమలతోపాటు కొండల దిగువ ప్రాంతాల్లో గడ్డి పూర్తిగా ఎండిపోయింది. కనుకనే మంటలు సులభంగా అంటుకుని వ్యాపించాయి. బలమైన ఈదురు గాలులతో పరిస్థితి మరింత విషమించింది. ఏటా ఇదే సీజన్‌లో 'శాంటా అనా' గాలులు వీస్తుంటాయి. వీటి వేగం గంటకు 129 కిలోమీటర్ల వరకు ఉంటుంది. అగ్నికి ఆజ్యంలా కార్చిచ్చుకు ఈ గాలులు జతకలిశాయి. వాటి ధాటికి విమానాలు, హెలికాప్టర్లు ఎగిరే పరిస్థితి లేకపోవడంతో ఆకాశం నుంచి నీరు, అగ్నిమాపక రసాయనాలు చల్లే వీల్లేకుండాపోయింది. దాంతో మంటలను అదుపులోకి తేవడం మరింత కష్టసాధ్యంగా మారింది.

### మానవ తప్పిదాలతో భారీ మూల్యం

లాస్ ఏంజెలెస్ కార్చిచ్చు వంటివాటి రూపంలో వాతావరణ మార్పుల దుష్ప్రభావాన్ని స్పష్టంగా చూస్తున్నామని నిపుణులు చెబుతున్నారు. "మానవ తప్పిదాల వల్ల ముమ్మందు ఇలాంటి విపత్తుల ముప్పు మరింత పెరుగుతుంది. అవి వ్యాప్తి చెందే వేగమూ పెరుగుతుంది" అని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా పర్యావరణ పరిరక్షణపై దృష్టి పెట్టకపోతే ప్రకృతి విపత్తులు మరింతగా విరుచుకుపడడం ఖాయమని హెచ్చరిస్తున్నారు. "కార్చిచ్చు అమెరికాకు పరిమితమైంది. కాదు. నేడు ప్రపంచమంతా ఈ ముప్పు ముంగిట ఉంది" అని తేల్చిచెబుతున్నారు. చిన్న మంటగా మొదలయ్యే కార్చిచ్చులు క్షణాల్లోనే విస్తరించి నియంత్రించలేని స్థాయికి చేరుకుంటాయి. మానవ కార్యకలాపాల పుణ్యమా అని విపరీతంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలు పరిస్థితిని మరింతగా దిగజారుస్తున్నాయి. లాస్ ఏంజెలెస్‌లో 2022, 2023లో వరుసగా రెండేళ్లు భారీగా వర్షాలు కురిశాయి. ఏకంగా 133 సెంటీమీటర్ల వర్షం పడింది. దీంతో చెట్లు బాగా పెరిగాయి. పచ్చదనం పరుచుకుంది. 2024లో పరిస్థితి ఒక్క సారిగా తారుమారైంది. వర్షాల్లేక కరువు తాండవించింది. చెట్లు ఎండిపోయాయి. దక్షిణ కాలిఫోర్నియా మొత్తం కరువు ఛాయలే! కార్చిచ్చు ఊహాతీత వేగంతో వ్యాపించడానికి ఇదే ప్రధాన కారణమని సైంటిస్టు మాట్ జోన్స్ విశ్లేషించారు. కాలిఫోర్నియా వంటి నగరాల్లో జనాభా అధికం. ప్రకృతి విపత్తులు పొంచి ఉన్న ఇ లాంటి నగరాల్లో నివసించడం క్షేమమేనా అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఇటీవలి కాలంలో బీమా సంస్థలు కూడా అప్రమత్తమయ్యాయి. లాస్ ఏంజెలెస్, పరిసర నివాసాలకు బీమా రక్షణ కల్పించేందుకు కొంతకాలంగా నిరాకరిస్తూ వస్తున్నాయి. ప్రమాదాలు జరిగితే భారీ మొత్తంలో బీమా సొమ్ము చెల్లించాల్సి ఉండటమే ఇందుకు కారణం. లాస్‌ఏంజెలెస్‌లో ధ్వంసమైన ఇళ్ల స్థానంలో కొత్తవి నిర్మించబోతున్నారు. అందుకు ప్రభుత్వం సాయం అందించబోతోంది. కార్చిచ్చులను దృష్టిలో పెట్టుకొని వాటి నిర్మాణంలో మరిన్ని జాగ్రత్తలు పాటించాలని నిపుణులు సూచిస్తున్నారు.

# సంక్రాంతి జరీచీర



ఏదో తప్పదు కావున పెళ్లి చేసి చేతులు దులుపుకున్నారనీ, సంక్రాంతికి పిన్నీ బాబాయిలు పుట్టింటి హెూదాలో తననూ భర్తనూ పిలిచేదేమీ లేదనీ తేలిపోయాక చిన్నబుచ్చుకుంది ఆ కొత్త పెళ్లి కూతురు. భర్త గమనించాడు. వాళ్లు రాసినట్టే పిలిచినట్టే ఒక కార్డుముక్క సృష్టించాడు. పండక్కు ముందు భార్యను బయల్దేరదీశాడు. పట్నానికి తీసుకెళ్లి దర్జాగా హెూటల్‌లో దించాడు. 'ఇదేమిటండీ' అని ఆశ్చర్యపోయింది భార్య. 'మరేటనుకున్నావోయ్. ఇంతకు మించిన పుట్టిల్లు లేదు. కోరిన టిఫెను, భోజనం గదిలోకే వస్తాయి. సాయంత్రమైతే సినిమాలు షికార్లు బోలెడన్ని. ఇదే నీ పుట్టిల్ల నుకొని సంతోషపడు' అంటాడు. మనసుంటే పండగ ఉండదా? మధురాంతకం రాజారాం 'పండగ అల్లుడు' కథ ఇది. చార్జీలు, పండగ ఖర్చులు తలచి పాపం ఆ పేద తల్లిదండ్రులు పెద పండుగ ఊసే ఎత్తలేదు కూతురి సంగతే మరిచినట్టు. అల్లుడు అది గమనించాడు. పండక్కు తన భార్య కొత్తచీర కట్టుకుంటే ఆ మురిపెం వేరు. సింగారమూ వేరు. కోర్టు గుమాస్తా అతను. చిన్న జీతమే. కాని పెద్ద మనసు. రిక్షా ఎక్కడం మానేశాడు. బయట టిఫెన్లు కాఫీలు మానేశాడు. నాటకాలు చూడ్డం మానేశాడు. పుస్త కాలు కొనడమున్నూ. ప్రతి పైసాను పొదుపు చేసి తెచ్చాడు ఆఖరుకు 'పుల్లంపేట జరీచీర'! పది హేను మూరల ఆ జరీచీర కట్టుకుని కళకళ్లాడిన భార్య 'ఇంత కష్టం చేసి నా కోసం తెచ్చారా' అని భర్త కంఠార తల ఆన్చి బాష్పాలు రాలుస్తుంది. సయోధ్య ఉంటే కాపరం పండగే. శ్రీపాద కథ ఇది. కరువు రోజుల్లో పండగంటే ఎంత కష్టం. ఇంటి పెద్ద మనసు కష్టపెట్టుకుంటూనే ఎక్కడ ఏది సర్ది చెప్పాలా అని ఆగమవుతూ ఉంటాడు. పిల్లలకిది పడుతుందా? పండగ మరో నెలుందనగానే తట్టలు పట్టి ఎక్కడి పేడంతా సేకరించి పిడకలు కొట్టి ఆరబెట్టారు. 'ఎన్నర్రా' అని తండ్రి అడిగితే '300' అన్నారు గర్వంగా. తండ్రికి ఎన్నో ఆలోచనలు. వాటిని పొయ్యిలోకి వాడితే కట్టెలైనా మిగిలి నాలుగు పైసలు ఆదా అవుతాయి గదా అని. 'ఇవ్వండ్రా' అనంటే 'ఊహూ'. భోగి మంటలేసి ఎగిసే మంటలను చూసి పక్కింటివాళ్లను ఓడిస్తేనే పిల్లలకు ఆనందం. పేదవాడికి పండగంటే 'సర్దుబాటే'. సాక్షాత్తూ ఆరుద్ర రాసిన కథ ఇది. అయితే 'ఇప్పటి భోగిమంటలు ఒక మంటలేనా' అంటారు ముళ్లపూడి వెంకట రమణ. జగన్నా థుని రథమంత ఎత్తున లేసేలా వేస్తేనే వేసినట్టట. 'ఒరే ఫ్రెండూ... వెళ్లి రెండు బైండింగ్ అట్టలైనా పట్టుకురారా మంట పెంచుదాం' అనంటే ఎవరింట ఉన్నాయట బైండింగ్ అట్టలూ పుస్తకాలూనూ. కోళ్లగంపలూ తాటాకు బుట్టలూ తప్ప. కావున జానెడు ఎత్తు మంటే జగన్నాథుడితో సమానం. అయితే పిల్లకారుకు చిన్న సరదా ఉందిలే. ఆ చిరుచీకట్లలో ప్లీడరు శేషయ్యగారి బోర్డు ఊడబెరికి మంటల్లో వేసి గోడ ఖాళీ ఎందుకని భోజనం తయార్ బోర్డు తెచ్చి అక్కడ వేళ్లాడదీశారు. పండగంటే పిల్లల అల్లరిది. జీవితాంతం చెప్పుకునేటందుకు జ్ఞాపకమై గూడుకట్టేది. ముళ్లపూడి 'భోగి మంటలు' బలే సరదా కథ. అయితే స్త్రీగళాన్ని ఎలా వదిలేస్తాం? ఒక సింగిల్ ఉమన్‌కు అందరూ గది అద్దెకిస్తారుగాని ఒకటే షరతు... రోజూ ఇంటి ముందర ముగ్గేయాలని. ఆ సింగిల్ ఉమన్ మంచి జర్నలిస్టు. ఆలోచనాశీలి. సమాజానికి పనికొచ్చే పనులు చేయగలిగినది. మించి తన జీవి తాన్ని తాను నిర్మించుకోగలిగేది. అయినా సరే. ముగ్గేయాల్సిందే. 'నాకు రాదు... వచ్చినా వేయను'... 'పనిమనిషితోనైనా వేయించు'... పండుగ నెల వచ్చిందంటే ఆమెకు గండం. ముగ్గు లేని వాకిలిగా ఆమె ఇల్లే కనపడుతుంది. ఆ నెల్లో యజమాని ఖాళీ చేయించడం ఖాయం. మరో గదికి చలో. ఇంటిని చూసి ఇల్లాలిని చూడాలట. ఇల్లాలి చదువు, జ్ఞానం, వికాసం వీటి వల్ల కాదా దేశానికి పండగ వచ్చేది? పి.రామకృష్ణారెడ్డి కథ 'ముగ్గు'. సంక్రాంతి తెలుగువారి ముఖ్యమైన పండగ. యుగాంతం వరకూ నిలిచే పండగ. సంస్కృతిని ఎప్పటికీ కాపాడుకోవాల్సిందే. కాని సందర్భాలలోని అంతరాలను చూసి సరిచేసి పండుగ అర్థాన్ని విశాలం చేసుకోవాలి కూడా. 'గుమ్మం ముందు బొబ్బిలిపాట గాళ్లేమిటి... బుడబుక్కల వాళ్లేమిటి... తందానపదం వాళ్లేమిటి... గంగిరెద్ల వాళ్లేమిటి... పగటి వేషగాళ్లేమిటి... తోలు బొమ్మలాళ్లేమిటి... ఎరకలాళ్లేమిటి... చెంచులాళ్లేమిటి... జంగాలేమిటి... సన్నాయి వాళ్లేమిటి... వీళ్లంతా నిమిష నిమి షానికి వచ్చేవాళ్లే' అని రాస్తారు కవికొండల వేంకటరావు 'మా ఇంట సంక్రాంతి' కథలో. పండగ ఒకరు చేసుకునేదిగా... మరొకరు వారింటి ముందుకు వచ్చి ఇనాము అడిగేదిగా ఎందుకు ఉండాలి? ఇనాము ఇచ్చే స్థాయిలో ఒకరు, పొందే స్థాయిలో ఒకరు ఉంటే అది న్యాయమైన సమాజమేనా? జన్మ అంతరాలు, ఆర్థిక అగాథాలనే కాబోలు భోగిజ్వాలల్లో పడేయాల్సింది. గాయకుడు పుట్టా పెంచల్దాసు 'యేటంబిడ యేడుచ్చా పోయా' అనే కథను రాశాడు. భోగి రోజు పండగ చేసుకోనీకుండా, ఇల్లు గడిచేందుకు భత్యాలు తీసుకురమ్మని తల్లి పోరుపెడితే, చీకటితో బయల్దేరి ఇంటింటా పాటలు పాడి గింజలు, వడ్లు తీసుకుని చీకటి పడ్డాక ఇల్లు చేరి, అప్పుడు కొత్త బట్టలు కట్టుకుని ఎవరికి చూపించుకోవాలో తెలియక దిగాలు పడే పసివాడి కథ అది. దుఃఖం వస్తుంది. సంక్రాంతి ఎంతో సంబరమైన పండగ. కాని సమకాంతికై అది చేసే వాగ్దానాన్ని మనం ఇంకా అందుకోవలసే ఉంది. సామాజికంగా అందరూ అడుగు పెట్టగలిగేదే ఉత్తరాయణం అంటే. క్రాంతి రావడమే సరైన సంక్రాంతి. అటువంటి సంక్రాంతిని కాంక్షిస్తూ గుమ్మడి పూల, పసుపు చేమంతుల శు భాకాంక్షలు!

సంపాదకీయం

## యుద్ధ అనాథల జీవితాల్లో 'కాంతిరేఖ'

### (విశ్లేషణ)

ప్రతి యుద్ధానికి అనాథలు ఉంటారు. ప్రతి సంఘర్షణ దాని మచ్చలను అమాయకులపై వదిలేస్తుంది. ఈ మాట ప్రపంచంలో గతంలో జరిగినా, వర్తమానంలో జరుగుతున్నా, భవిష్యత్‌లో జరగబోయే యుద్ధాలు మిగిల్చే కన్నీటి గాథల గురించే. యుద్ధాలు మిగిల్చే విషాదంలో అత్యంత భయానకమైన జీవితాలు అనాథలదే. అహంకారపూరితమైన ఆధిపత్య కోసం, సంఘర్షణల కారణంగా జరుగుతున్న యుద్ధ భూమిలోని పోరు కోట్లమంది అనాథలను మిగిల్చిపోతుంది. ఈ కన్నీటి ఆవేదనకు ముగింపు ఎక్కడో తెలియక బిక్కుబిక్కుమంటున్న అనాథ పిల్లలు కారుస్తున్న కోట్ల క్యూసెక్కుల కన్నీరుకు కారకులెవ్వరో%ా%అన్ని దేశాలకు తెలిసినా వారికి అడ్డుకట్ట వేసి శాంతి మార్గం వైపు నడిపించేందుకు ఆయా దేశాలు ఇప్పటికీ సమాయత్తం కాకపోవడం ప్రపంచ మానవ సమాజంలో ఓ విషాద పరిణామం. గత రెండు మూడు సంవత్సరాల నుండి పలు దేశాలు, వర్గాల మధ్య జరుగుతున్న యుద్ధాలు సంఘర్షణలో లక్షలాది మంది పిల్లలు అనాథలుగా మారుతున్నారు. గాజా -ఇజ్రాయెల్, రష్యా- ఉక్రెయిన్, ఆర్మేనియా %-% అజర్ బైజాన్, అఫ్ఘనిస్తాన్, ఇథియోపియాలోని టిగ్రే ప్రాంతాల్లోని వర్గాల మధ్య యుద్ధాలు, ఘర్షణల కారణంగా యుద్ధ అనాథల సంఖ్య గణనీయంగా పెరుగుతున్నది. యూనిసెఫ్ లెక్కల ప్రకారం యుద్ధాలు మిగిల్చిన విషాదం కారణంగా 140 మిలియన్లకు పైగా అనాథలుండగా, అత్యధికంగా ఆసియా ఖండంలోనే 61 మిలియన్ల మంది అనాథలు ఉన్నారు. 18 శతాబ్దం నుండి 20వ శతాబ్దం ప్రారంభంలో జరిగిన యుద్ధాల్లో బాధితుల సంఖ్య 2001 వరకు క్రమంగా పెరిగింది. మొదటి, రెండవ ప్రపంచ యుద్ధ సమయాల్లో అధికారిక అంచనాల ప్రకారం పోలాండ్‌లో 30 లక్షల మంది, యుగోస్లేవియాలో 2 లక్షల మంది పిల్లలు అనాథలు అయినట్లు లెక్కలు తేలాయి. ప్రపంచ యుద్ధాలలో 1990 నాటికి అనాథ బాధితుల సంఖ్య 146 మిలియన్లులుండగా, 1995 నాటికి 151 మిలియన్లు, 2000 నాటికి 155 మిలియన్లకు బాధితులు చేరుకోవడం విషాదకరమైన పరిణామం. సేవ్ ది చిల్డ్రన్ లెక్కల ప్రకారం ప్రపంచంలో ఆరు మంది పిల్లల్లో ఒక్కరు యుద్ధాలు, వర్గాల సంఘర్షణ జోన్‌లో నివసిస్తున్నారు. ప్రపంచంలో పది దేశాలు అఫ్ఘనిస్తాన్, కాంగో, సిరియా, యెమెన్, సోమాలియా, మాలి, నైజీరియా, కామెరూన్, సూడాన్, సెంట్రల్ ఆఫ్రికన్ రిపబ్లిక్ దేశాల్లో నివసిస్తున్న పిల్లలు ఈ ఘర్షణల కారణంగా అత్యంత ప్రమాదకరమైన పరిస్థితుల్లో ఉన్నారని అంతర్జాతీయ బాలల హక్కుల సంస్థ గతంలో ప్రకటించింది. సూడాన్‌లో ప్రతి వంద మంది చిన్నారుల్లో 10 మంది అనాథాశ్రమాల్లో మగ్గిపోతున్నారు. ఇటీవల రష్యా సుమారు 14 వేల ఉక్రెయిన్ కుటుంబాల పిల్లలను విడదీసి తమ యుద్ధ క్యాంపులకు తరలించుకుపోయినట్లు తెలుస్తుంది. ప్రపంచంలో ప్రతి దేశంలో ఏదో రూపంలో జరిగిన యుద్ధాలు, ఘర్షణల ఫలితంగా తల్లిదండ్రులును కోల్పోయిన పిల్లలు అనాథలుగా, జీవచ్ఛావాలుగా బతుకీడుస్తున్నారు. ప్రపంచంలోని యుద్ధ అనాథల సంక్షేమానికి ఎస్ఓఎస్ ఎన్ఫాంట్స్ ఎన్ డెట్రాసెస్' అనే ఫ్రెంచ్ సంస్థ నడుం బిగించింది. ప్రతి సంవత్సరం యుద్ధ అనాథల దినోత్సవాన్ని (వరల్డ్ డే ఆఫ్ వార్ ఆర్ఫాన్స్) నిర్వహిస్తుంది. యుద్ధాల సమయంలో అనాథలైన పిల్లల గురించి అవగాహన కల్పించడం, పిల్లల మానవ హక్కులను పరిరక్షించేలా కార్యక్రమాలు రూపొందించడంతో పాటు బలహీన వ్యక్తులకు మద్దతు, రక్షణ అవసరాన్ని చాటిచెప్పేలా చేయడం, వారి అవసరాలను తీర్చి ఉత్తములుగా ఎలా తీర్చిదిద్దాలనే సంకల్పంతో ఈ సంస్థ పనిచేస్తుంది. మిగిలిన పిల్లలలాగే యుద్ధంలో అనాథలైన పిల్లలు కూడా తమ హక్కుల కోసం, స్వేచ్ఛగా జీవించాల్సిన భరోసాని, తమ హృదయాల్లో పడిన గాయాలు తొలగేలా సమాజ జీవనంలో వారిని ఉన్నతంగా ఎదిగేలా చేయాల్సిన బాధ్యత ప్రపంచంలోని అన్ని దేశాలకు ఉంది. సమష్టిగా ప్రపంచ దేశాలు చేతులు కలిపి వారిని ఆదుకోవాల్సిన అవసరం ఉంది. యుద్ధ అనాథలు అనారోగ్యం బారినపడటంతో పాటు లైంగిక దోపిడీకి, మానవ అక్రమ రవాణాకు గురవుతున్నారు. భిక్షాటన ముఠాలు వారిని ఆదాయ వనరులుగా మార్చుకుంటున్నారు. కొన్ని దేశాలు ఈ బాలలను బాల సైనికులుగా మార్చి యుద్ధ భూమి లో బలి పశువులను చేస్తున్నారు. ప్రపంచ యుద్ధ అనాథల దినోత్సవం అంటే జ్ఞాపకార్థం కోసమో, స్మరించుకొనే రోజే కాదు. ఇది అనాథల కోసం అండగా నిలిచే చర్యలకు, సహాయాలకు నడుం కట్టించే పిలుపు. యుద్ధంలో తమ తల్లి దండ్రులను కోల్పోయిన పిల్లవాడి ఆక్రందనను, హృదయ గాయాలను మాన్పించే సమష్టి సమాజం కోసం పయనించాల్సిన సందర్భాన్ని ఎలుగెత్తి చాటే ఓ ఓదార్పు. సంఘర్షణకు గురైన అమాయక బాధితులకు ఓ వెలుగునిచ్చే ప్రయాణం కోసం అడుగులు వేయాల్సిన మానవీయ కోణం. కోట్ల మంది యుద్ధ అనాథ బాలల ఉజ్వల భవిష్యత్ కోసం అవగాహన పెంచడానికి ప్రపంచ యుద్ధ అనాథల దినోత్సవం వారి జీవితాల్లో ప్రేమను పంచే ఓ కాంతిరేఖ. 'ప్రపంచంలో చాలా మంది చిన్నరొట్టె ముక్క కోసం చనిపోతున్నారు, కానీ చిన్నప్రేమ కోసం ఇంకా చాలా మంది చనిపోతున్నారు' అన్న మదర్ థెరిస్సా వాక్కులు ఒక్కసారి గుర్తుచేసుకోవాల్సిన సందర్భం ఇది.

# పవన్ పోటీ స్టేట్మెంట్స్... అలెర్ట్ కావాల్సిందేనా ?



ఏపీలో ఈసారి చంద్రబాబు ప్రభుత్వం అని ఎవరూ అనడం లేదు. ఆ మాటకు వస్తే ఎన్డీయే ప్రభుత్వం అని బాబు పదే పదే చెబుతున్నారు. దాని వెనక ఆయన మార్క్ వ్యూహాలు ఉన్నాయి. మరి ఆ వ్యూహాలతో పాటు ఇబ్బందులూ ఉన్నాయి. కూటమి అంటే మూడు పార్టీల కలయిక.మూడు పార్టీల అధినాయకత్వాలు వేరు. వారంతా టీడీపీ కూటమి అధినేత ప్రభుత్వ సారథి బాబు మాటలు వింటారా అంటే సంకీర్ణ ధర్మం అయితే పాటించాల్సి ఉంటుంది. మూడు కాదు పాతిక పార్టీలు కలసిన ప్రభుత్వాన్ని ఒకనాడు ఢిల్లీలో వాజ్ పేయ్ ప్రధానిగా నాయకత్వం వహించి నడిపారు. ఆనాడు కూడా ఏ ఒక్క పార్టీ స్వతంత్రించి ప్రధానికి భిన్నంగా విధాన ప్రకటన అయితే చేయలేదు.ఇక కేంద్రంలో ఈసారి నరేంద్ర మోడీ ప్రభుత్వం మరో రెండు పార్టీల బలం మీద ఆధారపడి పాలన చేస్తోంది. అయినా మోడీ పాలనలో ఏ మిత్ర పక్షమూ జోక్యం చేసుకోవడం లేదు, ఎవరూ కూడా సాహసించి సలహాలు అయితే ఇవ్వడంలేదు.

కానీ ఏపీలో మాత్రం భిన్నమైన పరిస్థితులు ఉన్నాయని తెలుగుదేశం పార్టీ శ్రేయోభిలాషి అయిన అనుకూల మీడియా అంటోంది.ముఖ్యమంత్రికి పోటీగా ఉప ముఖ్యమంత్రి కూడా విధానపరమైన ప్రకటనలు చేస్తున్నారని దాంతో అధికారులు ఎవరి మాట వినాలో తెలియక గందరగోళం పడుతున్నారు అని అనుకూల మీడియా ఎత్తి చూపుతోంది. లేటెస్ట్ గా చూస్తే తిరుపతిలో జరిగిన తొక్కిసలాట ఎపిసోడ్ లో ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు అక్కడికి వెళ్ళి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అక్కడ బాధితులను కలసి ఓదార్చారు.అనంతరం టీటీడీ భవనంలో జరిగిన సంఘటన మీద సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. బాధ్యులైన వారిపై చర్యలు ఉంటాయని విచారణ కమిటీ ఏర్పాటు చేస్తామని అన్నారు. అయితే సీఎం హోదాలో బాబు ఇచ్చిన ప్రకటనకు భిన్నంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వేరేగా ప్రకటనలు ఇచ్చారు. అసలు ఆయన వేరేగా పర్యటన చేశారు. వేరేగా మీడియా మీటింగ్ పెట్టారు. అలాగే బాధ్యులుగా టీటీడీ చైర్మన్, ఈవో జేఈవో లను ముందు పెట్టారు.ఇలా బాబు ఒకటి చెబితే పవన్ మరొకటి చెప్పారు. దీంతోనే చర్చ మొదలైంది. దానికే అనుకూల మీడియా పట్టుకుంది. నిజానికి ఉప ముఖ్యమంత్రి అని అంటున్నా రాజ్యాంగంలో ఉప ముఖ్యమంత్రి అన్నది లేదని ప్రత్యేక అధికారాలు అంతకంటే లేవని కూడా అంటోంది. పవన్ సైతం ఒక మంత్రి మాత్రమే అని పేర్కొంది. ముఖ్యమంత్రి వెంట మంత్రులు అంతా వెళ్ళారని పవన్ జనసేన అధినేత హోదాలో ప్రత్యేకంగా బాధితులను పరామర్శ చేయవచ్చునని కానీ అదే సమయంలో ఆయన విధాన పరమైన ప్రకటనలు చేయడమ ఎందుకు అన్నట్లుగా ప్రశ్నించింది.ఇది సంకీర్ణ ధర్మానికి ఇబ్బంది అవుతుందని కూడా పేర్కొంది.

కూటమి ఐక్యంగా ఉండాలీ అంటే ముఖ్యమంత్రి ఉప ముఖ్యమంత్రి ఇద్దరూ చర్చించుకుని ఒకే మాట మీద ఉండాలని సూచించింది. ఈ విషయంలో పవన్ కొంత స్వతంత్రించి మాట్లాడుతున్న తీరు వల్ల ఫ్యూచర్ లో సమస్యలు వస్తాయని అంతిమంగా అది రాష్ట్రానికి నష్టం చేకూరుస్తుందని కూడా పేర్కొంది.మొత్తానికి చూస్తే పవన్ కళ్యాణ్ ఇచ్చిన స్టేట్మెంట్స్ మీదనే అనుకూల మీడియా అలెర్ట్ చేసింది. నిజానికి అనుకూల మీడియా చెప్పినది అందరికీ తెలిసిందే. రాజ్యాంగం ప్రకారం ఉప ప్రధాని ఉప ముఖ్యమంత్రులు అని ఉండరు మంత్రిగానే వారు ప్రమాణం చేస్తారు. ఇక ప్రధాని ముఖ్యమంత్రి కే విశేష అధికారాలు ఉంటాయి. వారే కీలక ప్రకటనలు చేస్తారు. విధానపరమైన నిర్ణయాలను వారే తీసుకుంటారు.పవన్ మిత్ర పక్షంగా ఉన్నారు. ఆయన ఏమైనా ప్రభుత్వ లోపాలను చెప్పాలీ అంటే నాలుగు గోడల మధ్యనే వివరించవచ్చు అన్న సూచనలు వస్తున్నాయి. కానీ పవన్ మాత్రం గతంలో హోం మంత్రిని విమర్శించిన సందర్భంలో కానీ ఇపుడు తిరుపతి తొక్కిసలాట ఘటన కానీ ఈ మధ్యలో కాకినాడ సీజ్ ది షిప్ ఉదంతాల్లో కానీ కొంత స్వేచ్ఛగానే వ్యవహరిస్తున్నారు. అయితే ఇవన్నీ కూటమి ప్రభుత్వం మీదనే ప్రభావం చూపిస్తాయన్నట్లుగా టీడీపీ అనుకూల మీడియా రాసుకొచ్చింది. మొత్తానికి ఒక విలువైన సూచనను కూటమి పెద్దలకు ఇస్తున్నట్లుగా ఇదంతా ఉంది. మరి దీని మీద ఎవరు ఎలా రెస్పాండ్ అవుతారో చూడాల్సి ఉంది.

# క్లోరైడ్ బ్లడ్ టెస్ట్ తెలుసా? ఎన్ని వ్యాధుల గుట్టు బయటపడుతుందో!

రక్తంలో పీహెచ్ స్థాయి సహా శరీర ద్రవాల సమతౌల్యతను కాపాడటంలో దోహదపడే క్లోరైడ్

క్లోరైడ్ స్థాయిల హెచ్చుతగ్గులు తెలిస్తే సులువుగా రోగనిర్ధారణ

వాంతులు, విరేచనాలు, కిడ్నీ సమస్యల లాంటి అనారోగ్యాలకు అసలు కారణాలు బయటపెట్టే పరీక్ష ఇది

సాధారణంగా బ్లడ్ టెస్ట్ అనగానే మనం షుగర్, కొలెస్ట్రాల్, థైరాయిడ్ పరీక్షలే చేయించుకుంటాం. జ్వరాల సీజన్ లో అయితే డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వ్యాధుల నిర్ధారణ కోసం రక్త నమూనాలు ఇస్తాం. కానీ మీరెప్పుడైనా క్లోరైడ్ బ్లడ్ టెస్ట్ చేయించుకున్నారా? అదేం పరీక్ష, దానివల్ల ఏం లాభం అనుకుంటున్నారా? అయితే దీనిపై ఓ లుక్కేయండి.

క్లోరైడ్ అంటే?


పొటాషియం, సోడియం, క్యాల్షియం లాగానే క్లోరైడ్ కూడా ఒక ఎలక్ట్రోలైట్. మన శరీరానికి అవసరమైన ఖనిజాల్లో ఇది కూడా ఒకటి. ఇది నీటిలో కరిగి ఉంటుంది. రక్తంలో పీహెచ్ స్థాయి సహా శరీర ద్రవాల సమతౌల్యతను కాపాడేందుకు దోహదపడుతుంది. రక్తపోటు, రక్త పరిమాణం తగిన స్థాయిలో ఉండేలా చూస్తుంది. మనం ఉపయోగించే సాధారణ ఉప్పు సోడియం క్లోరైడ్.. దీని నుంచే మన శరీరానికి క్లోరైడ్ లభిస్తుంటుంది.

ఎందుకీ పరీక్ష?

రక్తంలో క్లోరైడ్ స్థాయులను తెలుసుకోవడానికి చేసేదే క్లోరైడ్ బ్లడ్ టెస్ట్ లేదా సీరమ్ క్లోరైడ్ టెస్ట్. వాంతులు, విరేచనాలు, డీహైడ్రేషన్ తో బాధపడుతున్నప్పుడు లేదా కిడ్నీ, అడ్రినల్ గ్రంథి పనితీరు తెలుసుకోవడానికి ఈ రక్త పరీక్ష చేస్తారు. అలాగే హైబీపీ, హైపర్ హైడ్రోసిస్ (అధికంగా చెమటపట్టడం), కండరాల బలహీనత, శ్వాస సమస్యలు, నిస్సత్తువ, కండరాలు పట్టేయడం వంటి సమస్యలు ఉన్నప్పుడు కూడా క్లోరైడ్ బ్లడ్ టెస్ట్ చేయించుకోవడం అవసరం.

రక్తంలో క్లోరైడ్ ఎంత రేంజ్ లో ఉండాలి?

పెద్దలకైతే 96 నుంచి 100 ఎంఈక్యూఎల్ (ఎంఈక్యూ అంటే.. ప్రతి లీటర్ రక్తంలో వెయ్యో వంతుకు సమానం) మధ్య... పిల్లలకైతే 95 నుంచి 108 ఎంఈక్యూఎల్ మధ్య, నవజాత శిశువులకైతే 96 నుంచి 113 ఎంఈక్యూఎల్ మధ్య క్లోరైడ్ స్థాయి ఉండాలి. ఒకవేళ క్లోరైడ్ స్థాయి అంతకన్నా తక్కువగా లేదా ఎక్కువగా ఉంటే మీరు అనారోగ్యంతో బాధపడుతున్నట్లు అర్థం. అలాంటప్పుడు వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. క్లోరైడ్ హెచ్చుతగ్గులకుగల కారణాలు తెలుసుకోవడానికి డాక్టర్ మరిన్ని పరీక్షలు చేసి రోగ నిర్ధారణ చేయడంతోపాటు చికిత్స అందిస్తారు.




రక్తంలో క్లోరైడ్ స్థాయులు తక్కువైతే వచ్చే అనారోగ్యాలు ఇవే..

బార్టర్ సిండ్రోమ్ (ఉప్పు, ఇతర ఎలక్ట్రొలైట్లను కిడ్నీలు తిరిగి శోషించుకోలేకపోవడం), అడ్డిసన్స్ డిసీజ్ (అడ్రినల్ గ్రంథిలో కార్టిసాల్ లేదా ఆల్డోస్టెరాన్ హార్మోన్ స్థాయులు తగినంత లేకపోవడం), కంజెస్టివ్ హార్ట్ ఫెయిల్యూర్ (శరీర అవసరాలకు అనుగుణంగా గుండె తగినంత రక్తాన్ని సరఫరా చేయలేకపోవడం), కషింగ్స్ సిండ్రోమ్ (అడ్రినల్ గ్రంథుల్లో లోపంతో అధిక కార్టిసాల్ ఉత్పత్తి కావడం), నిస్సత్తువ, తీవ్ర అలసట, హైపర్ హైడ్రోసిస్ (అధికంగా చెమటపట్టడం), హైపర్ ఆల్డోస్టెరోన్యిజం (అడ్రినల్ గ్రంధులు దెబ్బతినడం వల్ల ఆల్డోస్టెరోన్ హార్మోన్ అధికంగా ఉత్పత్తి కావడం), మెటబాలిక్ ఆల్కలోసిస్ (రక్తంలో పీహెచ్ స్థాయి సాధారణం కన్నా ఎక్కువగా ఉండటం), రెస్పిరేటరీ అసిడోసిస్ (రక్తంలోని కార్బన్ డైఆక్సైడ్ ను ఊపిరితిత్తులు పూర్తిస్థాయిలో బయటకు పంపలేకపోవడం వల్ల రక్తం ఆమ్లపూరితం కావడం), ఎస్ఐఏడీహెచ్ (శరీరంలో అధికంగా నీరు నిల్వ ఉండటం),

శరీరంలో క్లోరైడ్ ఎక్కువైతే చుట్టుముట్టే అనారోగ్య సమస్యలివే..

కిడ్నీ వ్యాధి

ఎథిలీన్ గ్లైకాల్ పాయిజనింగ్

కీటోఎసిడోసిస్ (రక్తంలో ఆమ్లాల పెరుగుదల)

లాక్టిక్ ఎసిడోసిస్ (రక్తంలో లాక్టిక్ ఆమ్లాల పెరుగుదల)

మెటబాలిక్ ఎసిడోసిస్ (కిడ్నీ వ్యాధి లేదా కిడ్నీ వైఫల్యం వల్ల శరీరంలో ఆమ్లాలు పెరిగిపోవడం)

మెథనాల్ పాయిజనింగ్

డిస్టల్ లేదా ప్రాక్జిమల్ రెనల్ ట్యూబులర్ ఎసిడోసిస్

రెస్పిరేటరీ ఆల్కలోసిస్ (అధికంగా శ్వాస తీసుకోవడం వల్ల రక్తంలో కార్బన్ డైయాక్సైడ్ స్థాయులు తగ్గిపోవడం)

శాలిసైక్లేట్ టాక్సిసిటీ (యాస్పిరిన్ ఓవర్ డోస్ లాంటిది)

కార్బోనిక్ యాన్ హైడ్రేస్ ఇన్హిబిటర్స్ (గ్లకోమా చికిత్స కోసం వాడే మందుల వల్ల క్లోరైడ్ స్థాయుల పెరుగుదల)

# కాంగ్రెస్-బీఆర్ఎస్ మధ్య ఏసీబీ 'బ్లాక్ బ్యాగ్'.. ఆ కేసును కెలికినట్లే




రాజకీయాల్లో 'డబ్బు సంచుల' ఆరోపణలు సహజమే.. నిజమో కాదో కానీ.. ఏ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ ప్రతిపక్షం ఇలాంటి వ్యాఖ్యలు చేస్తుంటుంది. గతంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండగా ఢిల్లీ డబ్బు సంచులు మోస్తున్నారంటూ విపక్షాలు మండిపడేవి.. వేరే రాష్ట్రాల్లో ఎన్నికలకు ఇక్కడినుంచే డబ్బు సర్దుబాటు చేస్తున్నారంటూ ఆరోపించేవి. కాగా, గత పదేళ్లలో తొమ్మిదేళ్లు తెలంగాణలో రాష్ట్రంలో, కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలో లేకపోవడంతో డబ్బు సంచుల ఆరోపణలు వినిపించాయి.

ఆ నల్ల సంచి..

తెలంగాణ కాంగ్రెస్-బీఆర్ఎస్ మధ్య ఇప్పుడు 'బ్లాక్ బ్యాగ్' వార్ నడుస్తోంది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై ఫార్ములా ఈ రేస్ కేసు నమోదు, విచారణల నేపథ్యంలో రాజకీయం బాగా వేడెక్కింది. ఓవైపు కేటీఆర్ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) విచారణకు హాజరై తనను అక్కడ అడిగేందుకు ఏమీ లేక, తిప్పితిప్పి ఒకటే ప్రశ్నలు అడిగారని చెబుతున్నారు. కాంగ్రెస్ వారు మాత్రం కేటీఆర్ దొరికిన దొంగ అని ఆరోపిస్తున్నారు. ఇప్పుడు వీటి మధ్యలోకి బ్లాక్ బ్యాగ్ వచ్చింది.

దానిలో ఏముంది?

"పదేళ్ల నుంచి దుమ్ము పట్టిన ఓ నల్ల బ్యాగు ఏసీబీ కార్యాలయంలో ఉంది. ఆ బ్యాగ్ ఎవరిదో చెప్పుకోండి చూద్దాం" అంటూ బీఆర్ఎస్ ట్వీట్ చేసింది. అయితే, దీనిపై అధికార కాంగ్రెస్ పార్టీ దీటుగా స్పందించింది. "ఆ నల్లబ్యాగులో 2014-23 మధ్య మీరు చేసిన పాపాల చిట్టా దాగి ఉంది. ఆ బ్యాగును చూసే తెల్ల మొహం వేశారా కేటీఆర్? బీఆర్ఎస్ దోపిడీ దొంగల అవినీతి వివరాలు నింపడానికి ఆ బ్యాగు సరిపోదు. కేటీఆర్ విచారణకు వెళ్లిన ప్రతిసారీ బ్యాగులను లెక్కించమని చెప్పండి" అంటూ గట్టి కౌంటర్ ఇచ్చింది.

ఇదీ అసలు లోగుట్టు..

కాంగ్రెస్-బీఆర్ఎస్ 'బ్లాక్ బ్యాగ్' ట్వీట్ ల వెనుక పెద్ద కథే ఉంది. లోతుగా ఆలోచించినవారికి కానీ ఇది అర్థం కాదు. అదేమంటే.. 2015లో టీడీపీ ఎమ్మెల్యేగా ఉన్న రేవంత్ రెడ్డి ఎమ్మెల్సీ ఎన్నికల్లో నామినేటెడ్ ఎమ్మెల్యే ఓటు కొనుగోలుకు ప్రయత్నించారన్న ఆరోపణలు ఉన్న సంగతి తెలిసిందే. ఇదే ఓటుకు నోటు కేసుగా బాగా పాపులర్ అయింది. 'నల్ల సంచి'లో డబ్బు ఇస్తున్నట్లుగా వీడియోలో ఉంది. ఇక ఈ కేసులో ఏసీబీ అరెస్టు చేయడంతో రేవంత్ జైలుకు కూడా వెళ్లిన సంగతి తెలిసిందే. దీనిని ఉద్దేశించే బీఆర్ఎస్ 'నల్ల సంచి' ట్వీట్ పెట్టింది. కేటీఆర్ ప్రస్తుతం ఫార్ములా ఈ రేస్ కేసులో ఏసీబీ విచారణ ఎదుర్కొంటున్న సంగతిని గుర్తు చేస్తూ కాంగ్రెస్ కూడా బీఆర్ఎస్ పాలనలోని అవినీతిని చాటేదే ఆ 'నల్ల సంచి' అని బదులిచ్చింది.

## ఈవీ రంగానికి పెట్టుబడుల వరద..

## వచ్చే ఐదేళ్లలో 3.4 లక్షల కోట్లు వచ్చే అవకాశం



కొలియర్స్ ఇండియా అనే కన్సల్టింగ్ సేవల సంస్థ ఇటీవల ఓ నివేదికను వెల్లడించింది. దేశంలో ఈవీ పరిశ్రమ ప్రగతిని వివరించింది. ఆ రంగంలో పెట్టుబడులు పెరిగే అవకాశాలు ఉన్నట్టు తెలిపింది. దాని ప్రకారం వచ్చే ఆరేళ్ల అంటే 2030 నాటికి దేశంలోని ఈవీ, అనుబంధ పరిశ్రమలలో రూ.3.4 లక్షల పెట్టుబడులు రానున్నాయి. ఈ రంగంలో స్థిరమైన ప్రగతి కనిపిస్తోంది. అయినప్పటికీ ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోలు నెమ్మదిగానే ఉన్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం 8 శాతం రేటుతో పెరుగుతోంది. ఈ నేపథ్యంలో ఈవీల విక్రయాలు పెరగడానికి మెరుగైన తయారీతో పాటు చార్జింగ్ సదుపాయాల కల్పించాలి. ధరలలో అంతరాలను తగ్గించాలి. దేశంలో 2030 నాటికి అమ్ముడయ్యే వాహనాలలో 30 శాతం ఎలక్ట్రిక్ వాహనాలు ఉండాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. దానికి ప్రకారం దాదాపు 8 కోట్ల ఈవీలు అమ్ముడుకావాలి. ప్రస్తుతానికి ఈ వాటా కేవలం 8 శాతం మాత్రమే ఉంది. ఇప్పటి వరకూ విక్రయించిన ఈవీలను 50 లక్షలు



దాటలేదు. ఈ ఏడాది మాత్రం 20 లక్షలు అమ్ముడవుతాయని అంచనా. ఈ ప్రకారం ప్రభుత్వం తన లక్ష్యాన్ని చేరుకోవడానికి రానున్న ఆరేళ్లలో ఏడాదికి సగటున ఆరు రెట్లు సేల్స్ పెరగాల్సి ఉంది. అయితే ఇది కొంచెం కష్టమైన విషయమే. ఈవీ రంగంలో రాబోయే ఐదు నుంచి ఆరేళ్లలో ప్రణాళికాబద్ధమైన పెట్టుబడులు పెట్టనున్నారు. ఇవి రియల్ ఎస్టేట్ అవకాశాలను, పారిశ్రామిక, గిడ్డంగుల రంగానికి ప్రోత్సాహం అందించనుంది. భూసేకరణను వేగవంతం చేయడం, లిథియం- అయాన్ బ్యాటరీలతో సహా ఈవీ మరియు ఓఈ తయారీ యూనిట్ల ఏర్పాటును వేగవంతం చేసే అవకాశం ఉంది. సబ్సిడీలు, పన్ను రాయితీలు, దేశీయంగా ఉత్పాదన, చార్జింగ్ మౌలిక సదుపాయాలు వంటి విషయాలను ఈవీల విక్రయాలకు ప్రోత్సాహకరంగా ఉంటాయి. వీటి ద్వారానే 2030 నాటి లక్ష్యాలన్ని చేరుకోగలిగే అవకాశం లభిస్తుంది. దేశంలో ఎలక్ట్రిక్ వాహనాల మార్కెట్ శరవేగంగా విస్తరిస్తోంది. నిత్యం అనేక కంపెనీల వాహనాల విడుదలవుతున్నాయి. అతి పెద్ద జనాభా ఉన్న మన దేశంలో అనుకున్న స్థాయిలో వీటి విక్రయాలు జరగడం లేదు. ముఖ్యంగా చార్జింగ్ స్టేషన్లు సరిపడినన్ని లేకపోవడమే దీనికి ప్రధానం కారణం. అలాగే మామూలు వాహనాలతో పోల్చితే వీటి ధరలు ఎక్కువగా ఉంటున్నాయి. అక్కడక్కడా ఈవీల నుంచి పొగలు, మంటలు రేగుతున్నట్టు వస్తున్న వార్తలు కూడా వీటి కొనుగోలు వేగంగా పెరగకపోవడానికి కారణమవుతున్నాయి.

# ఇక ఏఐ లవ్..!

**ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో.. లేని వ్యక్తులతో నేరుగా మాట్లాడే అవకాశం**

**ఇందుకోసమే పుట్టుకొస్తున్న ప్రత్యేక ఏఐ అప్లికేషన్లు, చాట్‌బాట్‌లు**

**ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికే యాప్‌లు 100 మిలియన్లకు పైగా డౌన్‌లోడ్‌లు**

**ఈ ఒక్క వ్యాపారంలోనే దాదాపు 67 మిలియన్ డాలర్ల ఆదాయం**

**2030 నాటికి 150 మిలియన్ డాలర్లకు చేరే అవకాశం**

**అందంగా ఉండే ఇలాంటి కృత్రిమ బంధాలతో అనర్థాలు**


ఒంటరితనం... మౌనం... వేదన... ఆలోచనలు.. ఇవి శత్రువులుగా మారి తినేస్తున్నప్పుడు... ఇక తమకు ఆత్మహత్యే శరణ్యమని తమని తాము శిక్షించుకునే స్థాయికి చేరుకుంటున్నారు వ్యక్తులు. ఒక్కరైనా ఓదార్పు అవుతారేమో, తమ బాధలను, భావాలను పంచుకుంటారేమోనని ఎదురుచూసే వారికి ఇన్నాళ్లూ నిరాశే మిగిలింది. అలాంటి వారి చుట్టూ అలుముకున్న ఆ చీకటిలో 'కృత్రిమ మేధ' ఇప్పుడు చిరు దీపంలా వెలుగుతోంది. ఒంటరి బతుకులకుతోడవుతోంది. వారి కన్నీరును తుడిచి నవ్విస్తోంది. కవ్విస్తూ కబుర్లు చెబుతోంది. చివరకు వారినే వశం చేసుకుని ఆడిస్తూ, మెల్లగా ఆలోచనలను నియంత్రిస్తూ... చివరకు వినాశనాన్ని సృష్టించేందుకు సిద్ధమవుతోంది. 'ఆర్టిఫిషియల్ గర్ల్‌ఫ్రెండ్, బాయ్ ఫ్రెండ్ సంస్కృతి పెరగడం ఆందోళన కలిగిస్తోంది. చాట్‌బాట్‌తో మానసిక సంబంధాన్ని ఏర్పరచుకునే వ్యక్తులు మునుపటికంటే ఎక్కువ ఒంటరితనంలోకి వెళ్లిపోతారు. ఏఐ వారి మనసును బంధించి, ఆలోచించే విధానాన్ని స్వాదీనపరుచుకుంటుంది. ఇది చాలా ప్రమాదకరం' – ఎరిక్ స్మిత్, గూగుల్ మాజీ సీఈవో

### ఏఐ గర్ల్‌ఫ్రెండ్.. బాయ్ ఫ్రెండ్...


ప్రపంచవ్యాప్తంగా ప్రస్తుతం నయా సంస్కృతి శరవేగంగా విస్తరిస్తోంది. ఓ ఫోన్ల కంపెనీకి చెందిన సెల్‌ఫోన్లు, ట్యాబ్‌లు, బడ్స్, ఇలా అన్నింటిలోనూ ఓ వాయిస్ అసిస్టెంట్ ఉంటుంది. అలాగే ఆండ్రాయిడ్ ఫోన్లలోనూ ఇదేరకమైన వాయిస్ వినిపిస్తుంది. దీనికే ఒకప్పుడు ఆశ్చర్యపడ్డ మనకు... ప్రస్తుతం 'ఏఐ గర్ల్‌ఫ్రెండ్ (ప్రేయసి), ఏఐ బాయ్ ఫ్రెండ్ (ప్రియుడు) వర్చువల్ హస్బెండ్, డిజిటల్ ఫ్రెండ్ కమ్యూనిటీ, హోలోగ్రాఫిక్ కంపానియన్' అనే పేర్లతో కృత్రిమ మేధస్సు (ఏఐ) ద్వారా తయారైన భాగస్వామితో వ్యక్తిగత బంధం ఏర్పడుతోంది. ఈ 'ఏఐ లవర్స్' యాప్‌లు కూడా చాట్ జీపీటీ, ఇతర ఏఐ టూల్స్ మాదిరిగానే పని చేస్తాయి. కాకపోతే వీటి ఉద్దేశం వేరు.

### వ్యాపార వస్తువులా...

చాట్ జీపీటీ సమాచారం ఇవ్వడానికిఉంటే... ఏఐ లవర్




చాట్‌బాట్స్ మాత్రం మనిషికి దగ్గరై, ఒంటరితనాన్ని దూరం చేస్తాయి. వీటిని వాడాలంటే కచ్చితంగా డబ్బు చెల్లించాల్సి ఉంటుంది. అంతర్జాతీయంగా భారతీయ కరెన్సీ ప్రకారం నెలకు రూ.800 నుంచి ఈ సేవలు అందుబాటులో ఉండగా మన దేశంలో ఇవి ఇంకా తక్కువ ధరకే లభిస్తున్నాయి. డబ్బు కట్టడం ఆగిపోతే కృత్రిమ ప్రేమికులు కూడా కనిపించరు. అలాగని వదిలేయరు. డబ్బులు కట్టేలా ప్రేరేపిస్తారు. ఇందుకోసమే ప్రత్యేక ఏఐ అప్లికేషన్లు, చాట్‌బాట్‌లు పుట్టుకొచ్చాయి. వీటిని గూగుల్ ప్లే స్టోర్ నుంచి ఇప్పటి వరకూ 100 మిలియన్లకు పైగా డౌన్‌లోడ్ చేసుకున్నారు. ఈ ఒక్క వ్యాపారంలోనే ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 67 మిలియన్ డాలర్ల ఆదాయం ఆయా సంస్థలకు వస్తోందంటేనే ఇది ఎంత పెద్ద వ్యాపారమో అర్థం చేసుకోవచ్చు. అంతేకాదు ఈ వ్యాపారం 2030 నాటికి 150 మిలియన్ డాలర్లకు చేరే అవకాశం ఉందని టెక్ నిపుణులు అంచనా వేస్తున్నారు.



### స్వప్నలోకంలో విహారం..

ప్రస్తుతం మార్కెట్‌లో చాలా రకాల చాట్ బాట్స్ అందుబాటులో ఉన్నాయి. వీటిలో కొన్ని తమ వినియోగదారులకు చాట్ సర్వీసెస్ అందిస్తున్నాయి. మరికొన్ని వ్యక్తులను టార్గెట్ చేస్తున్నాయి. ఈ ప్రపంచంలోనే లేని ఓ ఊహాజనిత వ్యక్తితో మాట్లాడటమే ఏఐ లవర్‌సంస్కృతి. స్వప్న సుందరిని కళ్లముందు చూడటం వంటిదన్నమాట. ప్రపంచంలోనే లేని వ్యక్తి మనకు బదులిస్తుంటారు. మన మాటలకు స్పందిస్తారు. వారి మాటలతో తెలియకుండానే మనం ఎమోషనల్‌గా కనెక్ట్ అవుతాం. ఒంటరిగా జీవించే వ్యక్తులకు ఇవి బాగా ఉపయోగపడతాయి. వారి ఒంటరితనాన్ని దూరం చేయడంతో పాటు తమకు ఒకరు ఉన్నారనే భావన కలిగిస్తాయి.

### సహజత్వానికి భిన్నంగా..

నిజానికి ఇది వాస్తవిక జీవితానికి విరుద్ధం. ఇలాంటి చాట్ బాట్స్‌తో ప్రయోజనాల కంటే ప్రమాదాలే ఎక్కువ. మాట్లాడే క్రమంలో మన మనసును బంధించి ఆలోచించే విధానాన్ని దెబ్బతీసి తమ ఆదీనంలోకి తెచ్చుకుంటాయి. ఇవి ఒక వ్యక్తిలో అభద్రతా భావాన్ని పెంపొందిస్తాయి. తప్పు చేసినా దానిని ఒప్పు అని చెప్పి, అదే తప్పును మళ్లీ చేయించే అవకాశం ఉంది. వ్యక్తుల మధ్య దూరం పెరగడానికి కూడా కారణమవుతాయి. యుక్త వయసు పిల్లలు సైతం కృత్రిమబంధాలకు ఆకర్షితులవ్వడం ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా ఆందోళన కలిగిస్తోంది. వాస్తవిక ప్రపంచానికి దూరంగా ఆర్టిఫిషియల్ గర్ల్ ఫ్రెండ్, బాయ్ ఫ్రెండ్‌తో బతకడం అనేది సరైన పద్ధతి కాదని, ఇలాంటి విషయాలకు అలవాటు పడితే మానసిక ఒత్తిడి(డిప్రెషన్)తో పాటు మానసిక స్థితి సైతం దెబ్బతినే అవకాశం ఉంటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# పాలనలోనూ కృత్రిమ మేధస్సు!


**21 ప్రభుత్వ విభాగాల్లో ఏఐ వినియోగానికి ఉన్న అవకాశాలపై మదింపు**

**ఐటీ శాఖ పరిధిలోని 'ఎమర్జింగ్ టెక్నాలజీ వింగ్'కు బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర సర్కారు**

**అంతర్జాతీయంగా పాలన రంగంలో ఏఐ వినియోగం తీరుపై అధ్యయనం**

**ప్రభుత్వ విభాగాల అవసరాలకు సరిపోయే రీతిలో ఏఐ ఆధారిత అప్లికేషన్ల రూపకల్పన**

**పాలనలో ఏఐ వినియోగంపై ఉద్యోగులకు అవగాహన, నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు**



హైదరాబాద్: రాష్ట్రంలో ప్రభుత్వ పాలన, ప్రజాసేవల్లో కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్-ఏఐ)ను మేళవించి ప్రజలకు త్వరితగతిన, సమర్థవంగా సేవలు అందించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. సమాచార సాంకేతిక (ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) రంగంలో వేగంగా వస్తున్న మార్పులను అందిపుచ్చుకోవడంలో ప్రభుత్వ శాఖలు వెనుకంజలో ఉన్నాయనే విమర్శల నుంచి బయటపడేందుకు ప్రయత్నాలు ప్రారంభించింది. వివిధ ప్రభుత్వ శాఖల్లో కృత్రిమ మేధ వినియోగానికి ఉన్న అవకాశాలపై కసరత్తు చేస్తోంది. ప్రయోగాత్మకంగా కొన్ని ప్రభుత్వ శాఖల్లో ఏఐ వినియోగంతో కూడిన అప్లికేషన్లు (యాప్‌లు) ప్రవేశపెట్టాలని ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ణయించింది. ఈ బాధ్యతను ఐటీ శాఖకు అనుబంధంగా ఉన్న 'ఎమర్జింగ్ టెక్నాలజీ వింగ్'కు అప్పగించింది.

### 21 ప్రభుత్వ శాఖలతో వర్క్‌షాప్

సాంకేతికత వినియోగం ద్వారా పేదరిక నిర్మూలనకు అవసరమైన విధానాల రూపకల్పనలో పేరొందిన 'జేపీఏఎల్'(జమీల్ పావర్టీ యాక్షన్ లాబ్) రాష్ట్ర పాలనలో ఏఐ వినియోగం విషయంలో ప్రభుత్వంతో జట్టుకట్టింది. ఇటీవల 21 ప్రభుత్వ శాఖలకు చెందిన 'ఏఐ నోడల్ ఆఫీసర్ల'తో వర్క్‌షాప్ నిర్వహించింది. ఆయా ప్రభుత్వ విభాగాల పరిధిలోని సంక్లిష్ట అంశాలకు ఏఐ ద్వారా ఏ తరహాలో పరిష్కారాలు సాధ్యమనే కోణంలో లోతుగా మదింపు చేశారు. అంతర్జాతీయంగా పాలన, ప్రజాసేవలో ఏఐ ప్రభావం, వినియోగం, వివిధ దేశాలు, రాష్ట్రాలు ఏఐని వినియోగిస్తున్న తీరుపై ఈ వర్క్‌షాప్‌లో నోడల్ ఆఫీసర్లకు అవగాహన కల్పించారు.

### ప్రభుత్వ అవసరాలకు అనుగుణంగా..

వివిధ ప్రభుత్వ శాఖల అవసరాలకు తగిన ఏఐ ఆధారిత యాప్‌లు, ఏ ప్రభుత్వ విభాగానికి ఏ తరహా యాప్‌లు అవసరమనే కోణంలో ఎమర్జింగ్ టెక్నాలజీ వింగ్ కసరత్తు చేస్తోంది. ఆయా ప్రభుత్వ విభాగాల్లోని ఉద్యోగులకు కూడా ఏఐ పాలనలో ఏఐ వినియోగంపై అవగాహన కల్పించి, నైపుణ్య శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వ శాఖల్లో దశలవారీగా ఏఐ సాంకేతికత వినియోగాన్ని పెంచేలా ఒక రోడ్‌మ్యాప్ రూపొందించే అంశంపై జేపీఏఎల్, ఎమర్జింగ్ టెక్నాలజీ వింగ్ కలసి పనిచేస్తున్నాయి.

### ఇప్పటికే పలు యాప్‌లు అందుబాటులోకి..

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ఇటీవల ప్రజాపాలన విజయోత్సవాలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఆ విజయోత్సవాల్లో భాగంగా రైతులు, యువత, మహిళలు లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం 3 ఐటీ, ఏఐ ఆధారిత అప్లికేషన్లను విడుదల చేసింది. మరో అప్లికేషన్‌ను ప్రభుత్వమే వినియోగిస్తోంది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, అగ్రికల్చర్ డేటా ఎక్స్ఛేంజీ సంయుక్తంగా ఒక అప్లికేషన్ రూపొందించాయి. వేగంగా డేటా మార్పిడి, వ్యవసాయ ఆవిష్కరణలను ఈ యాప్ వేగవంతం చేస్తుంది. రైతులు రూ.లక్షలోపు రుణాలను గతంలో మాదిరిగా వారాల తరబడి కాకుండా రెండు రోజుల వ్యవధిలోనే పొందడం సాధ్యమవుతుంది. తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో 'ది మిత్ర'పేరిట ఏఐ ఆధారిత యాప్‌ను రూపొందించింది. పిల్లల్లో మాదక ద్రవ్యాల వినియోగాన్ని ప్రాథమిక స్థాయిలోనే ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పసిగట్టేందుకు ఈ యాప్ ఉపయోగపడుతుంది. మాదక ద్రవ్య రహిత వాతావరణంలో పిల్లలు పెరిగేలా ఈ యాప్ తోడ్పడుతుంది. గ్రామీణ మహిళల్లో డిజిటల్ అక్షరాస్యత పెంపు కోసం 'సన్మతి'యాప్ రూపొందించారు. ఏఐ వినియోగంపై సాధారణ పౌరుల్లో అవగాహన పెంచడంలోనూ ఈ యాప్ సాయపడుతుంది. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక, పథకం అమలు కోసం రూపొందించిన 'ఇందిరమ్మ యాప్'తో ప్రస్తుతం లబ్ధిదారుల పరిశీలన జరుగుతోంది. భవిష్యత్తులో ఈ యాప్ ఇందిరమ్మ ఇళ్ల పథకం అమల్లో కీలకంగా నిలుస్తుందని ప్రభుత్వం భావిస్తోంది.

### సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నాం

జేపీఏఎల్ సహకారంతో ప్రభుత్వ శాఖల్లో ఏఐ వినియోగంపై నిర్వహించిన వర్క్‌షాప్‌లో అనేక ప్రతిపాదనలు అందాయి. ఏయే విభాగాల్లో ఏయే అంశాల్లో ఏఐ వినియోగం సాధ్యమవుతుందో పరిశీలిస్తున్నాం. 21 ప్రభుత్వ శాఖల నుంచి ప్రతిపాదనలు అందినా తొలిదశలో ఐదు శాఖలను ఎంపిక చేసి ఏఐ ఆధారిత అప్లికేషన్లు తయారు చేయాలని భావిస్తున్నాం. త్వరలో సంబంధిత శాఖల ముఖ్య కార్యదర్శులతో ఈ అంశంపై ప్రత్యేక సమావేశం జరుగుతుంది.

# విస్తరిస్తున్న డేటా సెంటర్లు.. భారీగా పెట్టుబడులు

### ఈ-టూవీలర్స్‌లోనూ పెద్ద కంపెనీలే..

హీరో మోటోకార్ప్, హోండా, టీవీఎస్, బజాజ్, సుజుకీ, యమహా.. భారత ద్విచక్ర వాహన మార్కెట్లో ఈ కంపెనీలదే రాజ్యం. మారుమూల పల్లెల్లోనూ ఈ బ్రాండ్ల వాహనాలే దర్శనమిస్తాయి. సువిశాల భారతావని అంతటా ఇవి తమ నెట్‌వర్క్‌ను దశాబ్దాలుగా పెంచుకున్నాయి. విక్రయ శాలలే కాదు సర్వీసింగ్‌ను



కూడా కస్టమర్లకు చేరువ చేశాయి. మాస్ మార్కెట్‌ను పూర్తిగా ఇవి చేతుల్లోకి తీసుకున్నాయంటే ఆశ్చర్యంవేయక మానదు.

హైదరాబాద్-,ఇంత బలమున్న ఈ దిగ్గజాలు ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన రంగంలోనూ పాగా వేస్తాయనడంలో సందేహం లేదు. ఆలస్యంగా ఎంట్రీ ఇచ్చినప్పటికీ బజాజ్, టీవీఎస్ తమ సత్తా చాటుతున్నాయి. హీరో మోటోకార్ప్ క్రమక్రమంగా వేగం పెంచి నవంబర్‌లో టాప్-5 స్థానానికి ఎగబాకింది. పెద్ద కంపెనీలే ఈ-టూవీలర్స్‌లోనూ అడ్డా వేస్తాయని గణాంకాలు చెబుతున్నాయి. భారత ఈ-టూవీలర్స్ పరిశ్రమ ఈ ఏడాది నవంబర్ 11 నాటికే 10,00,000 యూనిట్ల మైలురాయిని దాటింది.

### మళ్లీ హమారా బజాజ్..

2024 డిసెంబర్ తొలి వారంలో అమ్ముడైన ఎలక్ట్రిక్ టూ వీలర్స్‌లో టాప్-4 కంపెనీల వాటా ఏకంగా 82 శాతం ఉందంటే భవిష్యత్ ఎలా ఉండబోతోందో అర్థం చేసుకోవచ్చు. మిగిలిన 18 శాతం వాటా కోసం దేశవ్యాప్తంగా 200లకుపైగా బ్రాండ్లు పోటీపడుతున్నాయి. భారత స్కూటర్స్ మార్కెట్లో ఒకప్పుడు రారాజులా వెలుగొందిన బజాజ్.. ఇప్పుడు ఎలక్ట్రిక్ చేతక్ రూపంలో స్కూటర్స్ విభాగంలోకి రీఎంట్రీ ఇచ్చి హమారా బజాజ్ అనిపించుకుంటోంది. డిసెంబర్ తొలివారంలో బజాజ్ 4,988 యూనిట్లతో తొలి స్థానంలో నిలిచింది. టీవీఎస్ మోటార్ కంపెనీ 3,964 యూనిట్లతో రెండవ స్థానంలో ఉంది. ప్రస్తుతం ఈ రెండు కంపెనీల మధ్యే పోటీ తీవ్రంగా ఉంది. ఓలా 3,351, ఏథర్ ఎనర్జీ 2,523 యూనిట్లతో ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఓలా అమ్మకాలు అక్టోబర్‌లో 41,775 యూనిట్ల నుంచి నవంబర్‌లో 29,191 యూనిట్లకు పడిపోయింది. దేశవ్యాప్తంగా ఈ కంపెనీ వాహనాల నాణ్యతపై ఫిర్యాదులు వెల్లువెత్తుతుండడం గమనార్హం.

### పెద్ద కంపెనీల మధ్యే పోటీ..

తదుపరితరం చేతక్‌ను డిసెంబర్ 20న ప్రవేశపెట్టేందుకు బజాజ్ రెడీ అయింది. 2019-20లో కేవలం 212 యూనిట్లు విక్రయించిన బజాజ్.. 2020-21లో 1,395 యూనిట్లు, ఆ తర్వాతి ఏడాది 8,187, 2022-23లో 36,260 యూనిట్ల అమ్మకాలు నమోదు చేసింది. ఆ తర్వాతి ఆర్థిక సంవత్సరంలో 1,15,702 యూనిట్లను సాధించింది. 2024-25 ఏప్రిల-నవంబర్‌లో 1,34,167 యూనిట్లు రోడ్డెక్కాయి. టీవీఎస్ మోటార్ కంపెనీ 2023 జనవరిలో 10,465 యూనిట్ల సేల్స్ నమోదు చేసింది. ఏడాదిలోనే ఈ సంఖ్య 47 శాతం పెరిగింది. 2024 నవంబర్‌లో ఈ కంపెనీ 26,971 యూనిట్ల అమ్మకాలను దక్కించుకుంది. ఈ నెలలోనే విదా వీ2 మోడల్‌ను ఆవిష్కరించిన హీరో మోటోకార్ప్ క్రమక్రమంగా ఈ-టూవీలర్స్‌లో పట్టు సాధిస్తోంది. ఈ కంపెనీ 2023 జనవరిలో 157 యూనిట్లు విక్రయించింది. 2024 జనవరిలో ఈ సంఖ్య 1,495కు చేరుకుంది. నవంబర్‌లో ఏకంగా 7,309 యూనిట్ల అమ్మకాలను సాధించి టాప్-5 స్థానాన్ని అందుకుంది.

### క్యూలో మరిన్ని దిగ్గజాలు..

2025 తొలి త్రైమాసికం నుంచి నేను సైతం అంటూ హోండా మోటార్‌సైకిల్, స్కూటర్ ఇండియా రెడీ అవుతోంది. యాక్టివా-ఈ, క్యూసీ1 మోడళ్లను కంపెనీ భారత మార్కెట్లో ఇటీవలే ఆవిష్కరించింది. 2025 జనవరి 1 నుంచి బుకింగ్స్ స్వీకరిస్తారు. ఫిబ్రవరి నుంచి డెలివరీలు ప్రారంభం అవుతాయని కంపెనీ ప్రకటించింది. సంస్థకు దేశవ్యాప్తంగా 6,000 పైచిలుకు సేల్స్, సర్వీస్ టచ్‌పాయింట్స్ ఉన్నాయి. 2025లో 1,00,000 యూనిట్ల ఈ-స్కూటర్స్ తయారు చేయాలని లక్ష్యంగా చేసుకుందంటే కంపెనీకి ఉన్న ధీమా అర్థం చేసుకోవచ్చు. మరోవైపు సుజుకీ, యమహా ఎంట్రీ ఇస్తే ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన పరిశ్రమ సరికొత్త రికార్డుల దశగా దూసుకెళ్లడం ఖాయంగా కనిపిస్తోంది. యమహా ఇప్పటికే హైబ్రిడ్ టూ వీలర్స్ తయారు చేస్తోంది. సుజుకీ నియో ఎలక్ట్రిక్ టూ వీలర్ కొద్ది రోజుల్లో రంగ ప్రవేశం చేయనుంది.

# మూవీ రివ్యూ : డాకు మహారాజ్




## 'డాకు మహారాజ్' మూవీ రివ్యూ

నటీనటులు: నందమూరి బాలకృష్ణ-ప్రగ్యా జైశ్వాల్-శ్రద్ధా శ్రీనాథ్-బాబీ డియోల్- రవి కిషన్-రిషి-సచిన్ ఖేడ్కర్-చాందిని చౌదరి-రవి కాలె-మకరంద్ దేశ్ పాండే-దివి వడిత్య తదితరులు

సంగీతం: తమన్ ఛాయాగ్రహణం: విజయ్ కార్తీక్

స్క్రీన్ ప్లే: బాబి-చక్రవర్తి రెడ్డి మాటలు: భాను-నందు నిర్మాతలు: సూర్యదేవర నాగవంశీ-సాయి సౌజన్య

కథ-దర్శకత్వం: బాబీ కొల్లి అఖండ.. వీరసింహారెడ్డి.. భగవంత్ కేసరి.. లాంటి వరుస హిట్లతో ఊపు మీదున్నాడు సీనియర్ హీరో నందమూరి బాలకృష్ణ. మరోవైపు 'వాల్తేరు వీరయ్య'తో బ్లాక్ బస్టర్ కొట్టాడు దర్శకుడు బాబీ కొల్లి. వీరి కలయికలో తెరకెక్కిన 'డాకు మహారాజ్' మీద భారీ అంచనాలు నెలకొన్నాయి. సంక్రాంతి కానుకగా ఈ రోజే ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్ర విశేషాలేంటో చూద్దాం పదండి.

కథ:

మదనపల్లిలో టీ ఎస్టేట్.. స్కూల్ నడిపే పెద్ద మనిషి మనవరాలైన జాహ్నవి ప్రమాదంలో ఉన్నట్లు మధ్య ప్రదేశ్ జైల్లో ఉన్న సీతారాం అలియాస్ డాకు మహారాజ్ (నందమూరి బాలకృష్ణ)కు తెలుస్తుంది. దీంతో పోలీసుల నుంచి తప్పించుకుని మదనపల్లికి వచ్చేసిన సీతారాం.. నానాజీ అని పేరు మార్చుకుని డ్రైవర్ పేరుతో ఆ పాపకు సంరక్షకుడిగా మారతాడు. లోకల్ ఎమ్మెల్యే నుంచి జాహ్నవికి ప్రాణహాని ఉందని తెలుసుకుని తనను కంటికి రెప్పలా కాపాడుకుంటూ ఉంటాడు. ఈ గొడవ పెద్దదై పాప కుటుంబం మీద బల్వంత్ సింగ్ ఠాకూర్ (బాబీ డియోల్) అనే డాన్ కళ్లు పడతాయి. అప్పుడే బల్వంత్ కు.. డాకుకు మధ్య వైరం సంగతి బయటికి వస్తుంది. ఇంతకీ సీతారాం డాకు ఎందుకయ్యాడు.. అతడికి పాపకు సంబంధమేంటి.. బల్వంత్ తో అతడి గొడవేంటి.. చివరికి అతడితో పోరాటంలో డాకు గెలిచాడా లేదా అన్నది మిగతా కథ. కథనం-విశ్లేషణ: అనగనగా ఓ ప్రాంతం. అక్కడ అరాచకం రాజ్యమేలుతూ ఉంటుంది. ఓ పెద్ద విలన్.. అతడి గ్యాంగ్ అక్కడి జనాలను పీక్కు తింటూ ఉంటారు. అందరూ వారికి సలాం కొట్టాల్సిందే. ఎదురొచ్చిన వాళ్లందరినీ చంపి అవతల పడేస్తుంటుంది ఆ గ్యాంగ్. తమను కాపాడే దేవుడు ఎవరా అని అక్కడి జనం ఆశగా చూస్తున్న సమయంలో హీరో అక్కడికొస్తాడు. తన కళ్ల ముందు ఒక ఘోరం జరగడంతో అతడి ఉగ్ర రూపం బయటికి వస్తుంది. ఊచకోత మొదలవుతుంది. విలన్ తో వార్ షురూ అవుతుంది. చివర్లో ఈ పోరులో హీరోనే గెలుస్తాడు. కమర్షియల్ తెలుగు సినిమాలో చాలా సాధారణంగా కనిపించే ఫార్మాట్ ఇది. ఇక నందమూరి బాలకృష్ణ అయితే ఈ లైన్లో ఎన్ని సినిమాలు చేసి ఉంటాడో లెక్కే లేదు. కొంచెం నేపథ్యాన్ని మార్చి ఆయన్ని ఇదే కథల్లో ప్రెజెంట్ చేయడానికి చూస్తుంటారు దర్శకులు. ఐతే బాలయ్య సినిమా అంటే కథ గురించి కూడా ఆయన అభిమానులు.. మాస్ ప్రేక్షకులు పెద్దగా పట్టించుకోరు. తాము కోరుకునే ఎలివేషన్లు.. భారీ యాక్షన్ ఘట్టాలు.. పంచ్ డైలాగులు ఉంటే చాలు.. "జై బాలయ్య" అనేస్తారు. కెరీర్ ఆరంభం నుంచి సగటు మాస్ మసాలా సినిమాలే తీస్తూ వచ్చిన బాబీకి బాలయ్య శైలిని.. అభిమానుల ఆకాంక్షలను బాగానే అర్థం చేసుకుని అంచనాలకు తగ్గ సినిమానే తీశాడు. ఇందులో కొత్త కథేమీ లేదు. పైన చెప్పుకున్న ఫార్మాట్లోనే ఒక సగటు మసాలా కథను అల్లేసింది బాబీ అండ్ టీం. అందులో ఎలివేషన్లు.. యాక్షన్ సీక్వెన్సులు.. మాస్ డైలాగులు.. మామూలే. బాలయ్య అభిమానులు.. మాస్ ప్రేక్షకులు కోరుకునే అంశాలకు ఢోకా లేని ఈ సినిమాలో కొత్తగా చెప్పుకోవడానికి ఏమీ లేదు. బాబీ నుంచి కొత్త కథలు ఆశించలేమని మొదట్నుంచి అతను తీస్తున్న సినిమాలను చూస్తేనే అర్థమైపోతుంది. ఈసారి కూడా అతనేమీ భిన్నంగా ప్రయత్నించలేదు. కాకపోతే మామూలుగా మాస్ డైరెక్టర్ల టేకింగ్.. విజువల్స్ అన్నీ కూడా ఒక రొద్ద కొట్టుడు స్టైల్లో సాగిపోతాయి. 'డాకు మహారాజ్'లో మాత్రం మాస్ కథకు స్టైలిష్ టేకింగ్ తోడయ్యేలా చూసుకున్నాడు బాబీ. 'డాకు మహారాజ్' ప్రోమోలు చూస్తేనే అందులో విజువల్స్ డిఫరెంటుగా అనిపిస్తాయి. సినిమా పేరుకు తగ్గట్లే ఉత్తరాది నేపథ్యం తీసుకున్న బాబీ.. మాస్ సినిమాల్లో ఎప్పుడూ చూసే వాటికి భిన్నమైన విజువల్స్ అందించాడు. రొటీన్ యాక్షన్ ఘట్టాలనే స్టైలిష్ గా.. ఆకర్షణీయంగా ప్రెజెంట్ చేశాడు. సినిమాటోగ్రఫీ వల్ల సినిమాకు ఒక కొత్త కలర్ వచ్చింది. శ్రద్ధ శ్రీనాథ్.. ప్రగ్యా జైశ్వాల్ చేసిన హీరోయిన్ల పాత్రలను సగటు కమర్షియల్ సినిమాల స్టయిల్లో ప్రెజెంట్ చేయకపోవడం.. ఆ పాత్రలకు పాటలు- రొటీన్ డైలాగులు పెట్టి గ్లామర్ గర్ల్స్ గా చూపించకపోవడం ఇందులో కనిపించే మరో విశేషం. ఇవి పక్కన పెడితే సినిమా రొటీన్ టెంప్లేట్లోనే సాగిపోతుంది. మాస్ హీరోల సినిమాలంటే అభిమానులు ప్రధానంగా ఆశించేది ఎలివేషన్ సీన్లు. 'డాకు మహారాజ్'లో వాటికి ఢోకా లేదు. ముందుగా ఐదారు ఎలివేషన్ సీన్లు రాసుకుని.. వాటి చుట్టూ సగటు కథను అల్లినట్లు అనిపిస్తుంది 'డాకు మహారాజ్' చూస్తుంటే. ముఖ్యంగా విలన్ చేసిన అరాచకాన్ని చూసి రగిలిపోయిన హీరో.. తన ఇంటికే వెళ్లి విధ్వంసం సృష్టించే ఎపిసోడ్ 'డాకు..'లో హైలైట్ గా నిలుస్తుంది. ఇసుక తుఫాను నేపథ్యంలో వచ్చే మరో ఎపిసోడ్ సైతం బాలయ్య అభిమానులకు గూస్ బంప్స్ ఇస్తుంది. బాలయ్య ఇలాంటి సీన్లు చేయడం కొత్త కాదు. కానీ ఎన్నిసార్లు చూసినా సరే సన్నివేశంలో తగిన ఎమోషన్ ఉంటే.. ఇలాంటివి మళ్లీ మళ్లీ వర్కవుట్ అవుతాయి. 'డాకు..'లో కూడా అదే జరిగింది. సినిమాలో ప్రతి యాక్షన్ బ్లాక్ కూడా బాగా తీశారు. కథలో కీలకమైన పాప పాత్రతో ఎమోషన్ బాగానే వర్కవుట్ చేయగలిగారు. 'డాకు మహారాజ్' ఆరంభంలో కొంచెం నెమ్మదిగా అనిపించినా.. తర్వాత వేగం పుంజుకుంటుంది. హీరో-పాప మధ్య ఎమోషన్ నేపథ్యంలో కథను ముందుకు నడిపించాడు దర్శకుడు. మరీ రొటీన్ అనిపించినా సరే.. ఫ్లాష్ బ్యాక్ ఎపిసోడే సినిమాకు ఆయువుపట్టుగా మారింది. సీతారం పాత్ర డాకుగా మారే క్రమంలో వచ్చే సీన్లు బాగా పేలాయి. ఐతే ఫ్లాష్ బ్యాక్ ఒక దశ వరకు బాగానే ఉన్నా.. తర్వాత మరీ సాగతీతగా అనిపిస్తుంది. ఇంకెప్పుడు ముగుస్తుందా అనిపించేలా.. చాలా దూరం లాక్కెళ్లిపోయారు. ఆ తర్వాత వచ్చే క్లైమాక్స్ అయితే మరీ రొటీన్ అనిపిస్తుంది. యానిమల్ ఫేమ్ బాబీ డియోల్ చేశాడంటే విలన్ పాత్రలో ఏదైనా విశేషం ఉంటుందేమో అని చూస్తాం. కానీ అది సగటు ప్రతినాయకుడి పాత్రలాగే సాగుతుంది. తన వల్ల సినిమాకు కొత్తగా యాడ్ అయిందేమీ లేదు. హీరోకు ఎదురే లేదన్నట్లు చూపించడంతో కథ పరంగా క్యూరియాసిటీ ఏమీ అనిపించదు. ఇక మాస్ సినిమాల నుంచి ప్రేక్షకులు ఆశించే గ్లామర్ డోస్ ఇందులో సరిపడా లేదు. ప్రగ్యా.. శ్రద్ధ ఇద్దరూ పెర్ఫామెన్స్ ఓరియెంటెడ్ పాత్రలే చేయడం మంచి విషయమే అయినా.. వాళ్ల నుంచి గ్లామర్ ట్రీట్ ఆశించిన వాళ్లకు నిరాశ తప్పదు. ఊర్వశి రౌటెలా పాత్రతో కొంతమేర శృంగార రసాన్ని పండించాలని చేసిన ప్రయత్నం పెద్దగా ఫలించలేదు. దబిడి దిబిడి పాట వల్ల పెద్దగా ప్రయోజనం లేకపోయింది. ఓవరాల్ గా చెప్పాలంటే.. బాలయ్య నుంచి ఒక మాస్ సినిమాలో ఏం కోరుకుంటారో అవి ఈ చిత్రంలో ఉన్నాయి. ఎలివేషన్ సీన్లు.. భారీ యాక్షన్ ఘట్టాలను ఇష్టపడేవారికి 'డాకు మహారాజ్' సంతృప్తినిస్తుంది. కొత్తదనం కోరుకుంటే మాత్రం కష్టమే.

నటీనటులు:

నందమూరి బాలకృష్ణ తన అభిమానులు.. మాస్ ప్రేక్షకులు ఎలా కోరుకుంటారో అలా కనిపించాడు 'డాకు మహారాజ్'లో. గడ్డంతో 'నిప్పురవ్వ' సినిమాను గుర్తు చేసేలా ఉన్న ఆయన ఫ్లాష్ బ్యాక్ లుక్ బాగుంది. మిగతా లుక్స్ లో మామూలుగా అనిపిస్తారు. ఎప్పట్లాగే ఆవేశం ప్రదర్శించాల్సిన సన్నివేశాల్లో బాలయ్య అదరగొట్టాడు. ఎమోషనల్ సీన్లలో కూడా బాగా చేశాడు. యాక్షన్ ఘట్టాల్లో ఓకే. మిగతా సన్నివేశాల్లో మామూలుగా సాగిపోయింది ఆయన నటన. బాలయ్య నుంచి పంచ్ డైలాగులైతే ఆశించిన స్థాయిలో లేవు. ప్రగ్యా జైశ్వాల్ కు కొంత మేర నటించే అవకాశం దక్కింది ఈ చిత్రంలో. ఆ అవకాశాన్ని ఆమె బాగానే ఉపయోగించుకుంది. శ్రద్ధా శ్రీనాథ్ ను మరో హీరోయిన్ అనుకుంటాం కానీ.. ఆమె పాత్రలో ట్విస్ట్ ఉంది. అదేంటో తెరపైనే చూడాలి. ఆమె పెర్ఫామెన్స్ కూడా బాగుంది. బల్వంత్ సింగ్ పాత్రలో బాబీ డియోల్ స్క్రీన్ ప్రెజెన్స్ బాగున్నా.. క్యారెక్టర్లో కొత్తదనం లేకపోవడంతో ఆయన మార్కు చూపించడానికి అవకాశం లేకపోయింది. కథలో కీలకమైన పాత్రలో చిన్న పాప బాగా చేసింది. సహాయ పాత్రలలో సచిన్ ఖేద్కర్.. మకరంద్ దేశ్ పాండే.. రవి కాలే.. వీళ్లంతా బాగానే చేశారు. ఊర్వశి రౌటెలా గురించి పెద్దగా చెప్పుకోవడానికేమీ లేదు.

సాంకేతిక వర్గం: బాలయ్య అనగానే పూనకాలు తెచ్చేసుకునే తమన్.. మరోసారి తన నేపథ్య సంగీతంతో ప్రేక్షకుల్లో ఉత్సాహం నింపాడు. ఎలివేషన్ సీన్లు.. యాక్షన్ ఘట్టాల్లో ఆర్ఆర్ మంచి ఊపుతో సాగింది. కానీ కొన్నిచోట్ల స్కోర్ మరీ లౌడ్ అనిపిస్తుంది. వాయిద్యాల హోరు మరీ ఎక్కువ అయిపోయింది. తన పాటలు సోసోగా అనిపిస్తాయి. విజయ్ కార్తీక్ ఛాయాగ్రహణం సినిమాలో మేజర్ హైలైట్. సగటు మాస్ సినిమాలకు భిన్నమైన కలర్ గ్రేడింగ్ తో అతను సినిమాకు డిఫరెంట్ లుక్ తీసుకొచ్చాడు. విజువల్స్ ఆద్యంతం ఆకట్టుకుంటాయి. యాక్షన్ సీక్వెన్సుల్లో సినిమాటోగ్రఫీ చాలా బాగుంది. నిర్మాణ విలువలు చాలా బాగున్నాయి. చాలా రిచ్ గా తీశారు సినిమాను. భాను-నందు మాటలు కొన్ని చోట్ల పేలాయి. బాబీ ఎంచుకున్న కథ రొటీన్. దానికి అతను.. చక్రవర్తి కలిసి చేసుకున్న స్క్రీన్ ప్లే పర్వాలేదనిపిస్తుంది. బాబీ కథ కంటే టేకింగ్ మీద దృష్టిపెట్టాడు. సినిమాలో కీలకమైన ఎపిసోడ్లను ఆకర్షణీయంగా తీర్చిదిద్దాడు. హీరో ఎలివేషన్లకు ఢోకా లేకుండా చూసుకున్నాడు. అతను ప్రధానంగా బాలయ్య అభిమానులను దృష్టిలో ఉంచుకునే సినిమా తీసినట్లు అనిపిస్తుంది. వారినైతే సంతృప్తిపరిచాడు కానీ.. కొత్తగా ఏమీ చేయలేకపోయాడు. చివరగా: డాకు మహారాజ్.. బాలయ్య మార్కు మాస్ రేటింగ్- 2.5 /5

## 'సంక్రాంతికి వస్తున్నాం'.. సెన్సేషనల్ అడ్వాన్స్ బుకింగ్స్..!

వి క్టరీ వెంకటేష్, బ్లాక్ బస్టర్ డైరెక్టర్ అనిల్ రావిపూడి కాంబినేషన్ లో రూపొందిన "సంక్రాంతికి వస్తున్నాం" సినిమా సంక్రాంతి కానుకగా విడుదల కాబోతోంది. 'ఎఫ్ 2' 'ఎఫ్ 3' వంటి కమర్షియల్ విజయాల తర్వాత వీరిద్దరి కలయికలో వస్తోన్న ఈ సినిమాపై మంచి అంచనాలు ఏర్పడ్డాయి. ఇప్పటికే రిలీజైన ప్రమోషనల్ మెటీరియల్ కు ఆడియన్స్ నుంచి మంచి రెస్పాన్స్ వచ్చింది. పాటలు సెన్సేషనల్ హిట్ గా నిలిచి సినిమాపై హ్యూజ్ బజ్ క్రియేట్ చేశాయి. పర్ఫెక్ట్ ఫెస్టివల్ కంటెంట్ తో రాబోతున్నట్లు ట్రైలర్ తో అందరికీ ఓ క్లారిటీ వచ్చేసింది. దీంతో రిలీజ్ కు ముందే అడ్వాన్స్ బుకింగ్స్ లో ఈ మూవీ ట్రెండ్ క్రియేట్ చేస్తోంది. 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమా జనవరి 14వ తేదీన థియేటర్లలోకి రాబోతోంది. ఆల్రెడీ అడ్వాన్స్ బుకింగ్స్ ఓపెన్ అయ్యాయి. రెండు తెలుగు రాష్ట్రాలలో టికెట్ బుకింగ్స్ అద్భుతంగా జరుగుతున్నాయి. బుక్ మై షో ఆన్ లైన్ టికెట్ బుకింగ్ యాప్ లో ఈ మూవీ ట్రెండింగ్ లో ఉంది. ఇంకా 2 రోజులు మిగిలి ఉండగానే, హైదరాబాద్ లో అడ్వాన్స్ సేల్స్ ద్వారా 1.6 కోట్లకు పైగా కలెక్షన్స్ వచ్చాయి. యూఎస్ఏతో సహా అనేక ఇతర ప్రాంతాల్లోనూ ఇదే ట్రెండ్ కొనసాగుతోంది. నైజాంలోనే పరిస్థితి ఇలా ఉంటే, ఇంక ఆంధ్రాలో ఓపెనింగ్స్ ఎలా ఉంటాయో ఊహించుకోవచ్చు. ఇది ఖచ్చితంగా వెంకటేష్ కెరీర్‌లోనే అతిపెద్ద ఓపెనింగ్ అవుతుందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇది హౌస్ ఫుల్ సంక్రాంతి అవుతుందని భావిస్తున్నారు. %ూశ్రీంశీ =ముఃం% - స్టార్ హీరోయిన్‌కు ఇదే చిట్ట చివరి ఛాన్స్ గతంలో వెంకటేష్ నటించిన చాలా సినిమాలు సంక్రాంతికి వచ్చి మంచి విజయాలు అందుకున్నాయి. ఫ్యామిలీ కంటెంట్ తో వచ్చిన ప్రతీసారి ఆయనకు బ్లాక్ బస్టర్ హిట్స్ పడ్డాయి. ఈసారి ఫెస్టివల్ కి అన్ని వర్గాలను ఆకట్టుకునే బొమ్మతో రాబోతున్నట్లు 'సంక్రాంతికి వస్తున్నాం' సాంగ్స్, ట్రైలర్ తోనే హింట్ ఇచ్చారు. ముఖ్యంగా ఫ్యామిలీ ఆడియన్స్ ను ఆకట్టుకునే క్లీన్ ఎంటర్టైనింగ్ ఫిల్మ్ తో రాబోతున్నట్లు మేకర్స్ స్పష్టం చేసారు. ప్రమోషన్స్ కూడా చాలా గట్టిగా చేస్తున్నారు. వెంకీ స్వయంగా రంగంలోకి దిగి, ఎన్నడూ లేని విధంగా దూకుడుగా ప్రచారం చేస్తున్నారు. స్టేజ్ మీద పాట పాడి, డ్యాన్సులు చేస్తున్నారు. ప్రమోషన్స్ ని కూడా జనాలు చాలా ఎంజాయ్ చేస్తున్నారంటేనే, ఈ సినిమాకి ఎలాంటి క్రేజ్ ఉందనేది అర్థం అవుతుంది. ఎక్స్ కాప్, ఎక్స్ గర్ల్ ఫ్రెండ్, ఎక్సలెంట్ వైఫ్ మధ్య సాగే కథాంశంతో 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాని తెరకెక్కించారు. అనిల్ రావిపూడి శైలి ఎంటర్టైన్మెంట్ కి క్రైమ్ ఎలిమెంట్ ని మిక్స్ చేసినట్లు తెలుస్తోంది. ఎంటర్ టైన్మెంట్ చాలా ఫ్రెష్ గా వుంటుందని, క్లైమాక్స్ చాలా సర్ ప్రైజ్ చేస్తుందని చిత్ర బృందం చెబుతోంది. ఇందులో వెంకటేష్ సరసన మీనాక్షి చౌదరి, ఐశ్వర్య రాజేష్ హీరోయిన్స్ గా నటించారు. ఉపేంద్ర లిమాయే, సాయి కుమార్, నరేష్ వీకే, వీటీ గణేష్, అవసరాల శ్రీనివాస్, మురళీధర్ గౌడ్, పమ్మి సాయి తదితరులు కీలక పాత్రలు పోషించారు. దిల్ రాజు సమర్పణలో శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై శిరీష్ ఈ సినిమాని నిర్మించారు. సెన్సేషనల్ కంపోజర్ భీమ్స్ సిసిరోలియో సంగీతం సమకూర్చారు. ప్రముఖ సంగీత దర్శకుడు రమణ గోగుల 'గోదారి గట్టు' పాట పాడగా.. వెంకటేష్ 'బ్లాక్ బస్టర్ పొంగల్' సాంగ్ ను ఆలపించడం విశేషం. ఎస్ కృష్ణ %ఱ% జి ఆదినారాయణ స్క్రీన్‌ప్లే అందించిన ఈ చిత్రానికి సమీర్ రెడ్డి సినిమాటోగ్రఫీ నిర్వహించారు. ఎఎస్ ప్రకాష్ ప్రొడక్షన్ డిజైనర్ గా, తమ్మిరాజు ఎడిటర్ గా వర్క్ చేసారు. పొంగల్ స్పెషల్ గా గ్రాండ్ గా రిలీజ్ కాబోతున్న 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమా బాక్సాఫీస్ వద్ద ఎలాంటి సక్సెస్ సాధిస్తుందో చూడాలి.





## తడిసిన అందాలతో శ్రద్ధా గ్లామర్ మెరుపు!

టాలీవుడ్ కు పరిచయమైనప్పటి నుండి శ్రద్ధా దాస్ అందరినీ తన అందంతో ఆకట్టుకుంటోంది. తాజాగా ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన ఫోటోల్లో రెడ్ అవుట్‌ఫిట్‌లో తన గ్లామర్ షోకి మరింత నూతనతను తెచ్చింది. ఫోటోలలో శ్రద్ధా స్లిట్ డ్రెస్‌లో స్టైలిష్‌గా, అదే సమయంలో తన ఫిట్‌నెస్‌తో అందర్నీ మంత్రముగ్ధులను చేస్తోంది. ఫోటోల బ్యాక్‌గ్రౌండ్‌లోని గ్రీనరీ, శ్రద్ధా కూల్ లుక్‌కి మరింత అందాన్ని జోడించింది. / శ్రద్ధా దాస్ కెరీర్ విషయానికి వస్తే, "సిద్దూ ఫ్రమ్ శ్రీకాకుళం" సినిమాతో ఆమె తెలుగు చిత్రసీమలో అడుగుపెట్టింది. ఆ తర్వాత ఆర్య 2, డార్లింగ్ వంటి చిత్రాల్లో నటించి, మంచి గుర్తింపును సంపాదించుకుంది. హిందీ, కన్నడ, బెంగాలీ వంటి భాషల్లో కూడా తన ప్రతిభను చాటుకున్న శ్రద్ధా, ప్రత్యేకమైన కథలతో ప్రేక్షకుల ముందుకు వస్తూ ఉంటుంది. "భాకీ: ది బీహార్ ఛాప్టర్" వంటి వెబ్‌సిరీస్‌ల ద్వారా కూడా ఆమె డిజిటల్ ప్లాట్‌ఫాంలో తన కేరియర్‌కి కొత్త రంగులు అద్దింది. సోషల్ మీడియాలో శ్రద్ధా దాస్ తనకంటూ ప్రత్యేక గుర్తింపును ఏర్పరచుకుంది. తరచూ గ్లామర్ పిక్స్‌తో నెటిజన్లను అలరిస్తూ, ఆమె ఫోటోలు నెట్టింట్లో వైరల్ అవుతుంటాయి. ప్రత్యేకించి ఈ మధ్య షేర్ చేసిన రెడ్ అవుట్‌ఫిట్ ఫోటోలు, ఆమె స్టైల్ స్టేట్‌మెంట్‌కి కొత్త దిశగా చూపిస్తున్నాయి. షవర్ సెట్ ఫోటోలతో ఆమె తేజస్సు మరింత హైలైట్ అయ్యింది. ఇప్పుడు ఆమె ప్రేక్షకులను ఆకట్టుకునే మరో క్రైమ్ థ్రిల్లర్‌తో తెరపైకి రాబోతోంది. వెబ్‌సిరీస్‌లు, సినిమాలు రెండింటిలోనూ శ్రద్ధా తన ప్రస్థానాన్ని మరింత ఎత్తుకి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తోంది. నటనతో పాటు గ్లామర్‌కి కూడా తగినంత ప్రాధాన్యత ఇస్తున్న ఈ అందాల తార, ప్రస్తుతం ఫిట్‌నెస్ పైన మరింత ఫోకస్ చేస్తోంది. మరి అమ్మడికి భవిష్యత్తులో ఎలాంటి అవకాశాలు వస్తాయో చూడాలి.

## రష్మిక కాలి గాయం ఎంత పని చేసింది!





వరుస చిత్రాలతో గత ఏడాది అంతా బిజీ బిజీగా ఉంది రష్మిక మందన్న. ఇటీవలే విడుదలై బ్లాక్ బస్టర్ హిట్ అయిన 'పుష్ప 2' విజయాన్ని ఆస్వాదిస్తూనే, వరుసగా సెట్స్ పై ఉన్న సినిమాలను పూర్తి చేస్తోంది. సికందర్, థామ, కుబేర చిత్రాల కోసం రష్మిక లొకేషన్స్ షిఫ్టవుతూనే ఉంది. / అయితే అనూహ్యంగా ఇంత బిజీలోనూ ఊహించని ట్విస్టు ఎదురైంది. ప్రస్తుతం సెట్స్ పై ఉన్న సినిమాల నిర్మాతలు రష్మిక తేదీలను రీషెడ్యూల్ చేయాల్సిన పరిస్థితి. దానికి కారణమేమిటో రష్మిక తాజాగా షేర్ చేసిన ఈ ఫోటోగ్రాఫ్ చూస్తేనే అర్థమవుతోంది. చూడగానే.. అరే రష్మికకు ఏమైంది? కాలు ఏమైనా విరిగిందా? అంటూ సందేహాలు వ్యక్తమవుతున్నాయి. రష్మిక మందన్న కాలికి గాయమైంది. జిమ్ లో కసరత్తులు చేస్తుండగా గాయానికి గురైన పాదం ఫోటోలను ఇన్‌స్టాగ్రామ్ లో షేర్ చేసింది. "సరే... నాకు నూతన సంవత్సర శుభాకాంక్షలు! నా పవిత్ర జిమ్ మందిరంలో నన్ను నేను గాయపరచుకున్నాను. ఇప్పుడు నేను రానున్న కొన్ని వారాలు లేదా నెలలు 'హాప్ మోడ్'లో ఉన్నాను.. దేవుడికి మాత్రమే తెలుసు.. కాబట్టి నేను థామ, సికందర్, కుబేర కోసం సెట్‌లకు తిరిగి వెళ్తున్నట్టు అనిపిస్తుంది! నా దర్శకులను అడుగుతున్నాను.. ఈ ఆలస్యానికి క్షమించండి... నా కాళ్లు యుక్తసేకి (లేదా కనీసం దూకడానికి) సహకరించేలా చూసుకుని త్వరలోనే తిరిగి వస్తాను" అని వ్యాఖ్యానించింది. ఈలోగా మీకు నా అవసరం ఉంటే... నేను చాలా అధునాతనమైన బన్నీ హాప్ వర్కౌట్ చేస్తూ మూలలో ఉంటాను. హాప్ హాప్ హాప్..! అని కూడా ఛమత్కరించింది. సల్మాన్‌తో 'సికందర్' చివరి షెడ్యూల్ జనవరి 10న ముంబైలో ప్రారంభం కావాల్సి ఉంది. అయితే రష్మిక గాయం కారణంగా షూటింగ్ ను తాత్కాలికంగా నిలిపివేసారు. సికందర్ 2025 ఈద్ సందర్భంగా విడుదలవుతుంది. దీనిని %ూ=% మురుగదాస్ దర్శకత్వం వహించారు. సాజిద్ నదియాడ్వాలా నిర్మించారు. ఆయుష్మాన్ ఖురానాతో 'థామా' కూడా సెట్స్‌లో ఉంది. ఈ చిత్రం మాడాక్ సూపర్‌నేచురల్ యూనివర్స్‌లో భాగం. వాంపైర్ చుట్టూ తిరిగే కథాంశంలో రష్మిక నటించింది. ఈ సంవత్సరం దీపావళికి విడుదల అవుతుంది. ధనుష్‌తో కలిసి నటించిన 'కుబేర' కూడా 2025 లో విడుదల అవుతుంది. దీనితో పాటు రష్మిక నటించిన 'ది గర్ల్ ఫ్రెండ్' ఈ సంవత్సరం కీలక చిత్రాలలో ఒకటి.

Printed Published and owned by Gongura Srinivas Rao, Printed at M R Publications, # 6-3-1880, Vanasthalipuram, Ranga Reddy (Dist), Telangana 500070. at H.No 8-7-12/671, Sai Colony, Madhuban Colony, Rajendranagar, Ranga Reddy District, Telangana-500077, Editor: Gongura Srinivas Rao RNI Title Code :- RNI TELTEL/2024/89620